ఆదివారం
16-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 55
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఎస్ఐఆర్ గందరగోళం: విజయ్

చెన్నై:
తమిళనాడులో ఎస్ఐఆర్ ప్రక్రియపై గందరగోళంగా ఉందని తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ అన్నారు. పౌరులు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఓటరు జాబితాలో పేర్లు ఉంటాయో లేదో అనే పరిస్థితి ఉందని ఆయన ఓ వీడియో విడుదల చేశారు. నెలలో ఈ ప్రక్రియ పూర్తి చేయడాన్ని ప్రశ్నించారు. జెన్ జీ అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ తరం కీలకమన్నారు. వారి పేర్లు తొలగించే అవకాశం ఉందని విజయ్ హెచ్చరించారు.

ఐ-బొమ్మ నిర్వాహకుడి అరెస్టు

విశాలాంధ్ర-హైదరాబాద్:
దేశవ్యాప్తంగా పలు సినిమాలు, ఓటీటీ కంటెంట్లను పైరసీ చేస్తున్న ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అతడి నుంచి కీలక సమాచారం రాబట్టారు. నిందితుడు ఉపయోగించిన సర్వర్లను గుర్తించారు. నిన్న ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన అతడు కూకట్‌పల్లిలోని రెయిన్ విస్టా ఫ్లాట్‌లో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కరీబియన్ దీవుల్లో ఉంటూ ఐ-బొమ్మ నిర్వహిస్తున్న ఇమ్మడి రవి స్వస్థలం విశాఖగా పోలీసుల

- మిగతా 2 లో

ఏరో ఇంజిన్ రాజధాని

- ఏరోస్పేస్... డిఫెన్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి ప్రణాళిక
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు

విశాలాంధ్ర-హైదరాబాద్:
దేశంలోనే తెలంగాణను 2030 నాటికి "ఏరో ఇంజిన్ రాజధాని"గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇందుకోసం ప్రపంచంతో పోటీపడేలా దిగ్గజ పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యంతో "ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకోసిస్టమ్"ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు సమగ్రమైన రోడ్డు మ్యాప్ రూపొందిస్తున్నామన్నారు. 'ఎండ్ టూ ఎండ్ ఎకోసిస్టం' కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన పునాదులే ప్రస్తుతం తెలంగాణను దేశ 'స్ట్రాటెజిక్ డిఫెన్స్ హబ్' గా మార్చాయని వివరించారు. కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్, ఐఎస్ బీ, ముంజాల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ సంయుక్తాధ్వర్యంలో శనివారం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్ బీ)లో 'ఎంపవరింగ్ ఆత్మనిర్భర్ భారత్- ఇండియాస్ ఏరోస్పేస్ ... డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్' జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఏఅండ్ డీ రంగంలో నమోదవుతున్న వేగవంతమైన వృద్ధిని మనకు అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాల వల్ల గ్లోబల్ సప్లై చెయిన్ ఒత్తిడికి గురవుతుందని, ఈ తరుణంలో విశ్వసనీయమైన సరఫరాదారుల కోసం ప్రపంచం ముఖ్యంగా 'భారత్' వంటి దేశాలవైపు చూస్తోందన్నారు. గతేడాది దేశ రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రికార్డు స్థాయిలో రూ.1.5 లక్షల కోట్ల మార్కును దాటిందన్నారు. రక్షణ రంగ ఎగుమతుల్లో 12 శాతం వృద్ధి రేటు నమోదు కావడం ఈ రంగ పురోగతికి నిదర్శనమన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్య సాధనలో 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్' రంగం కీలక పాత్ర పోషించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 25కు పైగా 'ఏఅండ్ డీ' అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు, సుమారు 1500కు పైగా ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ఏరోస్పేస్ ఎగుమతుల విలువ 2023-24లో రూ.15,900 కోట్లు కాగా 2024-25లో కేవలం మొదటి తొమ్మిది నెలల్లోనే రూ.30,742 కోట్లకు పెరగడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆదిభట్లలో రూ.425 కోట్ల

- మిగతా 2 లో

శభాష్ నవీన్: రాహుల్

న్యూఢిల్లీ:
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయానికి కృషి చేసిన తెలంగాణ నేతలను ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు పలువురు నేతలు శనివారం ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిశారు. ఈ సందర్భంగా... ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు రాహుల్ శుభాకాంక్షలు తెలిపారు. ఉప ఎన్నికలో కష్టపడిన నాయకులను అభినందించారు. జూబ్లీహిల్స్ ఎన్నిక విజయం గురించి రాహుల్‌కు వివరించారు.

గెలుపోటములు సహజం: ఆర్జేడీ

పట్నా:
ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) పేర్కొంది. ఓడిపోయామని బాధపడటం, విజయం సాధించామని గర్వపడటం ఉండదని తెలిపింది. ప్రజా సేవ బాటలో సాగే ప్రయాణం అంతంలేనిదంటూ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం అనంతరం ఎక్స్‌లో ఆర్జేడీ ఓ పోస్టు పెట్టింది. 'గెలుపోటములు తప్పవు. ఆర్జేడీ పేదల పార్టీ. ఓటమి బాధ, విజయ గర్వం ఉండదు. ప్రజా సేవలో సాగే ప్రయాణానికి అంతం ఉండదు. ఇది పేదల పార్టీ. ఎల్లప్పుడు వారి పక్షాన గళం వినిపిస్తుంది' అని

- మిగతా 2 లో

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

- ప్రమాద బీమాతో కుటుంబానికి భరోసా
- గురుకులాల మెనూలో చేపలు చేర్చండి
- హుస్నాబాద్‌లో పర్యాటక అభివృద్ధి: మంత్రి పొన్నం

విశాలాంధ్ర-హైదరాబాద్:
ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్స్యశాఖ కీలకంగా మారేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ వెల్లడించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో శనివారం రూ.5.17 లక్షల వ్యయంతో మూడు లక్షల చేప

- మిగతా 2 లో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు

రూ.2.51 లక్షల నగదు స్వాధీనం
నివాసాల్లోనూ భారీగా డబ్బు, బంగారం, ఆస్తి పత్రాలు

విశాలాంధ్ర-హైదరాబాద్:
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు శనివారం సోదాలు చేశారు. తనిఖీల్లో రూ.2.51లక్షలు లెక్కలు చూపని నగదు స్వాధీనం చేసుకున్నారు. 289 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ప్రజలకు అందకుండా కార్యాలయాల్లోనే అధికారులు ఉంచుకున్నట్టు , అనుమతి లేకుండా 19 మంది ప్రైవేటు వ్యక్తులు, 60 మంది డాక్యుమెంట్ రైటర్లు కార్యాల యాల్లో తిరుగుతున్నట్టు గుర్తించారు. వివిధ కార్యాలయాల్లో సిబ్బంది ఉద్దేశపూర్వకంగా సీసీటీవీ కెమెరాలు పనిచేయకుండా చేశారని అధికారుల పరిశీలనలో తేలింది. 13 మంది సబ్ రిజిస్ట్రార్ అధికారుల ఇళ్లలో సైతం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. వారి నివాసాల్లో భారీగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం.

జమ్మూకశ్మీర్‌లో పేలుడు

తొమ్మిది మంది మృతి
32 మందికి గాయాలు

- నౌగమ్ పోలీసు స్టేషన్ వద్ద ఘటన
- ఉగ్రదాడి కాదు... ప్రమాదం: డీజీపీ

శ్రీనగర్:
జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడి కోసం సిద్ధం చేసినట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల పెట్టే ప్రమాదవశాత్తు పేలింది. ఈ ఘటనలో తొమ్మిది మంది చనిపోగా, 32 మందికి గాయాలయ్యాయి. నౌగమ్ పోలీసు స్టేషన్ వద్ద ఈ పేలుడు సంభవించింది. హర్యానాలోని ఫరీదాబాద్ నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి నమూనాలను ప్రత్యేక బృందం సేకరిస్తున్న సమయంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. అయితే ఇది ప్రమాదవశాత్తు జరిగిందేగానీ ఉగ్రదాడి కాదని జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ శనివారం స్పష్టతిచ్చారు. పోలీసు స్టేషన్ లక్ష్యంగా ఉగ్ర దాడి అన్నట్లు టీవీ ఛానళ్లు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలకు తెర దించుతూ వదంతులు వ్యాప్తి చేయొద్దని సూచించారు. ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ (ఎఫ్ఎస్ఎల్) బృందానికి చెందిన ముగ్గురు, ఇద్దరు క్రైం ఫొటోగ్రాఫర్లు, మరో ఇద్దరు రెవెన్యూ అధికారులు (మెజిస్ట్రేట్ బృంద సభ్యులు), రాష్ట్ర దర్యాప్తు సంస్థ (ఎస్ఐఏ) అధికారితో పాటు ఆ బృందంతో సంబంధమున్న దర్జీ ఒకరు ఈ ఘటనలో చనిపోయినట్లు డీజీపీ వెల్లడించారు. అలాగే గాయపడిన 32 మందిలో 27 మంది పోలీసులు కాగా ఇద్దరు రెవెన్యూ అధికారులు, మరో ముగ్గురు సామాన్య ప్రజలు అని తెలిపారు. వీరందరినీ హుటాహుటిన స్థానిక ఆసుపత్రులకు తరలించామని డీజీపీ ప్రభాత్ చెప్పారు. గత రెండు రోజులుగా నమూనాల సేకరణ జరుగుతున్నట్లు వెల్లడించారు. రాత్రి 11.20 గంటలకు ప్రమాదవశాత్తు పేలుడు సంభవించిందని డీజీపీ వివరణ ఇచ్చారు.

ఇది మేల్కొలుపు కావాలి: ఖర్గే
నిఘా వ్యవస్థలను బలోపేతం చేసుకోవడం కోసం శ్రీనగర్‌లో పేలుడు ఘటన కేంద్రానికి మేల్కొలుపు అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఉగ్రవాదం నిరోధక యంత్రాంగాన్ని బలపర్చుకోవాలని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనాన్ని తప్పించుకోలేరని స్పష్టంచేశారు. బాహ్య శక్తుల మద్దతుతో పెరుగుతున్న ఉగ్రవాదం ముప్పుపై చర్చ కోసం అఖిలపక్ష సమావేశాన్ని అత్యవసరంగా ఏర్పాటు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. నౌగమ్

- మిగతా 2 లో

పోక్సో కేసులో బీజేపీ నేతకు జీవితఖైదు

తిరువనంతపురం:
కేరళలో సంచలనం సృష్టించిన పలతాయి పోక్సో కేసులో బీజేపీ నేత కె.పద్మరాజు దోషిగా తేలాడు. అతనికి ప్రత్యేక పోక్సో కోర్టు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. అదనంగా రూ.లక్ష జరిమానా విధించింది. రాజకీయ ఒత్తిళ్ల నడుమ ఎన్నో మలుపులు తిరిగిన ఈ కేసులో ఎట్టకేలకు దోషికి శిక్ష పడటంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. నిజం గెలిచిందన్న మాట అందరి నోట వినిపించింది. బాలిక ఐదేళ్ల న్యాయ పోరాటం

- మిగతా 2 లో

రాజకీయాలకు లాలూ కుమార్తె గుడ్‌బై

పట్నా:
ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య సంచలన ప్రకటన చేశారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు శనివారం ప్రకటించారు. దీనితో పాటు తన కుటుంబంతో సంబంధాలు తెంచుకుంటున్నట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాకూటమి పరాజయం పాలైన మరుసటి రోజే రోహిణి ఆచార్య ఈ ప్రకటన చేయడం సంచలనమైంది. ఆర్జేడీ కుటుంబంలో అంతర్గత కలహాలే

- మిగతా 2 లో

కేంద్ర మాజీ మంత్రిపై బీజేపీ వేటు



న్యూఢిల్లీ:
బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే గెలుపొందిన అనంతరం బీజేపీ తన దృష్టిని రాష్ట్రంలోని రెబల్స్‌పైకి మళ్లించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకుగాను కేంద్ర మాజీ మంత్రి ఆర్కే సింగ్ సహా మరో ఇద్దరు నేతలను సస్పెండ్ చేసింది. పార్టీ నుంచి వారిని ఎందుకు బహిష్కరించకూడదో వారంలోపు వివరణ ఇవ్వాలంటూ ముగ్గురు నేతలకు బీజేపీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ నేతలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడం వల్ల బీజేపీకి నష్టం వాటిల్లిందని, పార్టీ దీనిని తీవ్రంగా పరిగణించిదని నోటీసులో పేర్కొంది. అందువల్లే శాసనమండలి సభ్యుడు అశోక్ అగర్వాల్, కతిహార్ మేయర్ ఉషా అగర్వాల్, కేంద్ర మాజీమంత్రి ఆర్కే సింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపింది. ఆర్కే సింగ్ గతంలో మాజీ దౌత్యవేత్తగా పనిచేశారు. మాజీ ప్రధాని

- మిగతా 2 లో

కాంగ్రెస్ 'రౌడీయిజం'

- గాయపడిన కార్యకర్తను పరామర్శించిన కేటీఆర్
- దాడికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలని డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్ :
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన 24 గంటలు కాకముందే కాంగ్రెస్ పార్టీ రౌడీయిజానికి పాల్పడుతోందని, దిగజారుడు రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రెహమత్ నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త రాకేష్ క్రిస్టోఫర్ నివాసానికి ఆయన వెళ్లి పరామర్శించారు. తమ పార్టీ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పోటీ చేసిన ఈ ఎన్నికలలో అధికార పార్టీ చేసిన అరాచకాలు, అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని చేసిన దుర్మార్గాలు, ఎన్నికల కమిషన్ కూడా చేష్టలు ఉడిగి చూసిన వైనం ఫలితంగానే తాము

- మిగతా 2 లో

కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే పేదలకు రక్షణ

- ఎర్రజెండా పోరాటాలతోనే ప్రజాసమస్యలకు పరిష్కారం
- అన్ని వర్గాల సంక్షేమానికి ఉద్యమించేది సీపీఐనే: కూనంనేని

విశాలాంధ్ర- హైదరాబాద్:
కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ శతవార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం జోడేఘాట్ నుంచి సీపీఐ బస్సు యాత్ర ఘనంగా ప్రారంభమైంది. జాతాను ప్రారంభించిన అనంతరం కూనంనేని మాట్లాడుతూ దేశంలో రానున్న రోజులలో కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని, ప్రజలు చట్టసభల్లో కమ్యూనిస్టులు బలంగా ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సీపీఐ ఉద్యమిస్తుందన్నారు. ముఖ్యంగా నిరుపేదల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. ఎర్రజెండా పోరాటాలతో పేదలకు భూములు దక్కుతాయని, ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. శతవార్షికోత్సవాల జాతీయస్థాయి ముగింపు సభ డిసెంబరు 26న ఖమ్మంలో జరుగుతుందని, లక్షలాదిమంది రానున్నారని వివరించారు. జాతకు నాయకత్వం వహిస్తున్న సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదాన్ని తరిమికొట్టేందుకు, సమ సమాజ నిర్మాణం కోసం కమ్యూనిస్టులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

- మిగతా 2 లో

ప్రతిపక్ష పాత్రలో బీఆర్ఎస్ 'తప్పింది'

రామన్న సోషల్ మీడియా వదిలి ప్రజల్లోకి వెళ్లాలి
హరీషన్న... పార్టీని మోసంగించొద్దు: కవిత

విశాలాంధ్ర బ్యూరో- మెదక్:
ప్రతిపక్ష పాత్ర పోషించడంలో బీఆర్ఎస్ పార్టీ తప్పిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. 'జాగృతి జనంబాట' కార్యక్రమం మెదక్ జిల్లాలో శనివారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఫలితం చూశాకనైనా బీఆర్ఎస్ ప్రతిపక్షంగా సరైన పాత్ర పోషించటం లేదన్నది స్పష్టమైందన్నారు. రామన్న

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ట్రంప్ అక్కసు... బీబీసీ ఉక్కిరిబిక్కిరి

ఐదు బిలియన్ డాలర్ల దావా వేస్తామన్న అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్: తన ప్రసంగం అర్థం మార్చిన వ్యవహారంలో ప్రముఖ వార్తా సంస్థ బీబీసీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. క్షమాపణ చెప్పినప్పటికీ కక్షసాధింపు ధోరణితో ముందుకెళుతున్నారు. ఐదు బిలియన్ డాలర్ల దావా వేస్తానని ఆ వార్తా సంస్థను ట్రంప్ బెదిరించారు. బీబీసీ తన చర్యలతో ట్రంప్ పరువుకు భంగం కలిగించినందుకు పరిహారంగా బిలియన్ డాలర్లు చెల్లించాలని ట్రంప్ న్యాయ బృందంఇప్పటికే లేఖ రాసింది. దీంతో మీడియా సంస్థ క్షమాపణ కోరింది. బిలియన్ డాలర్ల పరిహారాన్ని నిరాకరించింది. ఆ సంస్థపై దావా తప్పదంటూ ట్రంప్ అక్కసువెళ్లగక్కారు. వచ్చే వారంలో ఒక బిలియన్ డాలర్ల నుంచి ఐదు బిలియన్ డాలర్ల వరకు దావా వేయనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. ఈ వ్యవహారంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ట్రంప్ రాజకీయంగా ఒత్తిడి తేవడంతో ప్రభుత్వ నిధులతో నడిచే బీబీసీ చిక్కుల్లో పడింది. ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ చీఫ్ టర్నెస్ డెబోరా ఇప్పటికే రాజీనామా చేయాల్సి వచ్చింది. ట్రంప్‌కు బీబీసీ క్షమాపణలు కూడా చెప్పింది. జరిగిన తప్పుకు చింతిస్తున్నట్లు బీబీసీ చైర్మన్ సమీర్ షా వ్యక్తిగతంగా శ్వేతసౌధానికి లేఖ పంపారు. బిలియన్ డాలర్ల పరిహారాన్ని నిరాకరించినట్లు బీబీసీ వెల్లడించడంతో ట్రంప్ ఆ సంస్థకు తాజా హెచ్చరికలు చేశారు.

ట్రంప్ గాజా ప్రణాళికపై

రేపు ఐరాస ఓటింగ్

జెనీవా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికను ఆమోదించే తీర్మానంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సోమవారం ఓటింగ్ జరగనుంది. ఇజ్రాయిల్, గాజా మధ్య రెండేళ్ల యుద్ధానికి ముగింపుగా కాల్పుల విరమణకు సంబంధించిన ట్రంప్ ప్రణాళికను ఆమోదించడంపై అమెరికాతో పాటు 15 మంది సభ్యదేశాలతో ఐరాస భద్రతా మండలిలో అధికారికంగా చర్చలు ప్రారంభమయ్యాయి. ముసాయిదా తీర్మానం ప్రకారం గాజా కోసం పరివర్తన పాలక సంస్థ 'బోర్డ్ ఆఫ్ పీస్'ను ఏర్పాటు చేయనుంది. 2027 వరకు అమల్లో ఉండనున్న ఈ కమిటీకి ట్రంప్ అధ్యక్షత వహిస్తారు. సరిహద్దు ప్రాంతాలను సురక్షితంగా ఉంచడానికి, గాజాను సైనికీకరించడంలో సహాయపడేందుకు ఇజ్రాయిల్, ఈజిప్ట్... కొత్తగా శిక్షణ పొందిన పలస్తీనా పోలీసులతో కలిపి 'తాత్కాలిక అంతర్జాతీయ స్థిరీకరణ దళం (ఐఎస్ఎఫ్)' ఏర్పాటుకు సభ్యదేశాలకు అధికారం ఇస్తుంది. భద్రతామండలి తీర్మానానికి అమెరికా, ఖతార్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, యుఏఈ, టర్కీ, ఇండోనేషియా, పాకిస్థాన్, జోర్డాన్ మద్దతు తెలిపాయి. ఈ తీర్మానాన్ని తిరస్కరించడమంటే హమాస్ పాలన కొనసాగింపు లేదా ఇజ్రాయిల్‌తో యుద్ధం కొనసాగింపునకు ఆమోదం తెలపడమే అవుతుంది. శాశ్వత ఘర్షణకు అంగీకరించమే అవుతుంది అని అమెరికా రాయబారి మైక్ వాల్జ్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్-పలస్తీనా సమస్య పరిష్కారానికి రెండు రాష్ట్రాల ఏర్పాటు అనే సూత్రాన్ని గుర్తించడానికి బదులుగా ఈ ప్రతిపాదన భిన్నంగా ఉందని అమెరికాకు రష్యా రాయబారి పేర్కొన్నారు. ఈ నిబంధనలకు అమెరికా ముసాయిదా తగిన గౌరవం ఇవ్వలేదని అన్నారు.

కేంద్ర మాజీమంత్రిపై బీజేపీ వేటు

(మొదటిపేజీ తరువాయి)

మన్మోహన్ సింగ్ హయాంలో హోంశాఖ కార్యదర్శిగానూ విధులు నిర్వహించారు. 2013లో బీజేపీలో చేరారు. 2014, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రెండుసార్లు ఆరా నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2017లో మోదీ మంత్రివర్గంలో కేంద్ర విద్యుత్ మంత్రిగా పని చేశారు. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయారు. అప్పటి నుంచి ఆర్కే సింగ్ బీజేపీ, కేంద్ర ప్రభుత్వంపై విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ బీహార్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో పార్టీ నాయకత్వం ఈ చర్యలు తీసుకుంది.

లక్షకుపైగా గ్లైడ్ బాంబుల తయారీ

రష్యాపై ఉక్రెయిన్ ఆరోపణ

కీవ్: రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం భీకరంగా సాగుతోంది. శాంతి కోసం చర్చలు ఫలించలేదు. క్షిపణి, డ్రోన్లతో పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఇదే క్రమంలో రష్యాపై ఉక్రెయిన్ తీవ్ర ఆరోపణలు చేసింది. 1,20,000 గ్లైడ్ బాంబులను తయారు చేయడానికి రష్యా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొంది. వీటిలో 500 కొత్త సుదూర లక్ష్యాలను ధ్వంసం చేయగల బాంబులు ఉన్నాయని తెలిపింది. డిసెంబరు నాటికి ఈ బాంబులు తయారవుతాయని, 12 కిమీల దూరంలోని లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యాన్ని ఇవి కలిగి ఉంటాయని ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ అధికారి వెల్లడించారు. వందల గ్లైడ్ బాంబులతో రష్యా నిత్యం ఉక్రెయిన్‌పై దాడులు చేస్తోందన్నారు.

400 కిమీలలోని లక్ష్యాలను ధ్వంసం చేసే బాంబుల తయారీకి రష్యా ప్రణాళికలు రూపొందిస్తోందని అన్నారు. ఈ బాంబులతో ఉక్రెయిన్‌కు తీవ్ర నష్టం జరగవచ్చని, వాటిని ఎదుర్కోవడానికి తమ సైన్యం సన్నద్ధమవుతున్నదన్నారు.

జమ్మూకశ్మీర్‌లో పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసు స్టేషన్ వద్ద పేలుడులో మరణాలు సంభవించడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. గాయపడిన వారికి అత్యవసరంగా వైద్యం అందాలని, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని ఖర్గే ఎక్స్ మాధ్యమంగా కోరారు. దిల్లీలో ఎర్ర కోట వద్ద పరికిపంద చర్య తర్వాత పరిణామాల దృష్ట్యా తాజా ఘటన జరగడం ఇంటెలిజెన్స్, యాంటీ టెర్రర్ మెకానిజమ్స్ బలోపేతానికి కేంద్రప్రభుత్వం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలనేందుకు సంకేతమన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు కాంగ్రెస్ అండగా ఉంటుందని ఖర్గే అన్నారు.

కాంగ్రెస్ 'రౌడీయిజం'

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతికంగా ఓడిపోయామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చర్యలను ఖండిస్తూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. 'పదేళ్లు మేము ప్రభుత్వంలో ఉన్నప్పుడు మీరు ప్రతిపక్షంలో ఉన్నారు. ఎన్నడన్నా మా ప్రభుత్వ హయాంలో మా కార్యకర్తలు హద్దులు దాటి ఈరోజు రాకేష్ క్రిస్టోఫర్‌పై జరిగిన దాడిలా ప్రవర్తించారా? ఒక ఉప ఎన్నికల్లో గెలిచిన వెంటనే, నిన్న మీ వాళ్లు మా పార్టీ గుర్తు కారును ఊరేగింపు చేస్తూ, అవహేళన చేస్తూ చిల్లరగా ప్రవర్తించారు. గతంలో ఏడు ఉప ఎన్నికల్లో, కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచినప్పుడు మేము ఎప్పుడయినా ఇలా ప్రవర్తించామా? అహంకారం ఎవరిదో, ఆత్మ విశ్వాసం ఎవరిదో తెలంగాణ ప్రజలే నిర్ణయిస్తారు. ఒక ఎన్నికల్లో గెలుపుతోనే ఇంత మిడిసిపడితే, గతంలో పదేళ్ల పాటు అప్రతిహతంగా అన్ని ఎన్నికలు గెలిచిన మేము ఎలా ప్రవర్తించి ఉండాలో ఆలోచించుకోండి' అని అన్నారు. సోదరుడు రాకేష్ క్రిస్టోఫర్ మీద, ఒక క్రిస్టియన్ మైనారిటీ సోదరుడి మీద జరిగిన ఈ దాడిని తాను పూర్తిగా ఖండిస్తున్నానని, ఈ దాడికి కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, కానీ ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా ఈ రకంగా కక్షపూరితంగా రౌడీయిజం చేస్తామంటే తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని... తగిన సమయంలో తగిన విధంగా బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సందర్భంగా రాకేష్ క్రిస్టోఫర్ కుటుంబాన్ని కలిసినట్టు కేటీఆర్ తెలిపారు. విష్ణువర్ధన్ రెడ్డి, సునీత, కౌశిక్ రెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు సహా నాయకులందరం కలిసి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పడానికి వచ్చామని వెల్లడించారు. కార్యకర్తలకు భరోసా ఇస్తూ, 'జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో ఏ కార్యకర్తకి ఏం జరిగినా, కంటికి రెప్పలాగా కాపాడుకునే బాధ్యత నాది, పార్టీది. వదిలిపెట్టే సమస్య లేదు. ఎక్కడ ఎవరికి ఏ చిన్న నొప్పి కలిగినా తప్పకుండా ఇదే రకంగా వారి ఇంటి ముందుకు వస్తాం' అని హామీ ఇచ్చారు. చివరగా, ఇన్ని రిగ్గింగ్‌లు, గూండాగిరి, దొంగ ఓట్లు, పైసలు, చీరలు, కుక్కర్లు పంచినా కూడా మా అభ్యర్థికి 75,000 ఓట్లు వచ్చాయని, ఇది స్వల్ప సంఖ్య కాదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు సంయమనంతో వ్యవహరించకపోతే, తప్పకుండా ప్రజలు బుద్ధి చెప్పే విధంగా ప్రజలను చైతన్యం చేస్తామని స్పష్టం చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తామని, ఆ రోజు మిగతా అన్ని విషయాలు మాట్లాడతామని, భవిష్యత్‌లో జూబ్లీహిల్స్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగరేస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

పోక్సో కేసులో బీజేపీ నేతకు జీవితఖైదు

(మొదటిపేజీ తరువాయి)

ఫలించిందని, ఆమెకు న్యాయం జరిగిందని న్యాయవాదులు అన్నారు. ఈ కేసులో తీర్పు అందరికీ ఎప్పటికీ గుర్తు ఉండిపోతుందని తెలిపారు. పదేళ్ల ముస్లిం బాలికను స్కూలు లోపల, బయట లైంగికంగా వేధించిన బీజేపీ నేత, స్కూలు టీచరు కె.పద్మరాజన్ అలియాస్ పప్పన్ మస్టర్‌కు శిక్ష విధిస్తూ జస్టిస్ ఎంటీ జలజరాణి తీర్పు ఇచ్చారు. రూ.లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఏడాది శిక్ష తప్పదన్నారు. పోక్సో చట్టంలోని రెండు వేర్వేరు సెక్షన్ల కింద ఆయనకు మొత్తం 40 ఏళ్ల శిక్ష పడింది. మరో రూ.లక్ష జరిమానా అంటే మొత్తం రూ.2 లక్షలు అతను చెల్లించాలి. బీజేపీ త్రిప్పగొట్టూరు పంచాయతీ అధ్యక్షుడిగా, సంఘ్ పరివార్ టీచర్ల సంఘానికి జిల్లా నాయకుడిగా పద్మరాజన్ పనిచేశాడు. ఇది 2020 నాటి వ్యవహారం కాగా మార్చి 18న అధికారికంగా ఫిర్యాదు దాఖలైంది. ఆపై నెల రోజులకు అంటే ఏప్రిల్ 15న అతను అరెస్టు అయ్యాడు. తొలుత కన్నూర్ పోలీసులు విచారణ చేపట్టారు. రాజకీయంగా పలుకుబడితో కేసును నీరుగార్చే ప్రయత్నాన్ని పద్మరాజన్ చేశాడు. సీనియర్ అధికారులు జోక్యంతో ఒక దశలో పోక్సో చట్టాన్నే తొలగించారు. దీంతో కేరళవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. బాలిక తల్లి పట్టువిడవలేదు. కేరళ హైకోర్టును ఆశ్రయించారు. దర్యాప్తును తప్పుదోవ పట్టించడమే కాకుండా ఉన్నతస్థాయి రాజకీయ జోక్యంతో కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని మొరపెట్టుకున్నారు. తీర్పును స్వాగతిస్తున్నట్లు ప్రత్యేక ప్రాసిక్యూటర్ బీనా అన్నారు. బాలికకు న్యాయం జరిగిందని, నిజం గెలిచిందని దర్యాప్తు బృంద సభ్యుడు ఎస్ఐ రమేశన్ తెలిపారు. ఈ కేసును కొట్టివేసేందుకు విఫల ప్రయత్నాలు జరిగినట్లు వెల్లడించారు. బాలిక ఐదేళ్ల పాటు అనుభవించిన వేదనను ఎవరూ అర్థం చేసుకోలేరని అడ్వకేట్ జనైసే అన్నారు. పిల్లలను టీచర్లు వేధించరాదన్నారు. చిన్నారి అబద్ధం చెబుతున్నట్లు ముద్ర వేశారు కానీ ఆమె కుటుంబం వెన్నుదన్నుగా నిలిచిందని, న్యాయ పోరాటానికి సాగించిందని న్యాయవాది తెలిపారు. 'తండ్రి లేని ఈ బాలిక ఎల్ఎస్ఎస్ స్కాలర్‌షిప్పు గ్రహీత. ఆమె తన జీవితంలో ఐదేళ్లు కోల్పోయింది. బాలికకు జరిగిన నష్టాన్ని ఏ తీర్పు భర్తీ చేయలేదు కానీ ఈ తీర్పు సానుకూల ముందడుగు' అని అన్నారు. సంఘ్ పరివార్ నియంతృత శక్తిమంతమైన యంత్రాంగానికి వ్యతిరేకంగా పౌర సమాజం పోరాటంలో ఘన విజయంగా పలతాయి కేసు తీర్పు నిలిచిపోతుందని న్యాయవాది అమీన్ హసన్ అన్నారు.

ఐ-బొమ్మ నిర్వాహకుడి అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

విచారణలో వెల్లడైంది. కూకట్‌పల్లిలోని అపార్ట్‌మెంట్‌లో అతడి ఫ్లాట్ నుంచి హార్డ్ డిస్కులు, కంప్యూటర్లు, కొన్ని సినిమాలకు సంబంధించిన హెచ్‌డీ ప్రింట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐ-బొమ్మ వెబ్‌సైట్, సర్వర్ నుంచి సమాచారం సేకరించిన సైబర్ క్రైమ్ పోలీసులు... అప్‌లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న కొన్ని సినిమాల కంటెంట్‌ను నిలిపివేసినట్లు సమాచారం. పైరసీ ద్వారా కొన్నేళ్లుగా రూ.వందల కోట్లు ఇమ్మడి రవి సంపాదించినట్టుగా గుర్తించారు. ఐ-బొమ్మ కారణంగా సినిమా పరిశ్రమకు కొన్నేళ్లుగా రూ.22 వేల కోట్ల నష్టం వాటిల్లిందని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మరి కొన్ని రోజుల్లో ఆ వెబ్‌సైట్‌ను మూసివేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు. ఏపీ, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఐ బొమ్మపై కేసులు నమోదయ్యాయి. పైరసీ నిర్వాకం మొత్తం ఇతను ఒక్కడే చేస్తున్నాడా? ఇతని వెనుక ఎవరెవరు ఉన్నారు? నెట్ వర్క్ ఎక్కడెక్కడ ఉంది? అనే అంశాలపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. తెలుగు సినిమాలను పైరసీ చేయడంపై గతంలో ఐ-బొమ్మపై తెలుగు ఫిల్మ్ యాంటీ పైరసీ టీమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

పిల్లలు వదిలారు. దీని ద్వారా 253 మంది మత్స్య కార కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. నియోజకవర్గం మొత్తం 165 చెరువులకు గాను 38 లక్షల 92 వేల ఉచిత చేప పిల్లలు వదలనున్నారు. ఈ పథకం వల్ల నియోజకవర్గంలో 4,144 మంది మత్స్య కారుల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. ఇప్పటికే నియోజకవర్గంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు మూడు మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్‌లు అందించారు. ప్రమాదవశాత్తు మత్స్యకారులు మరణిస్తే వారికి గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా రూ.ఐదు లక్షలు బీమా కల్పిస్తూ వారికి కుటుంబానికి భరోసా కల్పిస్తుంది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ హుస్నాబాద్‌లో మత్స్య సంపద మరింత వృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధునాతన వెటర్నరీ ఆసుపత్రిని నిర్మించాలని, అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న మోడర్న్ చేపల మార్కెట్‌ను పూర్తి చేయాలని, వెటర్నరీ డాక్టర్ పోస్టు మంజూరు చేయాలని,గోపాల మిత్ర సమస్యలు పరిష్కరించాలని ఆ శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. గురుకులాల్లో మటన్ ,చికెన్ వలెనే చేపలు కూడా మెనూలో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎల్లమ్మ చెరువు లో రొయ్య పిల్లలు వేయాలని కోరారు. హుస్నాబాద్‌లో టూరిజం అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. మంత్రి శ్రీహరి మాట్లాడుతూ మత్స్య శాఖకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.123 కోట్లు కేటాయించారనీ దానికి మంత్రి పొన్నం కీలక పాత్ర పోషించారని తెలిపారు. 84 కోట్ల చేపపిల్లలు , 10 కోట్ల రొయ్య పిల్లలు రాష్ట్రంలో 26 వేల నీటి వనరుల్లో వేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది మత్స్య కారుల కుటుంబాలు ఉన్నాయని వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. చేపల ఉత్పత్తి కేంద్రాలు గణనీయంగా పెంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అత్యాధునిక సదుపాయాలతో చేపల మార్కెట్లు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు కోటి40 లక్షలతో ఇన్సూరెన్స్ పాలసీ తీసుకొని వచ్చామని పేర్కొన్నారు. చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా చేస్తున్నామని సాయి కుమార్ వెల్లడించారు.

కలెక్టర్ హైమావతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్ ,సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మత్స్య సహకార సంఘం నాయకులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

రాజకీయాలకు లాలూ కుమార్తె గుడ్‌బై

(మొదటిపేజీ తరువాయి)

ఇందుకు దారితీసుండవచ్చనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు రోహిణి ఆచార్య చేసిన ప్రకటనలో సంజయ్ యాదవ్, రమీజ్ అనే ఇద్దరిని కూడా ఆమె ప్రస్తావించారు. 'నేను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారు. నా కుటుంబాన్ని కూడా వదులుకుంటున్నాను. సంజయ్ యాదవ్, రమీజ్ అడిగింది కూడా ఇదే. నేను ఈ నిందనంతా స్వీకరిస్తున్నాను' అని ఆ ట్వీట్‌లో రోహిణి ఆచార్య పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాల తర్వాత కుటుంబంలో ఏర్పడిన అంతర్గత కలహాలు, పార్టీ ఓటమికి రోహిణి ఆచార్యను బాధ్యురాలిని చేస్తూ ఆమెపై ఒత్తిడి తేవడం తాజా రాజీనామాకు కారణం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. దీనికి ముందు లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను కూడా పార్టీ నుంచి, కుటుంబం నుంచి లాలూప్రసాద్ బహిష్కరించారు. దీంతో తేజ్ ప్రతాప్ సొంతంగా జనశక్తి జనతాదళ్ (జేజేడీ) పార్టీని ఏర్పాటు చేసి... బీహార్ ఎన్నికల్లో మహువా నియోజకవర్గం నుంచి పోటీ చేశారు.

ప్రతిపక్ష పాత్రలో బీఆర్ఎస్ 'తప్పింది'

(మొదటిపేజీ తరువాయి)

సోషల్ మీడియాను వదిలి ప్రజల్లోకి వెళ్లాలన్నారు. హరీషన్న పార్టీని మోసం చేయటం మానుకోవాలని సూచించారు. హరీశ్‌రావు సతీమణి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల్లో టెండర్లు లేకుండా పాల సరఫరా చేశారన్న విషయాన్ని సీఎం పీఆర్వో 2024 లో ట్వీట్ చేశారని, నాలుగు రోజులకే ఆ ట్వీట్ మాయమైందన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విత్ డ్రా చేసుకుని కొంతమంది నా దగ్గరి కి వచ్చిన వాళ్లే హరీశ్‌రావు దగ్గరికి వెళితే మీ ఇష్టం అని అన్నారని కవిత చెప్పారు. బీఆర్ఎస్ లో ఉండి కూడా మీ ఇష్టం అంటారా... అంటే పార్టీని మోసం చేయటం కాదా అని ఆమె ప్రశ్నించారు.

హరీశ్‌రావు, గంగుల కోసమే అలైన్‌మెంట్ మార్పు

నర్సాపూర్ రెడ్డిపల్లి వద్ద ముగ్గురు బీఆర్ఎస్ నాయకుల భూములను కాపాడేందుకు ఆలైన్‌మెంట్ మార్చారని కవిత ఆరోపించారు. పెద్ద వాళ్ల కోసం చిన్న రైతుల భూములు తీసుకుంటున్నారు. రెడ్డిపల్లి, చిప్పలతుర్తి, తునికి మధ్య నాలుగు వందల ఎకరాల భూమి హరీశ్‌రావుకు ఉంది. ఆయన భూమి కోసం ఆలైన్ మెంట్ మార్చారు.ఆ స్థలంలో పెద్ద రిసార్ట్ కట్టారు. చిన్న చింతకుంటలో గంగుల కమలాకర్ కు చెందిన 15 ఎకరాల కోసం అలైన్‌మెంట్ మార్చారు. ఎమ్మెల్సీ నవీన్ రావు 18 ఎకరాల భూమి కోసం అదేవిధంగా చేశారు... ఈ విషయాలన్నీ నాకు రైతులే చెప్పారు. మరి నిజమా కాదా ... ఆ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రశ్నించే శక్తిగా జాగృతి...

జాగృతి సంస్థ ప్రశ్నించే శక్తిగా ప్రజల వజ్రాయుధంగా మారుతుందని కవిత పేర్కొన్నారు. ప్రస్తుతం పార్టీ పెట్టటం కన్నా కూడా ప్రజల పక్షాన నిలబడటం ముఖ్యమన్నారు. తాను ఏ పార్టీలోకి పోనని స్పష్టం చేశారు. కేసీఆర్ తండ్రిగా పిలిస్తే వెళ్తా... రాజకీయంగా అయితే వెళ్లనని స్పష్టం చేశారు. ఆర్ఆర్ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులకు మూడు విడతలుగా డబ్బులు ఇస్తామని కలెక్టర్ చెప్పారంట. అలా అయితే ఎకరాకు కోటి రూపాయలు మూడు విడతలుగా ఇస్తామని కలెక్టర్ రాతపూర్వకంగా హామీ ఇస్తే ప్రజలు భూములు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. హైదరాబాద్ కు కూత వేటు దూరంలో ఉన్న మెదక్ ను చార్మినార్ జోన్ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. మారయ్య, యాదగిరి, రాజేశ్వరి, రమేష్ గౌడ్, వీరేందర్, విజయ్, తదితరులున్నారు. అంతకుముందు కూచన్ పల్లిలో పాడి రైతులతో సమావేశమయ్యారు. రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం హవెలి ఘనపూర్ మండలం లో పర్యటించారు.

గెలుపోటములు సహజం

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. 243 మంది సభ్యులు ఉండే అసెంబ్లీలో 25 స్థానాలకు ఆర్జేడీ పరిమితమైంది. 2010 తర్వాత ఇంత ఘోర పరాభవాన్ని ఆర్జేడీ ఎప్పుడు చూడలేదు. నాడు 22 స్థానాలను మాత్రమే గెలిచింది. 2020 ఎన్నికల్లో అద్భుత ప్రదర్శన ఇచ్చి 75 స్థానాలు కైవసం చేసుకుంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల వాటాను పెంచుకుంది. 23 శాతం ఓట్లు (బీజేపీ కంటే 2.92శాతం ఎక్కువ) పొందింది. జేడీయూ కంటే 3.72 శాతం అధికంగా ఆర్జేడీకి ఓట్లు వచ్చాయి. మహాకూటమి కేవలం 35 స్థానాలకు పరిమితం కాగా ఇందులో కాంగ్రెస్‌కు ఆరు, సీపీఐ(ఎంఎల్)కు రెండు, సీపీఎంకు ఒక స్థానం దక్కాయి.

ఏరో ఇంజిన్ రాజధానిగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడితో ఏర్పాటు చేసిన 'టాటా-సాఫ్రాన్' ఫెసిలిటీ అందుబాటులోకి వచ్చిందన్నారు. త్వరలోనే రూ.800 కోట్లతో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ 'యూఏవీ మాన్యూఫ్యాక్చరింగ్ యూనిట్', రూ.500 కోట్లతో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ డిఫెన్స్ ఫెసిలిటీ కూడా వస్తాయన్నారు. హీరో ఎంటర్ ప్రైజెస్ చైర్మన్ సునీల్ కాంత్ ముంజాల్, ఐఎస్ బీ డీన్ ప్రొఫెసర్ పి.మదన్, ప్రొఫెసర్ చందన్ చౌదరి పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే పేదలకు రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

కలవేన శంకర్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంట రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, లక్ష్మీనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామడుగు లక్ష్మణ్, ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి బద్రి సాయి, సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి, బద్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు అల్పపీడనాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వారం రోజుల వ్యవధిలో రెండు అల్పపీడనాలు ఏర్పడనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నైరుతి బంగాళాఖాతం శ్రీలంక తీరప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని తెలిపారు. ఇది రాగల 24 గంటల్లో పశ్చిమ - వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని వెల్లడించారు. దీని ప్రభావంతో దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ఈనెల 17వ తేదీన నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు, ప్రకాశం, కడప జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

సీఐఐ... సునామీ

అంచనాలకు మించి వచ్చిన పారిశ్రామికవేత్తలు



విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ సాగర తీరానికి పెట్టుబడుల సునామీ వచ్చింది. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు అంచనాలకు మించిన స్థాయిలో పెట్టుబడులపై ఎంఓయూలు కుదిరాయి. ఒకటి కాదు... రెండు కాదు... వందల సంఖ్యలో ఒప్పందాలు జరిగాయి. లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అదేస్థాయిలో ఉద్యోగాల కల్పనపై కంపెనీల నుంచి హామీలు లభించాయి. రెండు రోజుల పాటు జరిగిన 30వ భాగస్వామ్య సదస్సులో ఎంఓయూలు కుదుర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించగా... పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున ముందుకు రావడంతో ముందు రోజు నుంచే ఎంఓయూలు కుదుర్చుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు రోజుల పాటు సాగిన ఈ ఒప్పందాల విలువ రూ.13,25,716 కోట్ల పెట్టుబడులు కాగా... వీటి ద్వారా 16,31,188 ఉద్యోగ అవకాశాలు రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. వాస్తవానికి భాగస్వామ్య సదస్సులో భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ముందుగానే అంచనా వేసింది. రెండు రోజుల్లో సుమారుగా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని భావించింది. కానీ ఊహించని విధంగా పారిశ్రామికవేత్తలు విశాఖ నగరానికి పోటెత్తారు. ఒప్పందాల విలువ రూ.13 లక్షల కోట్లకు పైగా చేరింది. దీంతో ప్రభుత్వ వర్గాల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు చరిత్ర తిరగరాసేలా సూపర్ హిట్ అయిందని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

తిన్నింటి వాసాలు లెక్కిస్తారా...

కవిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- మెదక్: కేటీఆర్, హరీశ్‌రావులపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్, పట్టణ కన్వీనర్ మామిండ్ల ఆంజనేయులు, న్యాయవాది జీవన్ రావు మాట్లాడుతూ కవిత, మెదక్‌లో సమాజం తలదించుకునే విధంగా మాట్లాడారని, యావత్ తెలంగాణ సమాజం దీన్ని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కవిత తిన్నింటి వాసాలు లెక్కించే విధంగా, కన్న తల్లి వంటి పార్టీని, అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును విమర్శిస్తూ మాట్లాడడం సిగ్గు చేటన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై ఆమె మాట్లాడిన విధానం అవమానకర రీతిలో ఉన్నాయని కవితపై ధ్వజమెత్తారు.

2019లో బీఆర్ఎస్ 100 సీట్లు గెలిస్తే మీరు పోటీ చేసిన నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. తండ్రిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీగా ఓడిపోయి తల్లి దగ్గర వెళ్లి ఏడిస్తే కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చి ఆదరణ చూపించారు. జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత సంతోషంగా ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కల్వకుంట్ల కవిత అన్నారు. యం.అంజ గౌడ్, సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, ఆర్కే శ్రీనివాస్, భీమరి కిషోర్, వంజరి జయరాజ్, మాయ మల్లేశం, ప్రభు రెడ్డి, జుబెర్ అహ్మద్, శ్రీను నాయక్, రంజిత్, లడ్డు తదితరులున్నారు.

అణుశక్తిపై ప్రసంగం సంతృప్తినిచ్చింది

పురందేశ్వరి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: కామన్వెల్త్ సమావేశాలు, ఐక్యరాజ్య సమితి (యుఎన్ఓ) సమావేశాలలో పాల్గొనడం తనకు దక్కిన రెండు అరుదైన గౌరవాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కామన్వెల్త్ సమావేశాల్లో మహిళా సాధికారిత గురించి వివరించినట్లు చెప్పారు. యుఎన్ఓ బృందానికి నాయకత్వం వహించడం, జనరల్ అసెంబ్లీలో అణుశక్తిపై మాట్లాడడం తనకు ఆనందంగా ఉందన్నారు. వినాశనానికి కాకుండా ప్రజాహితానికి అణుశక్తిని ఎలా వినియోగించాలో వివరించినట్లు ఎంపీ చెప్పారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే 200స్థానాలకు పైగా గెలుచుకోవడం అద్భుతమన్నారు. సుపరిపాలనకు, అభివృద్ధికి, సంక్షేమానికి బీహార్ ప్రజలు స్పష్టమైన సంకేతం ఇచ్చారని పేర్కొన్నారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.270 కోట్లు తెచ్చామని ఎంపీ చెప్పారు. ఈస్ట్ రైల్వే స్టేషన్ వైపు రోడ్డు విస్తరణ పనులలో జాప్యాన్ని నివారించాలని సూచించారు. గౌతమి గ్రంథాలయానికి రూ .85 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. మోరంపూడి ఓవర్‌ఫ్లై విద్యుదీకరణకు టెండర్లు పిలిచారని, సర్వీసు రోడ్లకు కూడా మోక్షం లభిస్తుందని ఆమె వివరించారు. అనకాపల్లి నుంచి దివాన్ చెర్వు వరకు ఎన్ హెచ్ 16 ఆరులైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. మధురపూడి విమానాశ్రయం నుంచి దిల్లీ, తిరుపతిలకు విమాన సర్వీసులు తీసుకొచ్చామని, వారణాసి తదితర ప్రాంతాలకు కూడా సర్వీసులు నడపాలని కోరామని చెప్పారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం కూడా సహకారం అందించేలా తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్మల దత్తు, అడబాల రామకృష్ణ , పరిమి రాధా, ఏపీఆర్ చౌదరి ,రజిని , పడాల నాగరాజు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్ శెట్టిపల్లి శివనాగరాజు, వీర వీరాంజనేయులు, నెల ప్రసాద్, కందికొండ రమేష్ , రవిశంకర్, యానాపు యేసు ,మోదీ సత్తిబాబు ,పై బోయిన సురేంద్ర ,తగరం సురేష్ ,కొల్లాపూ శీను పాల్గొన్నారు.

వయోవృద్ధుల హక్కులపై 'వాక్‌థాన్'

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాల సందర్భంగా సూర్యాపేట పట్టణంలో శుక్రవారం వయోవృద్ధుల హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గాంధీ పార్కు నుంచి మినీ ట్యాంక్‌బండ్ (సద్దల చెరువు) వరకు జరిగిన ఈ వాక్‌థాన్‌కు మంచి స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఆయన గుర్తుచేశారు. పిల్లలు తమ తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని, నిర్లక్ష్యం చేసిన పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవన్న సందేశాన్ని ర్యాలీ సమయంలో నరసింహారావు అందించారు. ర్యాలీగా ముందుకు సాగిన వయోవృద్ధులు నినాదాలు చేస్తూ మినీ ట్యాంక్‌బండ్‌కు చేరుకున్న తర్వాత, అక్కడ వయోవృద్ధుల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల కమిటీ సభ్యులు, వయోవృద్ధుల అసోసియేషన్ అధ్యక్షులు మరియు సభ్యులు ఎస్‌డి. హమీద్ ఖాన్, కృష్ణ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, కాకి మల్లారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా సిడిపిఓలు సుబ్బలక్ష్మి, కిరణ్మయి, శ్రీజ, సూపర్వైజర్ వినోద్ కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ పూర్తి చేయాలి

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో: జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు ఆదేశించారు. గృహనిర్మాణ శాఖ పీడీ, ఆర్డీవోలు, తహసిల్దార్లతో ఆమె శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పూర్తయిన ఇళ్లను తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం పూర్తిగా పారదర్శకంగా పంపిణీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బుధవారం నాటికి లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేయాలని, లబ్ధిదారులు ఎక్కువగా ఉన్నచోట శుక్రవారం లాటరీ విధానంలో ఎంపిక చేయాలని సూచించారు. ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీకి అవసరమైన ప్రొసీడింగ్స్‌ను శనివారం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక శాసనసభ్యుల సమ్మతితో ప్రజా ప్రతినిధులు, మంత్రుల ద్వారా ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా జీవో నిబంధనల మేరకు మొత్తం వ్యవహారాన్ని నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యంగా లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొత్తం తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేయాలని ఆదేశించారు. కొన్ని ఇళ్లకు ఇప్పటికే ప్రభుత్వం చెల్లింపులు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించిన తర్వాత మిగిలిన బకాయి మొత్తాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ వివరాలు లబ్ధిదారులకు స్పష్టంగా తెలియజేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, శాసనసభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవోలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

జీఎం వెంకటరమణకు సత్కారం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: నూతనముగా ఆర్ అండ్ డి జియం కార్పొరేట్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన సి.హెచ్ వెంకటరమణకు శనివారం ఆర్జీ వన్ జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్జీ వన్‌జియం డి.లలిత్ కుమార్,వివిధ గనులు,డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారుల ఆయన సేవను కొనియాడుతూ అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో యస్.ఓ టు జియం చంద్ర శేఖర్,ఏజెంట్లు చిలక శ్రీనివాస్, యల్ రమేష్, అధికారులు సాయి ప్రసాద్,ఆంజనేయులు, రాంమోహన్ రావు,ధన లక్ష్మి భాయి, వరప్రసాద్, జితేందర్ సింగ్,బీమా,లక్ష్మి రాజం, శ్రీదర్,నాగుల వేణు,సాంబ శివ రావు,వేణు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు మన సమాజం సంపద

విశాలాంధ్ర బ్యూరో, సంగారెడ్డి : వృద్ధులు మన సమాజం యొక్క అమూల్యమైన సంపద. వారి అనుభవం, జీవన జ్ఞానం భవితరాలకు దారి చూపే మార్గదర్శకం. స్థిరమైన ప్రగతికి సీనియర్ సిటిజెన్స్ యొక్క ఆలోచనా పటిమ, అనుభవం బలమైన ఆధారంగా నిలుస్తాయి అని జిల్లా అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మహిళా శిశు వయోవృద్ధులు దివ్యాంగుల ట్రాన్స్ జెండర్ శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా సీనియర్ సిటిజెన్సీ వాగ్దాన్ కార్యక్రమం కొనసాగింది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భముగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. భారతదేశంలో వృద్ధుల జనాభా శాతం నిరంతరం పెరుగుతున్నప్పటికీ, వారు ఎదుర్కొంటున్న కుటుంబ, ఆస్తి, ఆరోగ్య సంబంధిత సమస్యలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆధునిక సమాజ మార్పులకు అనుగుణంగా కుటుంబ వ్యవస్థలు మారిపోవడం వల్ల వృద్ధులపై నిర్లక్ష్యం, ఒంటరితనం పెరుగుతున్నాయన్నారు. వృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకురావడం, పెన్షన్ పథకాలు, ఆస్తి హక్కుల రక్షణ, వృద్ధాశ్రమాల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. కొంతమంది ఎన్జీవోలు కూడా వృద్ధుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ప్రశంసనీయం అని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కే. లలిత కుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులను మానసికంగా లేదా శారీరకంగా వేధించే ఘటనలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 14567కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య అధికారి డాక్టర్ వసంత రావు , డాక్టర్, నాగ నిర్మల ,ప్రోగ్రాం ఆఫీసర్ మదర్ అండ్ చైల్డ్ కేర్ డాక్టర్ శశాంక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇమ్యునైజేషన్ అండ్ వ్యాక్సిన్, యూత్ అండ్ స్పోర్ట్స్ వెల్ఫేర్ ఆఫీసర్ కాసిం బేగ్, డి ఆర్ డి ఓ పెన్షన్ విభాగం షహవర్ బేగం , బాలల సంరక్షణ అధికారి రత్నం తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ పెన్షనర్ల డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంప్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: జీవన్ ప్రమాన్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డి ఎల్ సి) గురించి మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో 17 నుంచి 18 వరకు సిఈఆర్ క్లబ్ మందమర్రి నందు సిఎంపిఎఫ్ఓ గోదావరిఖని అధికారుల ఆద్వర్యంలో జీవన్ ప్రమాన్ పునరుద్ధరన క్యాంపు నిర్వహించనున్నారని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం లో జీవన్ ప్రమాన్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ఆన్ లైన్ లో ఎలా పునరుద్ధరణ చేయాలో చెప్పడం జరుగుతుందని, మాజీ సింగరేణి ఉద్యోగులు వారి యొక్క పిపిఓ కాపీ, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డ్, ఆధార్ తో లింక్ ఉన్న మొబైల్ నెంబర్ తీసుకుని క్యాంప్ లో పాల్గొని ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - అశ్వరావుపేట : అకాల మరణం చెందిన తన మిత్రుడి కుటుంబం ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని తెలుసుకున్న స్నేహితులు శనివారం ఆర్థిక సాయం అందించారు.

మండలానికి చెందిన గ్రామీణ వైద్యుడు ఎస్.ఎన్.కుమార్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి తోటి వైద్య మిత్రులు పంబి ప్రసాద్, వుడా ప్రసాద్ లతోపాటు మిగతా మిత్రులు తలా కొంత వేసుకొని రూ.10 వేలు కుమార్‌భార్య రీనా కు అందించారు. ఆ దంపతులకు కుమారుడు, కూతురు వుంది. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ బాధల్లో వైద్య మిత్రులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని చెప్పారు.

నేడు మెగా జాబ్ మేళా

- మేళాకు 65 పైగా కంపెనీలు హాజరు
- 3 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యం....
- రిజిస్ట్రేషన్ చేసుకున్న 5 వేల మంది నిరుద్యోగులు
- హాజరుకానున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి సంస్థ సౌజన్యంతో శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ వేదికగా ఆదివారం మెగా జాబ్ మేళాకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేళా జిల్లాలోని నిరుద్యోగులకు వేదిక కానుంది. జాబ్ మేళాకు రిజిష్టేషన్ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. 3 వేల మందికి పైగా ఉద్యోగం కల్పించాలని లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ మేళాలో ఇప్పటికే సుమారు 5 వేల మంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కోసం క్యూర్ కోడ్ ఏర్పాటు చేయటం వల్ల ముందుగా తమ డేటా నమోదుకు సౌకర్యంగా మారింది. ఆన్లైన్ సౌకర్యమే కాకుండా పేర్లు నమోదు చేసుకునేందుకు కొత్తగూడెంక్లబ్ వద్ద వేర్వేరుగా రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. అప్పటికప్పుడు తమ పేర్లను నమోదు చేసుకున్న వారు కూడా ఇందులో పాల్గొనేందుకు వెసులుబాటు కల్పించారు. ఈ జాబ్ మేళాకు దిగ్గజ సాఫ్ట్వేర్, మోటార్ రంగ సంస్థలతో పాటు సుమారు 65కి పైగా కంపెనీలు తరలివస్తున్నాయి. ఒక్కో అభ్యర్థి ఐదు కంపెనీల్లో ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు ప్రాంగణంలో పాస్ సౌకర్యం కల్పించారు. రిజిష్టేషన్ చేసుకున్న ప్రతీ ఒక్కరికీ పాస్ ఇవ్వనున్నారు. ఉద్యోగాలకు ఎంపికైనా వారికి అక్కడక్కడే జాయినింగ్ లెటర్లు ఇచ్చే ఏర్పాట్లు కూడా చేయడం గమనార్హం. కొత్తగూడెంలో నిర్వహించే జాబ్ మేళా నిరుద్యోకులకు వరంగా మారనుంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాబ్మేళాకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరై ప్రారంభిస్తారు. జిల్లా నలుమూలల నుండి వచ్చే అభ్యర్థుల కోసం సదుపాయాలు కల్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే. సాబీర్ పాషా చొరవ తీసుకోని కొత్తగూడెం ఏరియా జిఎం షాలేమ్ రాజ్‌తో కలిసి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

లకారం ట్యాంక్ బండ్‌లో చేప పిల్లల విడుదల

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : లకారం ట్యాంక్ బండ్ సరస్సులో చేప పిల్లలను రాష్ట్ర వ్యవసాయ సహకార జౌళీ మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు. శనివారం ఆయన ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ఆయన చేప పిల్లలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా అభివృద్ధితో పాటు ఖమ్మం నగర అభివృద్ధిలో అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రత్యేక నిధులతో నగర అభివృద్ధి కోసం రోడ్లు డ్రైనేజీలు డివైడర్లు ఏర్పాటులో ఏర్పాటు తదితర అనేక కోణాల్లో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారులు రావడంతో పాటు రింగ్ రోడ్డు కూడా ఏర్పాటు కాబోతుందని ఆయన పేర్కొన్నారు. గోళ్లపాడు ఛానల్, లకారం చెరువు, డంపు యార్డ్, కలెక్టరేట్, బస్టాండ్ పరిస్థితులను అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి అవసరమైన

నిధులు మంజూరు చేసుకుని బాగు చేయడం జరిగిందన్నారు. లకారం చెరువు బాగు చేస్తే ఖమ్మం నగర ప్రజలకు సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా గడిపేందుకు ఒక వేదిక దొరికిందని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ ను సైతం అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్లాస్టిక్, చెత్త మురికి కాలువలో వేయడం ద్వారా దోమలు వ్యాప్తి చెంది, మన పిల్లలకే డెంగ్యూ వంటి రోగాలు వస్తున్నాయని, మన సంపాదన మొత్తం ఆస్పత్రుల పాలు అవుతున్నదని తెలిపారు. ఖమ్మం ఖిల్లాకు రోప్ వే నిర్మాణం చేస్తున్నామని అన్నారు. ధంసలాపురంకు మురుగునీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ లకారం ట్యాంక్ బండ్ లో మంత్రి చేతుల మీదుగా చేప పిల్లలు విడుదల చేయడం సంతోషంగా ఉందని అన్నారు. మత్స్యకారులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో చేప పిల్లలు విడుదల చేస్తుందన్నారు. లకారంలో 82500 చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 3.5 కోట్ల చేప పిల్లలను నీటి వనరుల్లో 224 మత్స్యకార సహకార సంఘాల ఆధ్వర్యంలో విడుదల చేస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా ప్రమాదాల్లో మృతిచెందిన మత్స్య కార్మికులు కొత్తగూడెం, ధాంసలాపురంకు చెందిన కనకయ్య, రఘునాథపాలెంకు చెందిన మంగయ్య కుటుంబాలకు గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్ క్రింద రూ. 5 లక్షల చొప్పున భీమా చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జ్ మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ డా. పి. శ్రీజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, స్థానిక కార్పొరేటర్ కృష్ణ, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, జిల్లా నీటిపారుదల అధికారి వెంకట్రామ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఇరిగేషన్ ఇఇ అనన్య, నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టం పై అవగాహన అవసరం : షబానా

విశాలాంధ్ర - కొత్తగూడెం : పిల్లల కోసం ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన చట్టాల గురించి తల్లిదండ్రులకు తెలియవలసిన అవసరం ఎంతైనా ఉందని పదాల చారిటబుల్ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ షబానా అన్నారు. శనివారం లక్ష్మీదేవి పల్లి మండలం హమాలీ కాలనిలోని ప్రాదమిక పాఠశాలలో ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం పురసకరించుకొని చైల్డ శేఫ్టీ వీక్ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె చిన్నారులకు వ్యక్తిగత భద్రత, తల్లిదండ్రులకు పిల్లల భద్రత, ఫోక్సో చట్టం, చైల్డ్ హెల్ప లైన్ నెంబరు1098 గురించి అవగాహన కల్పించారు. అనంతరం కాలనీ వీదుల్లో నినాదాలు రాసిన ప్లా కార్డులు చేత పట్టించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యులు యస్.రమేష్, ఉపాధ్యయులు బి. భద్రమ్మ ట్రస్ట్ జిల్లా కొర్డనేటర్ షబానా, షకీల్ పాషా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై యూత్ కాంగ్రెస్ ర్యాలీ

విశాలాంధ్ర-తుంగతుర్తి : ప్రయాణాల సమయంలో రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అభినయ్ అన్నారు.

శనివారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కోరుకుప్పల నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోను పిల్లలకు బైకులు ఇవ్వొద్దన్నారు. వేగం వద్దు... ప్రాణం ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమోహన్, అధ్యాపకులు పుల్లయ్య, గణేష్, సంవిధాన్ మండల కోఆర్డినేటర్ మాచర్ల అనిల్ క్యాస్ట్రో, వివిధ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శిగ నసీర్ గౌడ్, పసుల అశోక్ యాదవ్, షేక్. వలీ, చింతకుంట్ల హరీష్, మరికంటి వెంకటేష్, బొంకూరి రంజిత్, లకావత్ ప్రకాష్, అక్బర్, పవన్, జటంగి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతమైన లోక్ అదాలత్

విశాలాంధ్ర ఖమ్మం (లీగల్) : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశనుసారం , ఖమ్మం జిల్లా న్యాయసేవాధికార సంస్థ స్పెషల్ లోక్ అదాలత్ ను నిర్వహించారు.

ఈ లోక్ అదాలత్‌కు ముఖ్య అతిధిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షదారులు లీగల్ పేషంట్‌లుగా అనుకోవలని, వారు ఏదో ఒక అన్యాయంతో బాధపడడం వల్ల కోర్టు కి వస్తారు. రోగి ఆలస్యంగా వచ్చారని చికిత్స చేయకుండా పంపించకూడదు అలాగే వాళ్ళ అన్యాయల గాయాలకు న్యాయమనే చికిత్స చేసి పంపాలి. అప్పుడే కోర్టులకు గౌరవం పెరుగుతుందని, సత్వర ఉచిత న్యాయం చేయలని, అందుకోసం లోక్ అదాలత్ రావలని కోరారు. ఇందులో జడ్జిలు న్యాయవాదులు అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.అపర్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రపంచ డయాబెటిస్ డే" సందర్భంగా మధుమేహ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం రన్ ఫర్ డయాబెటిస్ అనే కార్యక్రమంను ఐ.టి.ఐ గ్రౌండ్, పెద్దపల్లి నుంచి అయ్యప్ప గుడి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్ రేకులపల్లి శశాంక విచ్చేసి ఇట్టి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. డయబెటీస్ కరపత్రాల పంపిణి, డయబెటీస్ అవేర్నెస్ ర్యాలీ చేయబడింది. రీజియన్ చైర్ పర్సన్ రేకులపల్లి శశాంక, జోన్ చైర్ పర్సన్ సాదుల వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ మధుమేహ వ్యాధి గురించి అవగాహన జాగ్రత్తలు వాటికి సంబంధించిన సలహాలు సూచనలు చేయడం జరిగింది. లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో 869వ రోజు డయబెటిక్ టెస్టింగ్ క్యాంపులను పెద్దపల్లి పరిసర గ్రామాలలో నిర్వహించారు. రీజియన్ చైర్ పర్సన్ రేకులపల్లి శశాంక ,ఊట్ల అశోక్ అండ్ జి సి సాదుల వెంకటేశ్వర్లు తో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లిప్రసిడెంట్ బోడకుంట రాంకిషన్ సెక్రెటరీ మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య బాధ్యుడిని శిక్షించాలి

విశాలాంధ్ర -కారేపల్లి: ప్రేమ పేరుతో యువతిని మోసగించి ఆత్మహత్యకు కారకుడైన ఆర్.ఎం.పి నామ నరేష్‌ను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై.జానకి డిమాండ్ చేశారు. శనివారం కారేపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రేలకాయలపల్లికి చెందిన జర్పల సందీప్తిని ప్రేమపేరుతో వంచించటమే కాక సోషల్ మీడియాలో పోటోలు పెట్టి బ్లాక్ మెయిల్‌కు పాల్పడటంతో పురువు పోయిందని తీవ్ర ఆవేదనతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిరదన్నారు. యువతి ఆత్మహత్యకు కారకుడైన నామ నరేష్‌ను అరెస్టు చేయాలని, మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ భూముల కబ్జా

అధికారుల అండతోనే సాగుభూముల్లో లే-అవుట్లు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెం కేంద్రంగా ఉండాల్సిన కలెక్టరేట్‌ను అప్పటి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధులు తమ భూ వ్యాపారం కోసం అటు ఇటు కానీ పాల్వంచ సమీపంలో గుట్టలు తవ్వి మరీ భవన సముదాయం నిర్మించారు. జిల్లాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఒకేచోట ఉండాలన్న కేసీఆర్ ప్రభుత్వం ఆలోచన ఆమోదయోగ్యమైన ఈ కలెక్టరేట్ల నిర్మాణ ప్రదేశాల ఎంపిక మాత్రం అప్పటి ప్రజాప్రతినిధుల రూపంలో ఉన్న భూమాఫియా దాదాపు రాష్ట్రవ్యాప్తంగా తమకు అనుకూలంగా మలుచుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే కొత్తగూడెంలో కాకుండా పాల్వంచ సమీపంలో నిర్మించిన జిల్లా కలెక్టరేట్ చుట్టూ భూ వివాదాలు నెలకొంటున్నాయి. రెవెన్యూ అధికారుల అండతో ఈ పరిసర ప్రాంతాల భూములకు రెక్కలొచ్చి ఆధిపత్య వర్గాలకు ఆక్రమణదారులకు కల్పతరువుగా మారాయి. ఇక్కడ కలెక్టరేట్ నిర్మిస్తున్నారనే సమాచారం చాలా ముందుగానే తెలుసుకున్న భూ ఆక్రమణదారులు ఎస్టీ, ఎస్సీలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన భూములు ప్లాట్లపై దృష్టి పెట్టి నయానా, భయానా హస్తగతం చేసుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా అధికార పార్టీని అడ్డుపెట్టుకొని ఆక్రమణదారులు తమ దాదా గిరితో చెలరేగిపోతున్నట్లు వివాదాలు బయటపడుతున్నాయి. ఎన్నో ఏళ్ళ నుంచి తమ అధీనంలో ఉండి సాగు చేసుకుంటున్న ఆదివాసి, ఎస్సీల భూములను కొందరు టార్గెట్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అంగ, అర్ధబలంతో బెదిరింపులకు గురి చేసి నామమాత్రపు ధరతో కొందరు మాఫియా కొనుగోలు చేసారని తెలుస్తుంది. ఆ డబ్బులు సరిగా ఇవ్వకుండా నాన్న ఇబ్బందులు పెడుతూ బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అవే భూములను బినామీల పేరుతో చట్టానికి దొరక్కుండా లే ఔట్ పత్రాలు పొంది ప్లాట్లు చేసి అమ్మటం పాల్వంచ పరిసరాల్లో నిత్య కృత్యంగా మారింది. గతంలో పనిచేసి వెళ్లిన రెవిన్యూ అధికారులు ఆక్రమణదారులకు పూర్తి సహకారం అందించి 'కార్యం' పూర్తి చేసి వెళ్లారని ఇప్పుడు పరిణామాలు బయటపడుతున్నాయి. ఇటీవలే రెడ్డిగూడెం గ్రామంలో 126 సర్వే నెంబర్లు ఆదివాసీలకు చెందిన భూములు కబ్జా చేశారని ఆదివాసీ జేఏసీ నాయకులు మీడియా సమావేశంలో పెట్టి మరీ ఆరోపించారు. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించ లేదు. తాజాగా పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న పాలకోయతండాలో 4 ఎకరాలపై బడి భూమిని గిరిజనుల దగ్గర బెదిరింపులకు గురి చేసి ఒక బడా బాబు తక్కువ ధర తానే నిర్ణయించి ఆక్రమించాడని తెలుస్తుంది.ఆ భూముల్లో అధికారుల అండతో లే అవుట్లు చక చక సాధించుకున్నాడని తెలుస్తుంది. ఈ భూమి హక్కుదారులైన గిరిజనులకు ఇవ్వాల్సిన డబ్బులు కూడాపూర్తిగా చెల్లించ లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఆ భూమిని చాలా ప్రణాళికతో బినామి ఎస్సీ, ఎస్టీల పేర ప్లాట్లు చేసి అమ్మకానికి పెట్టినట్లు సమాచారం. ఈ తండలో 409 సర్వే నంబర్‌లో భూమి ఉందని బాధితులు చెప్తున్నారు. ఇదే కాకా ఈ భూమిని ఆనుకులో ఉన్న ప్రభుత్వ స్థలం సుమారు 30 కుంటలకు పైగా కబ్జా చేసినట్లు సదరు ఆక్రమణదారుడిపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ ప్రాంతానికి ఎవరైనా వెళ్తే తన రౌడీముకులతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని కొందరు బాధిత ఆదివాసీలు అభ్యర్థిస్తున్నారు.

నాణ్యమైన విత్తనం రైతు నేస్తం

విశాలాంధ్ర-మరిపెడ: నాణ్యమైన విత్తనాలు రైతు నేస్తాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వరంగల్ శాస్త్రవేత్త డాక్టర్ డి. వీరన్న అన్నారు.

శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ధర్మారం శివారులోని లచ్య తండా గ్రామంలో నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా వరివిత్తన క్షేత్రాలలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వరంగల్ శాస్త్రవేత్త డాక్టర్ డి. వీరన్న, మరిపెడ మండల వ్యవసాయ విస్తరణ అధికారి స్రవంతి ఆధ్వర్యంలో రైతులు గుగులోత్ బాబు నాయక్, గుగులోత్ దేవేందర్, పున్నా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితర రైతుల వ్యవసాయ క్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు వరి రకం డబ్ల్యూజీఎల్- 44 (సిద్ధి) గుణగణాల గురించి వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న మాట్లాడుతూ అధిక దిగుబడినిచ్చే వరి రకమును రైతుల నుంచి తోటి రైతులకు నాణ్యమైన విత్తనాలుగా అందించాలని కోరారు. తోటి రైతులు ఈ రకం చాలా అనుకూలంగా ఉందని, అధిక వర్షాలకు ముంథా తుఫానుకు కూడా పడిపోకుండా పంట నిలబడే ఉందని,చీడ పీడలు తట్టుకుని మంచి దిగుబడి ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఈ రకం యొక్క గుణగణాలు చూసి హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాననిలయాలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయమని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి (డిపిఆర్ఓ) పసునూరి రాజేంద్రప్రసాద్ అన్నారు.

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పుస్తక ప్రదర్శనను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు జ్ఞానాన్ని అందిస్తాయని, అటువంటి విజ్ఞానమే ప్రామాణికంగా మానవతా హృదయాన్ని అందించే గ్రంథాలయాలు సమాజానికి గుండెకాయ లాంటివని పేర్కొన్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తి పుస్తకానికి మాత్రమే ఉందని, మంచి వ్యక్తిత్వం పుస్తకాల ద్వారా మాత్రమే ఏర్పడుతుందని, అందుచేత బాల్యం నుంచే చదువుతో పాటు పుస్తక పఠనం పట్ల పిల్లల్లో ఆసక్తి పెంచితేనే విజ్ఞానవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని, పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి దోహదపడుతుందన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో బాల సాహిత్యం, ఆధ్యాత్మిక సాహిత్యం, అభ్యుదయ సాహిత్యం, ప్రగతిశీల సాహిత్యం, రెఫరెన్స్, నవలలు, దేశ నాయకుల చరిత్రలు, నిఘంటువులు, పోటీ పరీక్షలకు సంబంధించిన అకాడమీ పుస్తకాలను ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు జి. విజేందర్, సి హెచ్. రవి, రుద్రారపు వీరేందర్, బొడ్డుపల్లి భూలక్ష్మి, బి. యాదమ్మ, గ్రంథాలయ పాఠకులు ముఖేష్, శ్రీకాంత్ శారద, దేవ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మనో వికాసానికి సైన్స్ ఫెయిర్‌లు దోహదం

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని స్థానిక బీఎల్ అల్ఫోన్సా కాన్వెంట్ హైస్కూల్‌లో పాఠశాల హెడ్ మిస్ సిస్టర్ బెస్సి, సిస్టర్ టెస్సీ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులు పలు రకాల ప్రాజెక్ట్ వర్క్‌ను సొంతంగా తయారు చేసిన ప్రదర్శనలో వాటి పనితీరును తోటి విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భగా పాఠశాల స్టాఫ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లల మనో వికాసానికి సైన్స్ ఫెయిర్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థులంతా నూతన సైన్స్‌రంగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. సైన్స్ ఫెయిర్‌లో భాగంగా విద్యార్థులు ట్రిగోనమెట్రీ పార్క్, చంద్రయాన్-3, నర్వ్స్ సిస్టమ్, రెస్పిరేటరీ సిస్టమ్, నాచురల్ ఫార్మింగ్, వాటర్ ప్యూరిఫికేషన్, డయాలసిస్, హార్ట్ వర్కింగ్ సిస్టమ్, హైడ్రాలిక్ రోబోటిక్ ఆర్మ్, ఎయిర్‌అండ్ వాటర్ పొల్యూషన్ లాంటి ప్రాజెక్ట్ వర్క్స్‌చేసి, వాటి పనితీరును వివరిస్తూ అందరిచేత ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి

విశాలాంధ్ర గూడూరు: గూడూరు మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ (బాయ్స్) పాఠశాలయందు భగవాన్ బిర్సా ముండా 150 జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతూ బిర్సా ముండా నవంబర్ 15, 1875 జన్మించారని, 2021 నుండి భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం నవంబర్ 15ను జన్‌జాతీయ గౌరవ్ దివస్ (గిరిజన గౌరవ దినోత్సవం) జరుపుకోవాలని ప్రకటించింది. ఆయన పోరాటం బ్రిటీష్ వలసవాదులు గిరిజనుల అటవీ, భూమి హక్కులను కాలరాసి, అధిక పన్నులు వసూలు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారనీ తన ప్రజలను చైతన్యపరచి, ఐకమత్యంగా పోరాడేలా స్ఫూర్తినిచ్చారు.ఆదివాసీ తెగలను సంఘటితం చేయడానికి వారి సంస్కృతిని కాపాడటానికి ఆయన బిర్సాయిత్ అనే ప్రత్యేక మతాన్ని స్థాపించారన్నారు. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఆయన చేసిన సేవకు గుర్తుగా, భారత పార్లమెంటులోని సెంట్రల్ హాల్లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఈ గౌరవాన్ని పొందిన ఏకైక గిరిజన నాయకుడు బిర్సా ముండా అని ఆయన చరిత్రను విద్యార్థులకు తెలియజేస్తూ బిర్సా ముండా చిత్రపటాన్ని పూలమాలతో నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు సదాశివ, శ్రీనివాస్, శరత్ బాబు, శ్రీధర్, అనిల్, సులోచన పాల్గొన్నారు.

నేడు అభ్యుదయ రచయితల సమావేశం

విశాలాంధ్ర ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా అభ్యుదయ రచయితల సమావేశం ఈనెల 16న ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీ పాత్ర, సాధించిన -విజయాలు, చారిత్రాత్మక పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు పాటలు, కవితలు, ప్రత్యేక కథనాలను రూపొందించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రత్యేక సంచికను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. అభ్యుదయ కవులు, రచయితలు, వామపక్ష అభిమానులు ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు.

సంపాదకీయం

తీరు మార్చుకోకపోతే అంతే!

బీహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు వివిధ రాష్ట్రాల్లోని 8 నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు ఎన్నో సవాళ్లు విసిరాయి. మరెన్నో గుణపాఠాలను మన ముందుంచాయి. రానున్న రోజుల్లో పదిపదిహేను రాష్ట్రాలకు, మరో మూడేళ్లలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా 'ఇండియా' కూటమి, ముఖ్యంగా దానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేర్చుకోవాల్సిన పాఠాలు ఎన్నో ఉన్నాయి. అప్పటికీ అది మారకపోతే, మహాఘట్బంధన్ వినాశనం, ఎన్‌డీఏ బలోపేతం... దేశానికి ప్రళయం అనివార్యమవుతాయి. వరుసగా పదిహేనేళ్లు నితీశ్ కుమార్ ఏదో ఒక విధంగా బీహార్ రాష్ట్రంపై పట్టు సంపాదిస్తూనే ఉన్నారు. 2020 ఎన్నికల కన్నా 2025 ఎన్నికల ఫలితాలు నితీశ్‌కు, అంతిమంగా ఎన్‌డీఏకూ బలాన్నిచ్చాయి. తిరుగులేని శక్తిగా అవతరించేలా చేశాయి. ముఖ్యంగా బీజేపీ ఎంతో పకడ్బందీగా, వ్యూహాత్మకంగా పావులు కదిపిన తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ ఎన్నికల్లో బీజేపీ 89, జేడీ (యూ) 85, ఎల్‌జేపీ (ఆర్‌వీ) 19, ఆర్‌జేడీ 25, కాంగ్రెస్ 6, ఎంఐఎం 5, వామపక్షాలు 3 స్థానాలు గెల్చుకున్న విషయం తెల్సిందే. ఊరంతా తన వ్యూహంతో విజయాలు అందించినట్లు చెప్పుకున్న ప్రశాంత్‌కిశోర్ పార్టీ జేఎస్‌పీ ఇక్కడ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. బహుశా ఈ దెబ్బకు అతను లేవచ్చు, లేవకపోవచ్చు. అఖ్తరుల్ ఇమామ్ నేతృత్వంలోని ఏఐఎంఐఎం ఐదుస్థానాల్లో తన పట్టు నిలుపుకోవడం గొప్ప విషయమే. జేడీ(యూ) కన్నా బీజేపీ భవిష్యత్ బంగారంలా ఉంటుందని ఈ ఫలితాలు చెప్పకనే చెపుతున్నాయి. ఆ పార్టీ ఓట్ల వాటా ఈ విషయాన్ని రూఢిపరుస్తున్నాయి. కుల భిన్నత్వం, ఓట్ల బదిలీలో వ్యూహాత్మక సామర్థ్యం, మహిళలను ఆకట్టుకునే సంక్షేమ పథకాలు ఎన్‌డీఏకు మరోసారి పట్టంగట్టాయి. అర్బన్, సెమీ అర్బన్, సెమీ రూరల్, రూరల్... ఇలా బీహార్‌ను నాలుగు ప్రాంతాలుగా విభజిస్తే, ఈ నాలుగింటిలోనూ బీజేపీ ఎత్తుగడల ఫలితం ఎంత అనుకూలంగా ఉందో గోచరిస్తుంది. అలాగే మిథిల, తిరుహట్, మగధ్, తూర్పు, భోజ్‌పూర్ ప్రాంతాల్లో ఎన్‌డీఏ పకడ్బందీ ప్రచార ప్రణాళిక ఫలితం ఎంత స్పష్టంగా ఉందో తెలుస్తోంది. దీనికి మహాఘట్బంధన్ అనైక్యత, కొట్లాట, ఆవేశకావేశాలు పరోక్షంగా సహకారం అందించిన మాట వాస్తవమే. బీజేపీ ఏకంగా 89.1 విజయశాతాన్ని సాధించింది. అంటే పోటీ చేసిన ప్రతి 10 స్థానాల్లో 9 స్థానాలను కైవసం చేసుకోవడమంటే మామూలు విషయంకాదు. ప్రభుత్వ వ్యతిరేకత ఏ మాత్రం పనిచేయలేదు. ఆర్‌జేడీ ఆటవికరాజ్యం ఏనాటికీ సహించరానిదని మోదీజట్టు చేసిన దుష్ప్రచారాన్ని జనం నిస్సంకోచంగా నమ్మారు. జేడీ(యూ) 83.2 విజయశాతాన్ని నమోదుచేసింది. ఎన్‌డీఏలోని మరో పార్టీ ఎల్‌జేపీ (రామ్‌విలాస్) సైతం 67.9 విజయశాతాన్ని అందుకుంది. అంటే ఓట్ల శాతాన్ని సీట్లుగా మార్చుకోవడంలో ఈ మూడు పార్టీలూ చాకచక్యంగా వ్యవహరించాయి. కుల భిన్నత్వాన్ని ఏకంచేయడంలో సఫలీకృతమైన తీరు అద్భుతమేనని చెప్పవచ్చు. అదెలాగంటే, అగ్రకులాలను అట్టిపెట్టుకోవడమేగాక, కొన్ని చోట్ల ఓబీసీలకు సీట్లిచ్చి గెలిపించుకున్న బీజేపీకి, జేడీ(యూ) వెనుకబడిన తరగతులు, మహాదళితుల తోడ్పాటు కలిసొచ్చింది. ఎల్‌జేపీ(ఆర్‌వీ)కి పాశీలు, ఇతర దళితుల మద్దతు ఉండనేఉంది. ఫలితంగా ఎన్‌డీఏకి కులాల భిన్నత్వంలో ఏకత్వ సాధన అనాయాసమయింది. కుమ్ములాటలతో కాలంవెలిబుచ్చిన ఎంజీబీ (మహాఘట్బంధన్) కి ఈ తరహా సమీకరణకు అంత సమయం లేకుండాపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనే ఎల్‌జేపీ(ఆర్‌వీ) పూర్తి స్థాయిలో తమ కూటమిలోకి చేరిన తర్వాత 48% ఓట్ల వాటాను కొల్లేసిన ఎన్‌డీఏకు ఇప్పుడు ఆ ఓట్ల శాతం 46.7 కి తగ్గినప్పటికీ (1.3%) పెద్ద ప్రభావం కన్పించకపోగా, దాన్ని సీట్ల గెలుపునకు మలచుకోవడం గొప్ప విషయం. ఎంజీబీ మాత్రం తిరోగమనంలో ఉంది. 2020 ఎన్నికల్లో 37% ఓట్లువాటాను దక్కించుకున్న ఈ కూటమి ఇప్పుడు 3% శాతాన్ని కోల్పోయింది. ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీల అతిశయం, అతి ప్రవర్తన అందించిన ఫలితమిది.

ఓట్ల బదలాయింపులోనూ కాంగ్రెస్ కన్నా బీజేపీ తెలివితేటలు చూడముచ్చటగా కన్పిస్తాయి. దీని ఉద్దేశం బీజేపీని పొగడటం కాదు, కాంగ్రెస్ అతివిశ్వాసాన్ని తెగడ్తడమే. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఏకంగా 28 స్థానాల్లో ముఖాముఖి పోరులో తలపడగా, అందులో బీజేపీ విజయశాతం 89.3% ఉందంటే ఆ పార్టీ ఓట్లబదిలీకి అనుసరించిన పద్ధతి ఆలోచనాత్మకమైనదే. అదేవిధంగా, 50 స్థానాల్లో బీజేపీ, ఆర్‌జేడీ నేరుగా తలపడగా, అందులో బీజేపీ 84% విజయశాతాన్ని నమోదుచేసింది. ఇక జేడీ(యూ), ఆర్‌జేడీ 58 స్థానాల్లో పరస్పర ప్రత్యక్ష పోరుకు దిగగా, అందులో జేడీ(యూ) 82.8 విజయశాతాన్ని అందుకుంది. వ్యక్తిగతంగా పార్టీ బలంతోపాటు కూటమి బలాన్ని కూడా చూపించుకున్నాయి. కానీ ఎంజీబీ అభ్యర్థులు చాలా స్థానాల్లో స్నేహపూర్వక పోటీల పేరుతో తమ సొంత భాగస్వామ్య పార్టీల అభ్యర్థులనే ఎదుర్కోవాల్సి రావడం విచారకరం. అసలు స్నేహపూర్వక పోటీ అనేది ఎంత దౌర్భాగ్యమైన, నీచమైన వ్యూహమో కాంగ్రెస్‌కు అర్థం కావడానికి ఇంకెన్ని దశాబ్దాలు గడవాలో. సీపీఐకి బలమున్న 9 స్థానాలను ఆ పార్టీకి కేటాయిస్తూనే అందులో 5 స్థానాల్లో కాంగ్రెస్ స్నేహపూర్వక పోటీ పేరుతో అభ్యర్థులను నిలబెట్టి, ఓట్ల చీలికకు కారణం కావడం స్వయంకృతాపరాధమే. ప్రాంతాల వారీగా చూసినా ఎన్‌డీఏ వ్యూహరచనలో ఒక మెట్టుపైనే కన్పిస్తుంది. మగధ ప్రాంతంలో బీజేపీ 51%, జేడీ(యూ) 47.2% ఓట్ల వాటాను చేజిక్కించుకోగా, తిరుహుట్ ప్రాంతంలో బీజేపీ 48.4%, జేడీ(యూ) 46.9%, మిథల ప్రాంతంలో బీజేపీ 49.3%, జేడీ(యూ) 46.9% ఓట్లవాటాను హస్తగతం చేసుకున్నాయి. భోజ్‌పూర్ ప్రాంతంలో మహాఘట్బంధన్‌కు బలమైన పునాది ఉన్నప్పటికీ, అక్కడ బీజేపీ (44.7%), జేడీ(యూ) (41.6%)లు ఆర్‌జేడీ (35.9%) కన్నా ముందంజలో ఉండటం విచిత్రం. ఆర్‌జేడీ వైఫల్యానికి ఇది నిదర్శనం. 40% ముస్లిం జనాభా కలిగి ఉన్న సీమాంచల్ ప్రాంతంలో ఏఐఎంఐఎం అనూహ్యంగా 5 స్థానాలతో 55.6 విజయశాతాన్ని అందుకొని, పరోక్షంగా ఆర్‌జేడీ, కాంగ్రెస్ పరాజయానికి కారణభూతమైంది. ఈ విషయంలో బీజేపీతో మజ్లిస్ తెరవెనుక రాజకీయం చేసిందన్న ఆరోపణలూ లేకపోలేదు. 5% ఓటింగ్ శాతం పొందిన జేఎస్‌పీ (ప్రశాంత్ కిశోర్ పార్టీ) సైతం ఎంజీబీ పతనంలో 'ఓ చేయి' వేసింది. వామపక్షాల్లో కాస్తాకూస్తో బలమున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కూడా ఈసారి 10% ఓటింగ్‌కే పరిమితమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 63.2% ఓటింగ్ దక్కడం గమనార్హం. కాకపోతే, లిబరేషన్ కన్నా కాంగ్రెస్ ఓటింగ్ (9.8%) తక్కువ కావడం మరింత అవమానకరం. బీహార్‌లో పట్టులేని కాంగ్రెస్ ఎంజీబీకి నేతృత్వం వహించడమూ విడ్డూరమే. మహిళా ఓటర్లను ఆకర్షించడంలోనూ ఎంజీబీ వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిం చింది. మరోవైపు ఉప ఎన్నికల ఫలితాలూ దిగ్భ్రాంతి కలిగించాయి. జమ్మూ కశ్మీర్‌లో నేషనల్ కాంగ్రెస్ (ఎన్‌సీ) కంచుకోట బుద్గాంలో ఆ పార్టీ ఓటమిపాల యింది. నగ్రోటాలో ఏకంగా డిపాజిట్టే కోల్పోయింది. ఒడిశాలోని నౌపడలో గెలిచిన బీజేపీ జార్ఖండ్‌లోని ఘట్‌శిలాలో ఓడిపోవడంతో సరిసమమైంది. రాజస్థాన్‌లో అధికారపార్టీ బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. అక్కడ అంటా స్థానంలో కాంగ్రెస్ గెలిచి పరువు దక్కించుకుంది. ఏదేమైనప్పటికీ, ఇవన్నీ 'ఇండియా'కు గుణపాఠాలే. రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనైనా 'ఇండియా' కూటమి సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. తీరుమార్చుకోకపోతే...అంతే!

ఎనిమిదవ వేతన సంఘం చివరిదా!

ఎం.కోటేశ్వరరావు

కేంద్ర ప్రభుత్వం ఎనిమిదవ వేతన కమిషన్ నియామకం చేసింది. ఈ మేరకు నవంబరు మూడవ తేదీన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రోజు నుంచి పద్దెనిమిది నెలల్లో నివేదికను సమర్పించాలని దానిలో నిర్దేశించారు. నరేంద్రమోదీ సర్కార్ ఏర్పాటు చేసిన తొలి సంఘం ఇది. ఈ క్రమాన్ని చూసినప్పుడు ప్రతిదాన్నీ ఓట్ల కోసం ఎలా వినియోగించుకుంటున్నారో దీన్లో కూడా చూడవచ్చు. ఏడవ వేతన సంఘాన్ని 2014 ఫిబ్రవరిలో నియమించగా 2015 నవంబరులో నివేదిక సమర్పించింది. ఈ లెక్కన ఈ పాటికి ఎనిమిదవ వేతన సంఘనివేదిక కేంద్ర ప్రభుత్వానికి అందాల్సి ఉంది. దూరాలోచన లేదా దుష్టాలోచనతో ఎన్నికల కోసం ఆలస్యం చేశారనిపిస్తోంది. దీని సిఫార్సులు, కేంద్రం పరిశీలించి అమలు చేయాల్సిన సమయానికి లోక్‌సభ ఎన్నికలు వస్తాయి. ఈ కమిషన్ సిఫార్సులు 2028 లోగా అమల్లోకి వచ్చే అవకాశం లేదని సీనియర్ అధికారులు చెబుతున్నారంటే దాని అర్థం అదే. మరొక ప్రమాదం ఏమిటంటే బకాయిలను ఎగవేసే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. ఎన్నికల ముందు అమలు చేసి చూశారా మీకు ఎంత మేలు చేశామో, దానికి మాకేమిటి అని అడిగేందుకు ఒక ప్రచార అస్త్రంగా ఉండనుంది. ఏడవ వేతన కమిషన్ 2015 నవంబరులో నివేదికను అందచేస్తే 2016 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఒకవైపు డిజిటల్ రంగంలో ముందున్నాం అంటారు. వివరాలు తెప్పించుకునేందుకు ఎన్ని సంవత్సరాలు కావాలి? అసలు విషయం ఏమిటంటే ప్రతి వేతన సంఘం వేసినప్పుడు వేతనాలు, పెన్షన్లు, బకాయిల చెల్లింపునకు బడ్జెట్ కేటాయింపులు జరపాల్సి ఉంటుంది. ఎన్నికల ముందు అది ప్రభుత్వానికి పెద్ద అగ్ని పరీక్షే. పదేళ్లకు ఒకసారి నియమిస్తున్న వేతన సంఘం ఉద్యోగులు, పెన్షనర్ల మీద ఖర్చు ఎలా తగ్గించాలా అని చూస్తున్నది, అయితే సంఘటితంగా ఉద్యోగులు ఉన్న కారణంగా వాటి అజెండా పూర్తిగా అమలు చేయటం సాధ్యం కావటం లేదు. ఇప్పుడు కూడా అదే జరగనుందా?

వేతన, పెన్షన్ బిల్లుల గురించి గుండెలు బాదుకుంటూ మీడియాలో విశ్లేషణలు రాస్తున్నారు. వేతనాలకు మించి పెన్షన్ బిల్లు పెరిగిపోతోందన్నది వాటిలో ఒకటి. భవిష్యత్‌లో ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లను వారు అందించిన సేవలు, డిజిటల్ పాలన మైలురాళ్లు, పౌరుల సంతృప్తి సూచికల ప్రాతిపదికన ఇవ్వాలని ఆర్థికవేత్తలు సలహా ఇస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగ చరిత్రలో ఎనిమిదవ వేతన సంఘం కసరత్తు తీవ్ర సవాళ్లతో కూడిన వాటిలో ఒకటిగా రూపుదిద్దుకుంటున్నదట. కోటీ ఇరవై లక్షల మంది కేంద్ర ప్రభుత్వ

ఉద్యోగులు, పెన్షనర్లే కాదు, అంతకంటే ఎక్కువగా ఉండే రాష్ట్రాల సిబ్బంది మీద కూడా ఈ కమిషన్ సిఫార్సుల ప్రభావం పడనుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 50 లక్షల మంది వరకు ఉండగా పెన్షనర్లు 69 లక్షల మంది ఉన్నారని, రాబడిలో 18 శాతం వేతనాలు, పెన్షన్లకే పోతున్నదని, ఒకవైపు పొదుపు మరోవైపు న్యాయమైన వేతన సవరణ డిమాండ్ల మధ్య పోరు జరగనుందని చెబుతున్నారు. ప్రైవేటు రంగానికి నిపుణులైన వారు వెళుతున్నందున ప్రభుత్వ రంగానికి వారిని ఆకర్షించేందుకు 1990 దశకం నుంచి ప్రతి వేతన కమిషన్ సిఫార్సులలో వేతన వృద్ధి దేశ తలసరి ఆదాయవృద్ధి రేటుకంటే ఎక్కువగా ఉంటున్నదట. వేతన, పెన్షన్ ఖర్చు పెరిగిపోవటం వలన మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాలకు నిధుల కొరత ఏర్పడుతున్నదట. ఒక ఏడాది కాగానే ఇంక్రిమెంట్, కరువు భత్యం వాయిదాలు చెల్లించటం కాకుండా సామర్థ్యం, ఉత్పాదకత ప్రమాణాలు దాటిన తరువాతే ఇవ్వాలని కొందరు సూచిస్తున్నారు. దానికి అనుగుణంగానే జస్టిస్ రంజనా దేశాయ్ ఆధ్వర్యంలోని ఎనిమిదవ వేతన కమిషన్‌కు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ఉన్నాయి. వీటిని చూసిన తరువాత ఇదే చివరి వేతన సంఘం అన్న వారు కూడా ఉన్నారు. పరిహారం చెల్లింపు విషయంలో నూతన నమూనాలను పరిశీలించాలని, జవాబుదారీతనం, సామర్థ్యం ప్రతిఫలించాలని వాటిలో పేర్కొన్నారు. వీటిని ఎవరూ వ్యతిరేకించటంలేదు, అనుసరించే కొలబద్దలేమిటన్నదే సమస్య. బీఎస్ఎన్ఎల్ విస్తరణకు అనేక ఆటంకాలను కల్పించి, తీరా ప్రైవేటు సంస్థలు ముందుకు పోయేందుకు అవకాశం కల్పించి అసమర్థ సంస్థగా చిత్రించిన తీరును మనం చూశాం. 2004లో ఎన్‌డీఏ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన పెన్షన్ పథకం(ఎన్‌పీఎస్) తరువాత కూడా పెన్షన్ బిల్లు పెరగటానికి సగటు జీవితకాలం పెరగటం ఒక కారణం. ఈ పెన్షన్ విధానం ద్వారా బిల్లు తగ్గాలంటే 2040 వరకు ఆగాల్సిందే, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ వార్షిక పెన్షన్ బిల్లు రు.2.6 లక్షల కోట్లు దాటింది. విదేశీ కంపెనీలు, స్వదేశీ కార్పొరేట్లకు ఇచ్చే రాయితీలు మొత్తం తిరిగి దేశంలో పెట్టుబడులుగా రావటం లేదు, ఇతర దేశాలకు చేరుతున్నాయి. విదేశీ పెట్టుబడుల ముసుగులో మరిన్ని రాయితీలు పొందేందుకు తిరిగి ఇక్కడికే చేరుతున్నాయి లేదా ఎక్కడ లాభసాటిగా ఉంటే అక్కడికి వెళుతున్నాయి. కానీ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చే మొత్తాలు అలాంటివి కాదే, నల్లధనంగా మారి స్విస్ వంటి పన్ను స్వర్గాలకు చేరటం లేదు. ఇక్కడే వస్తు, సేవల వినియోగానికి జీవితకాలంలో ఒక సొంత ఇంటిని, పరిమితంగా బంగారం, ఇతర ఆస్తులను కూడబెట్టుకొనేందుకు వినియోగపడుతుంది. జీఎస్టీ రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తిరిగి చేరుతున్నది.

పద్దెనిమిది నెలల్లో నివేదిక అంటే సమర్పణకే 2027 ఏప్రిల్ వరకు ఆగాలి. ఇతర కారణాలు చూపి ఆలస్యం చేస్తే చేయగలిగిందేమీ లేదు. మధ్యంతర నివేదికను కూడా ప్రకటించవచ్చు. నూతన వేతనాలు 2026 జనవరి ఒకటి నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. వేతన కమిషన్ ఇంతవరకు ఉద్యోగుల ముందు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ఫిట్‌మెంట్ ఫాక్టర్ 2.86 ప్రకారం రు.19వేల వరకు వేతనాలు పెరగవచ్చని కొందరు చెబుతున్నారు. గత వేతన కమిషన్ 2.57ను తీసుకుంది. దాని ప్రకారం మూల వేతనం రు.7 నుంచి 18 వేలకు పెరిగింది. ఇప్పుడు రు.18 నుంచి రు.46,260, పెన్షన్ రు.9 నుంచి రు.23,130 కి పెరగవచ్చని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సుభాస్ చంద్ర గార్డ్ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 1.92 గా ఉండవచ్చని, కనీస వేతనం రు.34,500 అవుతుందని చెప్పారు. మధ్య స్థాయిలో ఉండే ఉద్యోగివేతనం ప్రస్తుతం రు. ఒక లక్ష ఉన్నదని, వేతన పెంపుదల శాతాన్ని బట్టి దానికి అదనం అవుతుందని భావిస్తున్నారు. దేశంలో తొలి వేతన కమిషన్ 1946 లో ఏర్పాటు చేశారు. శ్రీనివాస వరదాచారి చైర్మన్. కనీస వేతనంగా రు.55, గరిష్టవేతనం రు.2,000 సిఫార్సు చేశారు. ఏడవ వేతన సంఘం కనీస, గరిష్ట వేతనాలు రు.18,000, రు.2,50,000 గా సిఫార్సు చేసింది. ధరల పెరుగుదల కారణంగా 1957 లో ఏర్పాటైన రెండవ కమిషన్ కరువు భత్యాన్ని సిఫార్సు చేసింది. 1983లో ఐదవ వేతన కమిషన్ ఇంటి అద్దెను సిఫార్సు చేసింది. నాలుగవ వేతన సంఘం అంతకు ముందు ఏడాదికి నాలుగుసార్లు డీఏ ప్రకటించే విధానాన్ని రద్దు చేసి ఏడాదికి రెండు సార్లు ప్రకటించేట్లు సిఫార్సు చేసింది. నూతన వేతన సంఘ నియామకానికి ముందు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు పదిహేను డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచాయి. వాటిని వేతన సంఘం పరిగణనలోకి తీసుకొని మధ్యంతర సిఫార్సులు చేస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. జీవన వేతన అవగాహనకు అనుగుణంగా కనీస వేతన నిర్ణయం ఉండాలని, ఒకటి నుంచి 4వ స్థాయి వరకు విలీనం చేయాలని, మధ్యంతర భృతి, నూతన పెన్షన్ విధాన రద్దు వంటివి వాటిలో ఉన్నాయి. ఎనిమిదవ వేతన సంఘం గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే వేతన సంఘం అంటే వేతనాలు, పెన్షన్లు, అలవెన్సులను సిఫార్సు చేయటమే కాదు. ఇప్పుడు దేశంలో అమలు జరుగుతున్న విత్త నమూనా తట్టుకొని నిలుస్తుందా లేదా అన్నది కూడా తేలాల్సి ఉంటుందని కొందరు విశ్లేషకులు పేర్కొన్నారంటే ఏదో ముప్పు మూడినట్లే కనిపిస్తోంది. 2026 జనవరిలోగా ఉద్యోగవిరమణ చేసే వారికి నూతన వేతనాలు, పెన్షన్లు వర్తిస్తాయా లేదా అన్నది అనుమానమే.

కానరాని మీడియా స్వేచ్ఛ...

రామకిష్టయ్య సంగనభట్ల

ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా రంగం కష్టకాలంలో ఉంది. భారతదేశంలో ప్రతి సంవత్సరం నవంబరు 16 వ తేదీన జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకుంటారు. 1956 లో భారత తొలి ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966 నవంబర్ 16 వ తేదీన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 16 వ తేదీన జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. భారతదేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్ కౌన్సిళ్లు ఉన్నాయి. భారతదేశ కౌన్సిల్‌కు ఉన్న ప్రత్యేకత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించే అవకాశం లభించడమే. అనేక సంవత్సరాలుగా ప్రెస్ కౌన్సిల్ పత్రికా రంగానికి ఎదురయ్యే సవాళ్లు, సమస్యల గురించి ప్రతి నవంబరు 16 న సెమినార్లు నిర్వహిస్తోంది. ఇక అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్‌కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినంగా మే 3 వ తేదీని ప్రకటించింది. మీడియాకు స్వేచ్ఛ ఎండ మావే అవుతున్నది. మే 3 వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 16 న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్సవాలు జరిపినా పరిస్థితులలో మార్పు రాకపోవడం విచారకరం. స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకొనేవి. తరువాత దేశ మీడియాలో ఆ గీత చెరిగి పోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చివేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే, కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం.

నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడిదారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా పోతోంది. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ముకోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించడం కొనసాగుతున్నది. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయత్నాలు జరగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్‌ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియల్‌ఎస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరి ప్రయోజనాలను ఇంకొకరు కాపాడు కుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారంలో వున్నప్పుడు దానిని అడ్డుపెట్టుకొని లాభాలు సంపాదించటం, ప్రతిపక్షంలో వున్నప్పుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరుగుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆవైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేచ్ఛ హరించుకుపోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నాయన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బీజేపీ వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపుతున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాకపోవటం లేదా కనిపించీ కనిపించకుండా ఒక మూలన పడవేయటమో జరుగుతోంది. తమ విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్రకటనలు నిలిపి వేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డుకోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తుతున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్దం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడుతున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసుకోలేని గందరగోళంలో జనాన్ని పడవేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసే కుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్దాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో గోబెల్స్ వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తిపోస్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమ వంతు తోడ్పాటును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందరగోళానికి గురవుతున్నారు.

9440595494

సైన్సు ఎంత పెరిగినా ఇంకా మూఢత్వమేనా?

ప్రొఫెసర్ పీటాబాబీవర్ధన్

మనుషుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, హేతుబద్ధంగా ఆలోచింప చేయాల్సిన అవసరాన్ని రాజ్యాంగం గుర్తించింది. అంటే మూఢనమ్మకాల వలయంలో చిక్కి జీవితాలను నాశనం చేసుకోవద్దన్న దిదానర్థం. సైన్సు ఎంతగా అభివృద్ధి చెందినా, ఒకప్పుడు దైవంగా భావించిన చంద్రుని మీద మానవులు కాలుమోపి అదొక గ్రహమని తేల్చినా ఇంకా కొందరు మూఢనమ్మకాల ముసుగుల్లోంచి బయటపడటం లేదు. బయట పనులకు వెళుతున్నప్పుడు ఎక్కడికని అడక్కూడదండీ అంటూ రాగాలు తీసేవాళ్లు, నల్లపిల్లి ఎదురొస్తే అశుభం అని వెనుతిరిగే వాళ్లు, కాకులు అరిస్తే బంధువులు వస్తారని బెంబేలెత్తే వాళ్లూ, తుమ్మితే ముందుకు వెళ్లొద్దని ఆపేసేవాళ్లు, బల్లిమీద పడితే అరిష్టం అని నమ్మేవాళ్లు, కుక్కలు, గాడిదలు అరిస్తే ప్రకృతి విపత్తులు సంభవిస్తాయని భవిష్య వాణిని వినిపించే వాళ్లు ఇంకా ఉన్నారంటే ఆశ్చర్యం కలిగిస్తుంది. వీటన్నిటికీ అసంబద్ధమైన వితండవాదం చేస్తారు కొందరు. ఎక్కడికి వెళ్తున్నారని వాకబు చేయకపోతే, బయట ఏదైనా జరగరానిది జరిగితే ఎక్కడని వెతకాలి? పిల్లులు ఆహారం కోసం ఎటైనా తిరుగుతాయి. నల్లవైన, తెల్లవైనా అది వాటి సహజగుణం. తిరగకుండా ఆపడం ప్రకృతి విరుద్ధం. అయినా నలుపు అశుభమైతే అయ్యప్పస్వామి భక్తులు ఎందుకు ధరిస్తారు? ఇక సీజన్లను బట్టి పక్షులు శబ్దాలు చేయడమూ సర్వసాధారణమే. కొత్త చిగుళ్లు వచ్చినప్పుడు కోకిల కూయదా? చూడాలనిపిస్తేనో, మరేవైనా పనులు ఉంటేనో చుట్టాలు వస్తుంటారు. కాకులు అరుపులతో దీనికి సంబంధం ఏముంది? కుక్కలు, గాడిదలు అంతే. వాతావరణంలో మార్పులను బట్టి ప్రవర్తిస్తుంటాయి. దొంగల అలికిడి కనిపించినప్పుడు, కొత్త జీవరాసులు ఏవైనా ఎదురుపడినప్పుడు, ఆకలి, దాహం వేసినప్పుడు అరవడం అతి సహజం. కరోనా రోజుల్లో కుక్కలు ఎంతగా అరిచాయో గుర్తుంది కదా. అప్పుడు తుపానులు రాలేదు కదా ? ఇక బల్లి గోడల మీద పాకడం దాని నైజం. అప్పుడప్పుడు పట్టుదప్పి నేలమీద పడడం అత్యంత సహజం. ఆ సమయంలో ఎవరున్నా వారిమీద పడుతుంది. ప్రతి అంశాన్ని లాజికల్‌గా ఆలోచించడం, కారణాలను తెలుసుకోవడం మన పని. కాదు, కూడదు ఎన్నాళ్ల నుంచో పెద్దలు ఆచరిస్తున్న వాటిని కాదంటే ఎలా అంటూ తర్కానికి దిగేవాళ్లు ఈ వ్యాసం తప్పక చదవాల్సిందే ! మూఢనమ్మకాలు ముప్పే సుమా !

అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరూ ఉపయోగిస్తున్నారు. మొబైల్ వాడని మనుషుల్ని చూడగలమా? శుభకార్యాలకు సుముహూర్తాలు నిర్వహించే పురోహితులు కూడా మొబైల్లోనే సంప్రదింపులు జరుపుతున్నారు. కంప్యూటర్ని సంప్రదించి జాతక చక్రాలు రాస్తున్నారు. కాలినడకను దాదాపు అందరూ మరిచిపోయారు. సాంకేతిక పరిజ్ఞాన ఫలితంగా ఆవిష్కరించిన స్కూటీలు, కార్లు వాడుతున్నారు. రైలెక్కి దూరాలు చేరుతున్నారు. విమానమెక్కి విదేశాల్లో విహరిస్తున్నారు. టీవీలు, సినిమాలు ఆస్వాదిస్తున్నారు. అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపించి ఖగోళ రహస్యాలు తెలుసుకుంటున్నారు. వాన రాకడ, పోకడలను ముందే పసిగడుతున్నారు. అంతెందుకు జీపీఎస్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ఎవరిల్లు ఎక్కడుందో తెలుసుకోగలుగుతున్నారు. విదేశాల్లో ఉన్న మీ బిడ్డలతో వీడియో కాల్స్‌లో మాట్లాడుతున్నారు. దహనమై బూడిదగా మారిన మనిషి వెంట్రుకతో అతనెవరో ఆనవాళ్లు చెప్పే స్థాయికి ఎదిగింది మన ఫోరెన్సిక్ సైన్సు. ఇక మీకు కావాల్సిన పచారి సామాన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మీ ఇంటికి వచ్చి అందించే ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని వేరే చెప్పాలా? అందాకా ఎందుకు, మీరేం తినాలనుకున్నా క్షణాల్లో మీ ముంగిట చేర్చే ఫుడ్ సర్వీసు కూడా ప్రారంభించారు. ఇదంతా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి ఫలితమే కదా! మానవ మనుగడను సరైన మార్గంలో పెట్టి, నైతిక విలువలను పెంచే సంస్కృతి, సంప్రదాయాలను ఎవరూ కాదనలేరు. ఎటొచ్చీ అభివృద్ధి నిరోధకాలుగా మారుతున్న మూఢ ఆచారాల పట్లనే మన అభ్యంతరం, ఆందోళన. భర్త చనిపోయిన భార్యను అదే చితిలో తగలబెట్టడం 'సతీసహగమనం'. ఇప్పుడా మూర్ఖత్వపు మూఢాచారాన్ని అనుసరించగలమా! పోనీ భర్తను కోల్పోయిన స్త్రీని 'విధవరాలు' అని ముద్రవేసి శిరోముండనం చేసి మూలన కూర్చోబెట్టగలమా ? కాలానుగుణంగా వచ్చే మార్పును అందిపుచ్చుకుని, ముందుకు సాగడమే ఎందుకంటే 'మార్పు' అనేది సహజం.

ఇప్పటికీ సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలు మంత్రాలు, మాయలు. ముఖ్యంగా గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో అవిద్య, అమాయకత్వాలను ఆసరాగా చేసుకుని కొందరు 'మాయగాళ్లు మంత్రతంత్రాలని మోసం చేస్తున్నారు. బాబాల ముసుగులో ఇంకొందరు అమాయక మహిళలను లోబరుచుకుని అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. తమను 'సంతోషపెడితే సంతాన ప్రాప్తి కలుగుతుందని నమ్మబలికి వశపరుచుకుంటారు. బతుకు ఆగమాగం చేస్తారు. ఒక పక్క మీడియా, మరోవైపు సామాజిక కార్యకర్తలు, పోలీసులు ఎంత అవగాహన కల్పించాలని చూస్తున్నా ఫలితాలు ఆశించిన మేరకు రావడం లేదు. మంత్రాలు, మాయలు చేసి రోగాలు నయం చేస్తామనే ఇంకో బాపతు మోసగాళ్లు వున్నారు. వైద్య విజ్ఞానం ఎంతపెరిగినా, ఇంకా మంత్రాలకు చింతకాయలు రాలతాయని నమ్మే వాళ్లు కోకొల్లలు.

విద్య, వైద్య, విజ్ఞాన శాస్త్రాలు ఎంత అభివృద్ధి చెందినా, ఇప్పటికీ చేతబడులు, చిల్లంగి లాంటి మూఢ నమ్మకాల్ని నమ్మేవారు, బలైపోతున్నవారూ ఉంటూనే వున్నారు. ఊరిలో ఎవరికో జ్వరం వస్తుంది. ఎంతకీ తగ్గదు. వైరల్, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు కనీసం వారం పాటు ఇబ్బంది పెడతాయి. రెండు రోజుల పాటు మందులు వాడేసి తగ్గకపోతే మళ్లీ నకిలీ వైద్యులు, లేదా భూత వైద్యులను ఆశ్రయిస్తారు. ఇక భూత వైద్యులు పుకార్లు లేవదీస్తారు. గ్రామం మీద ఆమ్మోరు ఆగ్రహించిందని, జాతర్లు చేయాలని సొమ్ములు గుంజుతారు. జాతర్లలో ఒకరిద్దరు తప్పతాగి, మాంసాలు తిని జ్వరం విషమించి చనిపోతారు. సీజన్ మారిపోయి, కొందరికి యాదృచ్ఛికంగా రోగాలు నయమవుతాయి. ఇది అమ్మోరి మహత్యం అనీ, ఇద్దర్నీ బలి తీసుకుని ఆమ్మోరు శాంతించిందని నమ్మబలుకుతారు. సంచార జాతుల వాళ్లు ఊరూరా తిరిగి, పక్షులను వేటాడి తినడం, యాచన చేసి బతుకీడుస్తుంటారు. వాళ్లు వచ్చే సమయానికి ఊరిలో ఎవరికో అస్వస్థత. అంతుచిక్కని రోగం. భయం, భయంగా తిరుగాడే సంచార జాతుల వాళ్లే 'చాతబడి' చేయడం వల్ల తమ బిడ్డకు ఈ పరిస్థితి వచ్చిందని వాళ్లను అనుమానించి, చితకబాదడం, చెట్టుకు కట్టేసి పట్కార్లతో పళ్లు పీకి, చావబాదడం ఇప్పటికీ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో చూస్తూనే ఉన్నాం. చిల్లంగి కూడా ఇటువంటి 'అనుమానపు' అవలక్షణమే. ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ఇంకా ఈ జాఢ్యపు జాడలు అక్కడక్కడా కనిపిస్తుంటాయి. ఇది ఎక్కువగా యువకుల మీద ప్రయోగించే 'మూఢాస్త్రం'.

చేతికి రకరకాల రంగుల 'రాళ్ల ఉంగరాలు' తగిలించుకోవడం ద్వారా దశ తిరుగుతుందనీ, కాలం కలిసి కాసుల వర్షం కురుస్తుందని మాయమాటలు చెప్పి జనాల్ని నమ్మించి మోసం చేసే 'గురువర్యులు' మరో బాపతు. ఈ మాయలో బడా వ్యాపారులు, రాజకీయ నాయకులు, సినీస్టార్లు కూడా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. టీవీల్లో ప్రకటనలు గుప్పించి మరీ రాళ్లు విక్రయిస్తుంటారు మోసగాళ్లు. యాదృచ్ఛికంగాను, స్వయం కృషితోను వచ్చిన మార్పులు ఉంగరాల 'మహిమ' వల్లనే వచ్చాయని నమ్మే పిచ్చోళ్లు కూడా ఉన్నారు. ఇక దయ్యాలు, భూతాలను వదిలిస్తామని కొందరు మంత్రగత్తెలు, మంత్రగాళ్లు చెలామణి అవుతుంటారు. ఇలాంటి భూత వైద్యుల కోసం మారుమూల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా వచ్చి క్యూలు కడతారు. ఎంత దౌర్భాగ్యమో కదా. హిస్టీరియా అనేది మానసిక బలహీనత వల్ల వచ్చేది. ఏదైనా చూడకూడనిది హఠాత్తుగా చూస్తే భయంతో గుండె వేగంగా కొట్టుకుంటుంది. పక్కన ఎవరూ తోడు లేకుంటే భయం మరింత పెరిగి హిస్టీరియాగా మారుతుంది. ముఖ్యంగా మహిళల్లో యుక్తవయస్సు సంకేతంగా మర్మాంగం నుంచి నెత్తురు వస్తుంది. దానిపట్ల అవగాహన లేక అమ్మాయిలకు భయంతో హిస్టీరియా లక్షణాలు వస్తాయి. పెద్దపెద్ద ప్రాజెక్టుల నిర్మాణాలు ప్రారంభించేటప్పుడు జంతుబలి, నరబలి ఇవ్వడం కూడా ఈ దూరాచారాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అందివస్తున్న శాస్త్ర సాంకేతిక అభివృద్ధిని ఉపయోగించుకొని, రుజువులతో కూడిన ఆచారాలను అవలంబించడం తప్పుకాదు. ఎటొచ్చీ మూర్ఖత్వంతో మూఢ నమ్మకాల వెంట పరుగులు తీయడమే అపచారం, అనాచారం కూడాను.

సమాజంలో పరస్పర విరుద్ధ భావనలు ఎక్కువ... సినిమాలు, సీరియల్స్‌లో రోగికి సర్జరీ చేసిన వైద్యుడు'మా ప్రయత్నం మేం చేశాం.. ఇక ఆ పైవాడి దయ 'అంటూ గాల్లో చేతులు ఊపడం అన్నమాట. అలాగే చంద్రుడు, అంగారక గ్రహాల మీద అధ్యయనం చేసేందుకు పంపే ఉపగ్రహాలకు పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి బటన్ నొక్కడం కూడా ఈ కోవలోనిదే. అమ్మ ఎదురొస్తే పరీక్షలు బాగా రాస్తాననుకోవడం నమ్మకం, అమ్మపట్ల అభిమానం. అంతేకాని అమ్మ రాకుంటే పరీక్షలు రాయలేమనుకోవడం మూఢనమ్మకం. హేతువాద సమావేశాలను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తారా ఎవరైనా ?నమ్మకానికి, మూఢనమ్మకానికి రెండు అక్షరాలే తేడా. కానీ ఒకటి వెలుతురై దారి చూపిస్తుంది. మరోటి చీకటై అన్నిదార్లు కనిపించకుండా చేస్తుంది. కాదంటారా?

జర్నలిజం పూర్వపు విభాగాధిపతి, డీన్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం,
9393100566.

రెండు కిలోల అమ్మోనియం నైట్రేట్‌తో పేలుడు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఎర్రకోట సమీపంలో జరిగిన బాంబు పేలుడు ఘటనపై ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. ఆ పేలుడులో రెండు కిలోల అమ్మోనియం నైట్రేట్‌ను వాడినట్లు దర్యాప్తుతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. అప్పుడు కారు నడుపుతోన్న డాక్టర్ ఉమర్ నబీ బాంబు తయారీలో నిపుణుడని పేర్కొన్నాయి. ఈ మేరకు జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇప్పటివరకు లభించిన 52కు పైగా పేలుడు పదార్థాల నమూనాలను ఫోరెన్సిక్ బృందం పరిశీలించింది. అమ్మోనియం నైట్రేట్, పెట్రోలియం, ఇతర పదార్థాలతో ఉమర్ నబీ పేలుడు పదార్థాలు తయారుచేసి ఉండొచ్చని తెలుస్తోంది. అలాంటివాటిని 5 నుంచి 10 నిమిషాల్లో తయారుచేయొచ్చని ఫోరెన్సిక్ వర్గాలు వెల్లడించాయి. పేలుడు జరగడానికి ముందు దగ్గరలోని పార్కింగ్ ప్రాంతం వద్ద నబీ మూడు గంటల పాటు ఎందుకు వేచి ఉన్నాడనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పేలుడు జరిగిన రోజు మధ్యాహ్నం 3.19 గంటల సమయంలో ఉమర్ కారు పార్కింగ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. సాయంత్రం 6.28 గంటలకు అతడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ ముందురోజే హర్యానాలోని ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌ను ఛేదించిన అధికారులు... అక్కడినుంచి పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

నిధుల పంపిణీకి అనుమతించడమేంటి?

ఈసీని ప్రశ్నించిన శరద్ పవార్

బారామతి (మహారాష్ట్ర): బీహార్ ఎన్నికలలో ఎన్డీఏ విజయంలో మహిళల కోసం వ్యవస్థాపకత పథకం పాత్ర పోషించిందని ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిధుల పంపిణీని ఎలా అనుమతించిందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎన్నికలలో బీజేపీ-జేడీ(యూ) కలయిక అఖండ విజయం సాధించిన ఒక రోజు తర్వాత శనివారం ఇక్కడ పవార్ విలేకరులతో మాట్లాడుతూ 'బీహార్ ఎన్నికల ఫలితం (ముఖ్యమంత్రి) నితీశ్ కుమార్ అంచనా వేసిన దానికంటే భిన్నంగా లేదు. మహిళలు ఎన్నికలను తమ చేతుల్లోకి తీసుకున్నారు. మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు జమ చేసే పథకం ఎన్డీఏకి అనుకూలమైన ప్రభావాన్ని చూపిందని నేను ఇంతకు ముందే భావించాను' అని అన్నారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన గురించి ఆయన ప్రస్తావిస్తూ 'బీహార్ ప్రభుత్వం ఈ పథకం కింద డబ్బు పంపిణీ చేయడం సరైనదేనా అని ఎన్నికల కమిషన్ ఆలోచించాలి' అని అన్నారు. భవిష్యత్ ఎన్నికలలో బీహార్ నమూనా అమలు సాధ్యమేనా అనే దానిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'మహారాష్ట్ర ఎన్నికల సమయంలో కూడా ఆ మొత్తాన్ని (లడ్కీ బహిన్ పథకం కింద) అధికారికంగా మహిళల ఖాతాలకు జమ చేశారు. పాలక పార్టీలు ఎన్నికలలో ఇలాంటి పద్ధతిని ఉపయోగిస్తే, అది ప్రజల విశ్వాసాన్ని అలాగే ఎన్నికల ప్రక్రియను దెబ్బతీస్తుందని' అని అన్నారు. స్థానిక సంస్థలకు రాబోయే ఎన్నికల కోసం ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ(ఎస్‌పీ), ఎన్‌సీపీ మధ్య పొత్తులు ఏర్పడే అవకాశం ఉన్నాయనే ప్రశ్నలకు పవార్ ప్రత్యక్ష సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారు. 'ఏ జిల్లాలలో అయినా (ఎన్‌సీపీ) రెండు వర్గాల మధ్య పొత్తుపై) చర్చలు జరుగుతున్నాయని నాకు తెలియదు. ఎన్‌సీపీ (ఎస్‌పీ) లో జరిగిన చర్చల ప్రకారం, నగర పంచాయతీ, పంచాయతీ సమితి ఎన్నికల సమయంలో స్థానిక నాయకులు (కూటమి ఏర్పాటుపై) నిర్ణయం తీసుకుంటారు' అని ఆయన తెలిపారు.

పరాజయం...
ఓట్ల వాటాలో అగ్రస్థానం

బీహార్ ఎన్నికల్లో ఆర్జేడీ రికార్డు

పట్నా: బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే 202 సీట్లు సాధించి భారీ విజయం నమోదు చేసింది. మహాగట్బంధన్ కేవలం 35 సీట్లకే పరిమితమై ఘోర పరాజయం మూటగట్టుకుంది. అయితే ఈ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల శాతం సాధించిన పార్టీగా ఆర్జేడీ నిలిచింది. బీజేపీ, జేడీయూలను పక్కకు నెట్టి ఆర్జేడీ ప్రథమ స్థానంలో నిలిచింది. బీహార్ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించి ఎన్డీయేకు చెక్ పెట్టాలని ఇండియా ఐక్యసంఘటన భావించింది. దాని కనుగుణంగానే బీహార్‌లో ప్రచారం చేసింది. లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సైతం ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం చేశారు. అయితే ఫలితాలు మాత్రం ఇండియా ఐక్యసంఘటనను కంగుతినిపించాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాల కంటే తక్కువగా మహాగట్బంధన్‌ని కేవలం 35 సీట్లకే పరిమితం చేసింది. అయితే ఈ ఎన్నికల్లో ఓట్ల షేర్ పరంగా చూస్తే ఏకైక పెద్ద పార్టీగా ఆర్జేడీ అవతరించింది. 23 శాతం ఓట్‌షేర్ సాధించి అగ్రస్థానంలో నిలిచింది. సీట్ల పరంగా చూస్తే కేవలం 25 స్థానాలకే పరిమితమైంది. 20.8 ఓట్ల శాతం సాధించిన బీజేపీ 89 స్థానాలు గెలుచుకోగా, 19.5 శాతం ఓట్లు సాధించిన జేడీయూ 85 సీట్లు గెలుచుకుంది 8.71 శాతం ఓట్ల షేర్‌తో కాంగ్రెస్ 6 సీట్లకే పరిమితమైంది. కేవలం 1.85 ఓట్ల షేర్ సాధించిన ఎంఐఎం ఐదు స్థానాల్లో గెలిచింది. గతసారి జరిగిన ఎన్నికల్లో 23.11 శాతం ఓట్ల షేర్ సాధించిన ఆర్జేడీ 73 స్థానాల్లో విజయం సాధించింది. ఈసారి మాత్రం 23 శాతం ఓట్ల షేర్ సాధించినప్పటికీ కేవలం 25 స్థానాలకే పరిమితమైంది.

ఆత్మపరిశీలనలో కాంగ్రెస్

- బీహార్ ఫలితాలపై అగ్రనేతల సమీక్ష
- ఖడ్గే నివాసంలో జనాంతిక సమావేశం
- ఈ ఫలితం ఊహించలేదు: రాహుల్

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాగట్బంధన్ ఓటమి ఊహించలేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఓటమిపై ఆత్మపరిశీలన చేసుకునే పనిలో పడ్డారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారం తమ పార్టీ అగ్రనాయకులతో జనాంతిక సమావేశం నిర్వహించారు. బీహార్‌లో ఘోర పరాభవానికి కారణాలపై చర్చించారు. తమ వైపు నుంచి తప్పు ఎక్కడ జరిగిందనే కోణంలో నాయకులు సమీక్షించారు. ఖడ్గే నివాసంలో జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీనియర్ నాయకుడు అజయ్ మాకెన్ హాజరయ్యారు. బీహార్ ఫలితాలు రాగానే అతిభారీ స్థాయిలో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ విమర్శించారు. ఎన్నికలు న్యాయంగా జరగలేదని, దీనిపై కాంగ్రెస్, ఇండియా ఐక్య సంఘటన సమగ్రంగా సమీక్షిస్తాయని, ప్రజాస్వామ్య పరిరక్షణ చర్యలు పెంచుతాయన్నారు. 'మహాగట్బంధన్‌పై నమ్మకం ఉంచి ఓటేసిన ప్రతి ఓటరుకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఈ ఫలితం నిజంగా ఆశ్చర్యపరిచింది. ఎంత మాత్రం ఊహించినది కాదు. మొదటి నుంచి అన్యాయంగా సాగిన ఈ ఎన్నికల్లో విజయం సాధించలేకపోయాం' అని రాహుల్ పోస్టు పెట్టారు. ఖడ్గే కూడా ఆయనతో ఏకీభవించారు. ప్రజాతీర్పును గౌరవిస్తామన్నారు. రాజ్యాంగబద్ధ వ్యవస్థల దుర్వినియోగానికి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్న శక్తులపై పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఎన్నికల ఫలితాలను లోతుగా అధ్యయనం చేస్తామని ఆయన చెప్పారు. 'ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పరిరక్షణ కోసం పోరు కొనసాగిస్తాం... ప్రజలకు మరింతగా అవగాహన కల్పిస్తాం' అంటూ ఖడ్గే పోస్టు పెట్టారు.

96 లక్షల మంది ఫాలోవర్లు

50 వేల ఓట్ల తేడాతో ఓటమి

పట్నా: బీహార్ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రముఖ యూట్యూబర్ మనీశ్ కశ్యప్ ఓటమి చెందారు. చన్‌పటియా నియోజకవర్గంలో జన్‌సురాజ్ అభ్యర్థిగా పోటీ చేసిన మనీశ్... 50 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. సోషల్ మీడియాలో గొప్ప ప్రజాదరణ, 96 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నప్పటికీ అనుభవజ్ఞులైన రాజకీయ ప్రత్యర్థులను ఆయన అధిగమించలేకపోయారు. బీహార్ ఎన్నికల్లో చన్‌పటియా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ రంజన్ బీజేపీ అభ్యర్థి ఉమాకాంత్ సింగ్‌పై 37 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ స్థానం నుంచి పోటీ చేసిన 34 ఏళ్ల యూట్యూబర్ మనీశ్ కశ్యప్ 50 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. బీహార్‌కు చెందిన ఆయన యూట్యూబర్‌గా సోషల్ మీడియాలో పాపులారిటీని సంపాదించుకున్నారు. బీహార్ వలస కూలీలపై తమిళనడులో దాడులు జరుగుతున్నాయంటూ 2023లో వీడియోలు రూపొందించడంతో మనీశ్ వార్తల్లో నిలిచారు. వలస కూలీలపై తమిళనాడులోని ప్రజలు దాడులు చేసి చంపుతున్నారంటూ మనీశ్ రూపొందించిన వీడియోలు 2023లో కలకలం సృష్టించడంతో తమిళనాడు, బీహార్ పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తులో అవి నకిలీ వీడియోలుగా తేలడంతో వలసకూలీలపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో అప్పట్లో తమిళనాడు పోలీసులు అతడిని అరెస్టు చేశారు. 2024లో మనీశ్ బీజేపీలో చేరారు. అనంతరం జన్‌సురాజ్ పార్టీలో చేరి... చన్‌పటియా నియోజకవర్గం నుంచి పోటీ చేశారు.

దిగజారిన ఈసీ ప్రతిష్ట: స్టాలిన్

చెన్నై: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ శనివారం స్పందించారు. ఈ ఫలితంతో ఇండియా ఐక్యసంఘటన ఎంతో నేర్చుకోవాల్సి ఉందని స్టాలిన్ అభిప్రాయపడ్డారు. అదేసమయంలో ఎన్నికల కమిషన్‌పై స్టాలిన్ అనేక ఆరోపణలు చేశారు. ఈ ఫలితంతో ఈసీపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా కొట్టిపారేయలేమని వ్యాఖ్యానించారు. ఈసీ ప్రతిష్ట దిగజారిపోయిందన్నారు. ఓడిపోయిన అభ్యర్థుల్లోనూ విశ్వాసాన్ని పాదుగొలిపేలా ఎన్నికల సంఘం ఉండాలన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు అందరికీ పాఠమంటూ స్టాలిన్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. విజయం సాధించిన సీఎం నితీశ్‌కుమార్‌కు ఆయన అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో విజయం కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమాలు, సామాజిక, సైద్ధాంతిక సంకీర్ణాలు, స్థిరమైన ప్రచారంపై ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయన్నారు. ఇండియా ఐక్యసంఘటనలో అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులు ఉన్నారన్నారు. భవిష్యత్తులో వచ్చే కొత్త రాజకీయ సవాళ్లను పరిష్కరించేందుకు వ్యూహాత్మక ప్రణాళిక వేయగలరన్నారు.

దిల్లీలో ప్రమాదకరస్థాయిలో గాలి నాణ్యతలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో గాలి నాణ్యతలు పడిపోయాయి. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు దిల్లీలో ఏక్యూఐ 386 నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యతలు నమోదయ్యాయి. అశోక్ విహార్‌లో 415, బవానా 441, బౌరారి 383, సిఆర్‌ఆర్‌ఐ మథుర రోడ్ 365, చాందినీ చౌక్ 419, ద్వారకా సెక్టార్ 393, ఐటీఓ 418, జహంగిరిపురి 422, జెఎల్‌ఎన్ స్టేడియం 389, ముండ్కా 426, నజాఫ్‌గఢ్ 385, నరేలా 418, పట్పార్‌గంజ్ 399, పంజాబి బాగ్ 405, ఆర్‌కె పురం 406, రోహిణీ 424, సిరి కోట 495, సోనియా విహార్ 410, వివేక్ విహార్ 418, వజీర్‌పూర్ 447గా ఎక్యూఐ నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో వెరీ పూర్ కేటగిరీలో.. మరికొన్ని ప్రాంతాల్లో ప్రమాదకరస్థాయిలో ఎక్యూఐ నమోదైంది. ఇప్పటికే కాలుష్య నియంత్రణకు గ్రాప్ -2, గ్రాప్ -3 నిబంధనలు అమల్లో ఉన్నాయి.

స్వల్ప మెజారిటీతో మారిన ఫలితాలు

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల ప్రత్యర్థుల మధ్య విజయం చివరి వరకూ దోబూచులాడింది. చాలా తక్కువ మెజార్టీతో కొంతమంది అభ్యర్థులు విజయం సాధించారు. మూడు స్థానాల్లో అయితే, మెజార్టీ కేవలం 100లోపే. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక్క సీటు సాధించి... బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) ఖాతా తెరిచింది. ఆ గెలుపు కూడా కేవలం 30 ఓట్ల తేడాతో దక్కడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ఎన్నికల్లో 243 సీట్లకుగాను 192 స్థానాల్లో మాయావతి పార్టీ బరిలోకి దిగింది. ఒకేఒక్క సీటు మాత్రమే ఈ పార్టీ దక్కించుకోగలిగింది. ఆ పార్టీకి చెందిన సతీశ్ కుమార్ యాదవ్ రామ్‌గఢ్ నియోజకవర్గం నుంచి బరిలో దిగారు.

ఓట్ల లెక్కింపు ఆద్యంతం ఉత్కంఠగా జరిగింది. అర్ధరాత్రి తర్వాత వెలువడిన ఫలితాల్లో సతీశ్ అతి తక్కువ మెజార్టీతో విజేతగా నిలిచారు. ఈ ఎన్నికల్లో ఆయనకు 72,689 ఓట్లు రాగా... సమీప బీజేపీ అభ్యర్థి అశోక్‌కుమార్ సింగ్‌కు 72,659 ఓట్లు దక్కాయి. భోజ్‌పూర్ జిల్లాలోని సందేశ్ అసెంబ్లీ నియోజకవర్గంలో జేడీయూ, ఆర్జేడీ అభ్యర్థుల మధ్య విజయం చాలాసేపటివరకు దోబూచులాడింది. చివరకు జేడీయూ అభ్యర్థి రాధాచరణ్ షా తన సమీప ఆర్జేడీ ప్రత్యర్థి దీపుసింగ్‌పై 27 ఓట్ల తేడాతో గెలుపొందారు. వీటితోపాటు అర్రాలోని అగియాన్ ప్రాంతంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్‌కు చెందిన శివప్రకాశ్ రంజన్... బీజేపీ అభ్యర్థి మహేశ్ పాశ్వాన్ చేతిలో 95 ఓట్ల తేడాతో ఓడిపోయారు. నబీనగర్ అసెంబ్లీ స్థానంలో జేడీయూ పార్టీకి చెందిన చేతన్ ఆనంద్, ఆర్జేడీ అభ్యర్థి ఆమోద్‌కుమార్ సింగ్‌ను 112 ఓట్ల తేడాతో ఓడించారు. బీజేపీ ప్రత్యర్థి పవన్‌కుమార్ జైస్వాల్‌ను ఓడించి ఆర్జేడీ అభ్యర్థి ఫైసల్ రెహమాన్ ధాకా స్థానాన్ని సొంతం చేసుకున్నారు. వీరి మధ్య వ్యత్యాసం 178 ఓట్లు మాత్రమే. ఫోర్బ్స్‌గంజ్ అసెంబ్లీ నుంచి బీజేపీ తరపున బరిలోకి దిగిన విద్యాసాగర్ ఓటమి పాలయ్యారు. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థి మనోజ్ బిశ్వాన్ 221 ఓట్లతో విజయం సాధించారు.

జీతభత్యాలు తీసుకోను: ఎమ్మెల్యే

బెంగళూరు: ఉత్తర కర్నాటక సమస్యలపై సమగ్ర చర్చలు జరగాలనే కారణంతో ఏటా బెళగావి సువర్ణసౌధలో శాసనసభ శీతాకాల సమావేశాలు జరుపుతున్నా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతోందని, అందుకే ప్రభుత్వం నుంచి ఏవిధమైన జీతభత్యాలు స్వీకరించేది లేదని జేడీఎస్ ఎమ్మెల్యే శరణగౌడ కందకూర్ పేర్కొన్నారు. బెళగావిలో మీడియాతో మాట్లాడిన ఆయన ఉత్తరకర్నాటక జిల్లాలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాయని, వాటిపై చర్చలకు అవకాశం కల్పించాలని స్పీకర్ యూటీ ఖాదర్‌కు లేఖ రాశానన్నారు. గురుమిట్కల్ నియోజకవర్గం నుంచి బెళగావి సమావేశాలకు వచ్చి వెళ్లే రవాణా ఖర్చులతో పాటు వేతనం, ఇతర భత్యాలను స్వీకరించేది లేదని లేఖలో పేర్కొన్నానన్నారు. ఉత్తరకర్నాటక సమస్యలు పరిష్కరించాలనే బెళగావిలో ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు జరుపుతారని, అందుకుగాను రూ.30కోట్లదాకా ఖర్చు అవుతుందన్నారు. ఇలా ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. శాసనసభ సమావేశాలకు హాజరవుతానని బయట నుంచి భోజనం తెప్పించుకుంటానని కనీసం టీ, కాఫీలు కూడా సువర్ణసౌధలో తీసుకునేది లేదన్నారు. ఉత్తరకర్నాటక ప్రాంతంలో రైతులు, పేదలు, కార్మికులే అధికంగా ఉన్నారన్నారు. ఎన్నో సమస్యలతో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. శాసనసభ్యులు విహారయాత్రలా భావించి వచ్చి వెళ్తున్నారన్నారు.

భారీ అగ్నిప్రమాదం

300 దుకాణాలు దగ్ధం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా ఎజ్రా స్ట్రీట్‌లో శనివారం తెల్లవారుజామున సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో దాదాపు 300 దుకాణాలు దగ్ధమయ్యాయి. పక్కనే ఉన్న భవనాల్లో నివసిస్తున్న వారిని సకాలంలో ఖాళీ చేయించడంతో ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కోల్‌కతా సెంట్రల్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఇందిరా ముఖర్జీ ఈ ఘటనను ధృవీకరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ మంటలు చెలరేగి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఎజ్రా స్ట్రీట్‌లోని ఇరుకైన సందుల్లో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు, చెక్క, ప్లైవుడ్ తదితర మండే స్వభావమున్న పదార్థాలను నిల్వ చేసే దుకాణాలు, గోడౌన్లలో మంటలు వేగంగా వ్యాపించాయి. దట్టమైన నల్లటి పొగతో ఆ ప్రాంతమంతా నిండిపోవడంతో అగ్నిమాపక సిబ్బంది లోపలికి ప్రవేశించడానికి ఇబ్బంది పడ్డారు. అధికారులు ఆ ప్రాంతం చుట్టూ ఉన్న అన్ని రహదారులను మూసివేశారు. కౌన్సిలర్ సంతోష్ పాఠక్ అధికారులపై తీవ్ర విమర్శలు చేశారు. గత 22 సంవత్సరాలుగా భవనంలోని పేలవమైన భద్రతా ప్రమాణాల గురించి స్థానిక అధికారులకు, పోలీసులకు చాలాసార్లు లేఖలు రాసినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తొలుత మంటలను అదుపు చేయడానికి ఆరు అగ్నిమాపక యంత్రాలను రంగంలోకి దించారు. అయితే మంటలు వేగంగా వ్యాపించడంతో మరో 20 అగ్నిమాపక యంత్రాలను రప్పించి మంటలను అదుపులోకి తెచ్చారు.

128 స్థానాల్లో రిగ్గింగ్

బీహార్ ఎన్నికలపై కాంగ్రెస్

తిరువనంతపురం: బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే భారీ మెజార్టీకి కారణం 128 స్థానాల్లో రిగ్గింగ్ జరగడం వల్లేనని కేరళ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ నియోజకవర్గాల్లోనే ఎస్‌ఐఆర్ ప్రక్రియ సమయంలో ఈసీ ఓటర్లను తొలగించిందని ఆరోపణలు చేసింది. ఓటర్ల తొలగింపు డేటా, ప్రతి నియోజకవర్గంలో ఎంత మేర ఆధిక్యంతో గెలిచారో పోల్చిన తర్వాతే కాంగ్రెస్ ఆరోపణలు చేసింది. ఈమేరకు కాంగ్రెస్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఎన్డీయే గెలిచిన 202 స్థానాల్లో 128 స్థానాలు ఎస్‌ఐఆర్ ప్రక్రియలో ఓట్ల తొలగింపు వల్లే గెలిచాయి. సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా భారత ఎన్నికల సంఘం ప్రచురించిన ఓటర్ల తొలగింపు డేటాను విశ్లేషించాం. ప్రతి నియోజకవర్గంలోని గెలుపునకు దగ్గరగా రావడంతో పోల్చాం. అక్కడ జీవించి ఉన్న ఓటర్లను ఎస్‌ఐఆర్ కింద ఏకపక్షంగా తొలగించారు. ఇది స్పష్టంగా ఉంది అని కేరళ కాంగ్రెస్ ఎక్స్ పోస్టులో పేర్కొంది. పేదలు, దుర్భర దారిద్ర్యంలో ఉన్న ఓటర్లను తొలగించడానికే ఎస్‌ఐఆర్ పేరుతో మొత్తం ప్రక్షాళన జరిగినట్లు కాంగ్రెస్ తెలిపింది. ఎన్డీయే పాలనలో పేదల్ని ఓటర్ల లిస్టు నుంచి తొలగించారు. ఇక మిగిలిన వారిని ఎన్నికల్లో ఓటు వేయకుండా నిరోధించారు. ఇప్పుడు మనం బీజేపీ ప్రణాళిక అంతరార్థం తెలుసుకోకపోతే... మనలో ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితా నుంచి తొలగిస్తుంది. మన స్థానంలో డమ్మీ బ్రెజిలియన్లను చేర్చుతుంది. వారి తరపున ఓట్లు వేస్తూ... ప్రతి ఎన్నికల్లో ఎప్పటికీ గెలుస్తూనే ఉంటుంది అని కాంగ్రెస్ ధ్వజమెత్తింది.

ఓట్ల చోరీపై యువజన కాంగ్రెస్ నిరసనలు

బెంగళూరు: వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో పెద్ద ఎత్తున 'ఓటు చోరీ' (ఓటు దొంగతనం) జరిగిందని ఆరోపిస్తూ కర్నాటక ప్రదేశ్ యువజన కాంగ్రెస్ కమిటీ (కేపీవైసీసీ) శనివారం ఇక్కడ నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఎన్నికల అక్రమాలపై భారత ఎన్నికల సంఘం, కేంద్రం నుంచి జవాబుదారీతనం కోరిం ది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'భారీ స్థాయిలో ఓటు చోరీ' జరిగిందని, 'మొదటి నుంచీ న్యాయంగా లేని ఎన్నికల్లో మేము విజయం సాధించలేకపోయాము' అని రాహుల్ గాంధీ చెప్పిన ఒక రోజు తర్వాత ఈ ప్రదర్శన జరిగిం ది. ఇక్కడి ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన ప్రదర్శనకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, ఐవైసీ ఇంఛార్జ్ మనీశ్ శర్మ, కేపీవైసీసీ అధ్యక్షుడు మంజునాథ్ గౌడ నాయకత్వం వహించారు. వీరిలో కార్మిక మంత్రి సంతోశ్ లాడ్, రాజ్యసభ ఎంపీ జీసీ చంద్రశేఖర్ ఉన్నారు. ఎన్నికల వ్యవస్థలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని, పారదర్శకతను నిర్ధారించే చర్యలను కోరుతూ నిరసనకారులు బెంగళూరులోని ఎన్నికల కమిషన్ కార్యాలయానికి కూడా ర్యాలీ చేయనున్నారు.

ముంబై మునిసిపల్ ఎన్నికల్లో
కాంగ్రెస్ ఒంటరి పోరు

ముంబై: మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) లో ఉద్రిక్తత ఏర్పడే అవకాశం ఉందని, బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కి జరగబోయే ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేయడానికి పార్టీ సిద్ధమవుతోందని కాంగ్రెస్ ముంబై అధ్యక్షురాలు వర్ష గైక్వాడ్ అన్నారు. శనివారం పార్టీ సమావేశంలో ప్రసంగిస్తూ, 'బీఎంసీలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని సంకల్పించుకోవాలని పిలుపునిచ్చారు. 'కాంగ్రెస్ కార్పొరేటర్లు ఎన్నికలయ్యేలా మనం చూసుకోవాలి. మొత్తం 227 స్థానాలకు సిద్ధం కావాలి' అని ఆమె అన్నారు. దేశంలోనే అత్యంత ధనిక పౌర సంస్థ అయిన బీఎంసీకి ఎన్నికలు జనవరి 2026లో జరిగే అవకాశం ఉంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ చెన్నితల, కాంగ్రెస్ మహారాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ సహా సీనియర్ నాయకుల సమక్షంలో గైక్వాడ్ ఈ ప్రకటన చేశారు. శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే, ఆయన బంధువు మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) నాయకుడు రాజ్ థాకరే పౌర ఎన్నికలకు చేతులు కలిపే అవకాశం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చింది. గతంలో బీఎంసీ ఎన్నికలలో పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందా అని విలేకరులు చెన్నితలను అడిగినప్పుడు... అలాంటి నిర్ణయాలు స్థానిక విభాగాలకే వదిలివేయడం జరుగుతుందన్నారని గైక్వాడ్ తెలిపారు.

'శ్రమశక్తి నీతి' వెనక్కి

కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముసాయిదా కార్మిక విధానం 'శ్రమశక్తి నీతి-2025' వివాదాస్పదంగా మారింది. దీనిని కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నాయి. తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవియా నేతృత్వంలో త్రైపాక్షిక సమావేశంలోనూ కొత్త విధానాన్ని 10 కేంద్ర కార్మిక సంఘాలు ఐక్యంగా వ్యతిరేకించాయి. కార్మికుల సాధికారతకు బదులు వారి హక్కులను నీరుగార్చే విధానం వద్దని సూచించాయి. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించాయి. ఈ ముసాయిదా విధానంలో పనిని హక్కుగా కాకుండా 'పవిత్ర విధి'గా పేర్కొనడాన్ని తప్పుపట్టాయి. అధికార కేంద్రీకరణ... రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు తగ్గించడాన్ని నిలదీశాయి.

ఎన్నికల తర్వాతే తమిళనాట ఎస్‌ఐఆర్

సీపీఐ డిమాండ్

చెన్నై: ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరిట ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్ చేపట్టడంపై వివాదం నడుస్తోంది. 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే తమిళనాడులో ఎస్‌ఐఆర్ ప్రక్రియను వాయిదా వేయాలని సీపీఐ గట్టిగా డిమాండ్ చేసింది. తయారీకి సముచిత సమయం లేకపోవడం, ఈశాన్య రుతుపవనాల రాకకు తోడు పండుగల సీజన్ కావడంతో ఈ ప్రక్రియ చేపట్టేందుకు ఇది అనువైన సమయం కాదని శుక్రవారం ఒక ప్రకటనలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్ పేర్కొన్నారు. ఇటీవల ప్రధాన ఎన్నికల అధికారితో 12కుగాను 10 రాజకీయ పార్టీలు సంప్రదింపులు జరిపాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎస్‌ఐఆర్ చేపట్టాలని డిమాండ్ చేశాయి. అయినాగానీ ఎన్నికల సంఘం ఈనెల 4న ఎస్‌ఐఆర్‌ను ప్రకటించింది. 78 శాతం ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ జరిగినట్లు ఈసీఐ చెబుతున్నది అవాస్తవం. 50 శాతం మందికి ఫారాలు అందలేదన్నది క్షేత్రస్థాయి నుంచి నివేదికలు వస్తున్నాయి. సరైన శిక్షణ లేక ఫారాలను నింపడానికి బూత్‌స్థాయి అధికారులు, ఓటర్లు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ఇది కొనసాగితే జాబితాల కచ్చితత్వానికి విఘాతం కలుగుతుంది' అని సీపీఐ పేర్కొంది. అదే విధంగా అన్నమలై యూనివర్సిటీ ఫెడరేషన్ ఆఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ వేరొక ప్రకటన చేసింది.

గిరిజనులను విస్మరించిన కాంగ్రెస్

ప్రధాని మోదీ విమర్శ

దేడియాపాడ (గుజరాత్): భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి గిరిజనులు గొప్పగా దోహదపడినప్పటికీ, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ తన 60 సంవత్సరాల పాలనలో గిరిజనుల సహకారాన్ని ఎప్పుడూ గుర్తించలేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గిరిజన దిగ్గజం భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని గుజరాత్‌లోని నర్మదా జిల్లా దేడియాపాడ పట్టణంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ... తన ప్రభుత్వం వైద్య సౌకర్యాలు పెంచిందని, గిరిజన ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలు పెంచడానికి కృషి చేస్తోందని అన్నారు. గిరిజన ప్రాంతాలు సికిల్ సెల్ అనీమియా ముప్పును ఎదుర్కొంటున్నందున మేము వైద్య సదుపాయాలను పెంచామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని, ఇటీవల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన మహిళా జట్టులో ఒక గిరిజన క్రీడాకారిణి ఉందని తెలిపారు. తన ప్రసంగానికి ముందు, ప్రధాని రూ.9,700 కోట్లకు పైగా ఖర్చు చేసే వివిధ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీ మంజు శంకర అపార్ట్ మెంట్ వద్ద పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు, ప్రమాదకరంగా ఉన్న కరెంటు వైర్లు సరి చేయడానికి కాలనీవాసుల విజ్ఞప్తితో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ పరిశీలించి వెంటనే పనులు ప్రారంభించవలసిందిగా విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏ.ఈ గోపాల్, డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి, మంజు శంకరా అపార్ట్ మెంట్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రామకృష్ణ, లక్ష్మీ, కవిత , శ్రావణి, తులసి, మోహన్, రాములు, రాము, రవి, హరికిషన్, సచిన్, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట

విశాలాంధ్ర, మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్‌లో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తనవంతుగా రూ.1 లక్ష ఆర్థిక సహాయంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి, అనంతరం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుక ప్రాంత ప్రజల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్నినింపింది. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు బాలరాజు, కనకయ్య, మల్లేష్, నరసింహా, నాగరాజు, రామచందర్, సిద్ధులు, సుధామ, రవి, అశోక్, స్థానిక భక్తులు, మహిళా సంఘాలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు చిల్డ్రన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

విశాలాంధ్ర, హైదరాబాద్ : 2025 బాలల దినోత్సవం సందర్భంగా విద్యా, కళలు మరియు అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయంగా, జాతీయంగా అత్యంత ప్రతిభ కనబరిచిన ఐదు మంది విద్యార్థులకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అనుబంధ సంస్థ అయిన చిల్డ్రన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఈ మేరకు నాయిస్ మేకర్స్ ఈవెంట్స్ సంస్థ సహకారంతో ఇండియన్ బుక్‌ఆఫ్ రికార్డ్స్ న్యాయనిర్ణేతలు డా. పావని, డా. సరయు దేవభక్తుని చిల్డ్రన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కిన విద్యార్థిని విద్యార్థులు డెహ్రాడూన్‌లోని ఆసియన్ ఓపెన్ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ ట్రోఫీ 2025లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరచిన మిష్కా అగర్వాల్‌కు 'ది గ్లైడింగ్ గ్లోరీ అవార్డు'ను, సిబిఎస్ఈ క్లస్టర్ గోల్డ్ మెడలిస్ట్‌గా అథ్లెటిక్స్‌లో అత్యుత్తమ విజయానికి, జాతీయ టాప్-5 అథ్లెట్లలో స్థానం సంపాదించినందుకు బర్ధవల్ శివ శంకర్‌కు 'ది స్ప్రింటింగ్ స్టార్ అవార్డు'ను, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించి డిజైన్ ఛాంపియన్‌షిప్ (సౌత్ జోన్)లో మొదటి స్థానాన్ని పొందిన అదితి సోమకు 'ది విజనరీ డిజైనర్ అవార్డు'ను, రాష్ట్ర, జాతీయ స్థాయిలో భరతనాట్యంలో నైపుణ్యం ప్రదర్శించిన కీర్తన రెడ్డి మడమడకలకు 'కల్చరల్ హార్మనీ అవార్డు' ను, అంతర్జాతీయ పాఠ్యాంశాల యొక్క పదవ తరగతి బోర్డు పరీక్షలలో అన్ని సబ్జెక్టులలో ఏ స్టార్ సాధించినందుకు ఆరుషి ముదిగొండ కు 'ది అకడమిక్ ఎక్సలెన్స్ 'అవార్డును సర్టిఫికెట్‌లను హైదరాబాద్, గుండ్ల పోచంపల్లి, డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేసారు. డిఆర్ఎస్ ఐఎస్ ప్రిన్సిపాల్ ఐ, వేణుగోపాల్ విజేతలను అభినందించి మాట్లాడుతూ ఈ వేడుక విద్యార్థుల యొక్క ఆనందకరమైన సారాన్ని క్రీడా, సంగీతం, సృజనాత్మకత ను పెంపొదిస్తుందని, విద్యార్థులలో దాగి ఉన్న సృజన శక్తి, పరిశోధనలు రేపటి భవిష్యత్తుకు పునాదులు వేస్తాయని అన్నారు. విద్యా, కళలు, అథ్లెటిక్స్ రంగాలలో రాణించడాన్ని డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఎస్ ఐఎస్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్, రెసిడెన్సియల్ హెడ్ రాజేందర్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, అడ్మిన్ హెడ్ వినోద రంజన్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి జీహెచ్ఎంసీలో ప్రజావాణి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈనెల 17నుంచి యథావిధిగా కొనసాగనుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఎన్నిక ముగిసినందున తిరిగి వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమంను జీహెచ్ఎంసీ పునరుద్ధరిస్తుంది.

దేవయ్య మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

విశాలాంధ్ర , కాప్రా : ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఎన్. దేవయ్య అకాల మృతి సీపీఐ - ఏఐటీయూసీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఎస్. బోస్ అన్నారు. కామ్రేడ్ ఎన్. దేవయ్య ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో 30 సంవత్సరాలుగా ఏఐటీయూసీ కార్మిక రంగంలో సేవలందించారు. సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్‌రెడ్డిభవన్ ఈసీఐఎల్‌లో ఎన్. దేవయ్య సంతాప సభ నిర్వహించడం జరిగింది. ఈ సంతాప సభకి శ్రీమన్నారాయణ అధ్యక్షవైంచడం జరిగింది, ఈ సందర్భంగా వి ఎస్‌బోస్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాట్లాడుతూ ఎన్. దేవయ్య మరణం కార్మిక వర్గానికి తీరని లోటు అని, దాదాపు 30 సంవత్సరాలుగా ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) లో ఏఐటీయూసీ నాయకునిగా సేవలందించారు ఎంతో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పేరు

పొందారు. ఎస్ .దేవయ్య 1972 లో ఈసీఐఎల్ లో చేరడం జరిగింది, కార్మిక వ్యతిరేక చట్టాలకి ముందుండి పోరాటాలు చేయడం జరిగింది. ఎన్. దేవయ్య 2002 లో రిటైర్మెంట్ అయ్యారు, ఆ తర్వాత ఎల్బీనగర్ సిపిఐ ఏరియా సెక్రటరీగా రెండు పర్యాయలో చేయడం జరిగింది. తను నమ్ముకున్న కార్మిక వర్గానికి, సిపిఐ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న గొప్ప నాయకుడు మరణించడం చాలా బాధాకరమని వారు అన్నారు. ఈ సంతాప సభ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు శంకర్రావు, ఎం. ఆర్. కే రెడ్డి , మోహన్ రావు, నరసింహ, ప్రభాకర్, నరసింహారావు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ , సిపిఐ నాయకులు రాజ్ కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

17న చలో హైదరాబాద్ : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) కింద వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఆల్ క్యాడర్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పెండింగ్ వేతనాలు ఏరియర్స్ సాధన కోసం ఈనెల 17న మహా ధర్నా పేరిట చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్ తెలిపారు. శనివారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు పురుగు సేవల ఉద్యోగులకు రెండు నెలల పెండింగ్ వేతనం, ఏడు నెలల పెండింగ్ ఏరియర్స్,ఉద్యోగ భద్రత డిమాండ్స్ తో 17న చేపట్టబోయే రాష్ట్రవ్యాప్త మహా ధర్నా నోటీసును ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయంలోని డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్.కృష్ణకి ఎన్.హెచ్.ఎం ఉద్యోగులు అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ హెచ్ ఎం కింద పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించకుండా నెలల

తరబడి పెండింగ్‌లో ఉంచడం చేత ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏడు నెలల ఏరియర్స్ కూడ చెల్లించడం లేదని అన్నారు.ఇప్పటికే అనేక పర్యాయాలు రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులతో చర్చించి ఆందోళన నోటీసులు ఇచ్చిన ఫలితం లేదా అని అన్నారు. నోటీసులు ఇచ్చినప్పుడు మాత్రమే స్పందిస్తూ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇస్తున్న ఆచరణలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ హెచ్ ఎం స్కీమ్‌లో 78 రకాల విభాగాల్లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో 18 వేల మందికిపైగా పనిచేస్తున్నారని అన్నారు.దశాబ్దాల తరబడి పనిచేస్తున్న ఉద్యోగ భద్రతకు నోచుకోవడం లేదని అన్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్న స్పందించడం లేదని వీధిలేని పరిస్థితుల్లోనే 17న కోఠీ లోని కమిషనర్ కార్యాలయం ఎదుట వారి ఆందోళనకు దిగుతున్నామని అన్నారు. ఎన్‌హెచ్‌ఎం స్కీములో పనిచేస్తున్న ఆల్ క్యాడర్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు, ఉద్యోగులు నవీన్ కుమార్, తిమ్మిలు, హరిబాబు, యుగేందర్, గోపాలకృష్ణ, మహేష్, రంజిత్,నాయక్, స్వప్న,రజిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ రిక్రూట్మెంట్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్లు సువర్ణ అధ్యాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పోలీస్ రిక్రూట్మెంట్‌లో వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించడం ఓ సువర్ణ అధ్యాయం అని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ మూతినేని వీరయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి దివ్యాంగుల ఆత్మ బంధువు రేవంత్ రెడ్డికి, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి వర్యులు, వికలాంగుల పెద్దన్న అడ్లూరి లక్ష్మణ్, డీజీపీ శివధర్ రెడ్డికి, తెలంగాణ రిక్రూట్ మెంట్ బోర్డు చైర్మన్, అధికారులు అందరికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ రిజర్వేషన్ కోసం గత 10 ఏండ్లలో ఇదే విషయం పై కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగంతో పాటు వికలాంగుల జేఏసీ అనేక ఉద్యమాలు చేసిందన్నారు. ఈ రిజర్వేషన్ ఖచ్చితంగా అమలు చేయాలి అని 2017లో మొదట ఈ విషయం ఆధారాలతో ఆనాటి ప్రభుత్వం కేసీఆర్‌పై అనేక ఉద్యమాలు చేశానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోక పోగా, మా ఉద్యమాలను అనగాద్రొక్కిందన్నారు. మా కోరిక మేరకు, వికలాంగుల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో పెట్టిందన్నారు. వికలాంగుల హక్కుల చట్టం -2016 కి సంపూర్ణ అమలు భాగంగా నేటి ప్రజా పాలన ప్రభుత్వం, దివ్యాంగుల సంక్షేమ ప్రభుత్వంగా మారిందన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్య మంత్రి మల్లు బట్టి విక్రమార్క, సీఎంఓ శ్రీనివాస్, సెక్రటరీ అనితా రామచంద్రన్, శాఖ డైరెక్టర్ శైలజ, మిగతా అధికారులు అత్యంత చొరవ తీసుకోని పోలీస్ రిక్రూట్ మెంట్ లో మొట్ట మొదటి సారీ వికలాంగుల రిజర్వేషన్ అమలు చేయడం పట్ల వీరందరికి తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ వికలాంగుల పట్ల ధన్యవాదములు తెలియజేశారు.

పారదర్శకంగా గృహనిర్మాణాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణా ప్రభుత్వ జీరో టాలరెన్స్ విధానానికి అనుగుణంగా విధులను నిర్వహించాలన్న సంకల్పంతో హౌసింగ్ కార్పొరేషన్‌లో అనేక వినూత్నమైన కార్యక్రమాలను చేప్టటారు. అవినీతి, లంచం అనేవి లేకుండా పూర్తి పారదర్శకంగా గృహ నిర్మాణ పథకాల లబ్ధి చేకూరుతుందనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో హైదరాబాద్‌లోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో శనివారం సంస్థ మేనేజింగ్ డైరక్టర్ విపి గౌతం నేతృత్వంలో దీనికి అను గుణంగా ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలనుంచి వచ్చిన ప్రాజెక్టు డైరక్టర్లు, మేనేజర్లు అసిస్టెంట్ మేనేజర్లు తదితర స్థాయిల్లోని అధికారులతో పాటు, ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు, సిబ్బంది అందరూ కలిసి శనివారం సాయంత్రం అవినీతికి వ్యతిరేకంగా హైదరబాద్ లిబర్టీ సమీపంలో మానవహారం నిర్వహించారు. అవినీతికి వ్యతిరేకంగా

చేపడుతున్న కాల్ సెంటర్ , హెల్ప్ డెస్క్ తదితర వివరాలతో కూడిన కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్ల ఆధ్వర్యంలో కూడా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించను న్నారు. ఈ పాదయాత్ర, మానవహారం కార్యక్రమంలో కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఈశ్వరయ్య, చైతన్య కుమార్, భాస్కర రెడ్డి, విజయకుమార్, మమత, శ్రీదేవి తదితరులతో పాటు అనేక మంది పాల్గొన్నారు.

లంచం వద్దు...సేవే లక్ష్యం...

'లంచం వద్దు, సేవే లక్ష్యం' అని, 'నిజాయితీ మా విలువ-అవినీతి మా శత్రువు' 'అవినీతికి నో బాధ్యతకు యస్' వంటి నినాదాలతో లంచాన్ని సహించవద్దంటూ ప్లకార్డులు పట్టుకుని హిమాయత్ నగర్‌లోని ప్రధాన కార్యాలయం నుంచి లిబర్టీ వరకు పాదయాత్రగా తరలి వెళ్లారు. అక్కడ మానవహారం నిర్వహించి, అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో భాగస్వాములైన వివిధ విభాగాల ప్రభుత్వ సిబ్బంది, అధికారులతో పాటు, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా అవినీతి వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించాలని హౌసింగ్ కార్పొరేషన్ నిర్ణయిం చింది. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించడమే కాకుండా, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందిరమ్మ ఇండ్ల యాప్‌ను, హెల్ప్ డెస్క్, కాల్ సెంటర్ల ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలు అందిస్తున్నది.

డయాబెటిస్‌ను సమర్థవంతంగా నియంత్రణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సరైన సంరక్షణ, జీవనశైలి, సానుకూల దృక్పథంతో డయాబెటిస్‌ను సమర్థంగా నియంత్రిం చవచ్చని వారి ప్రయాణాలు నిరూపిస్తున్నాయని డా.మోహన్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ ఎండి.డాక్టర్ ఆర్. ఎం. అంజనా అన్నారు. మేము మా రోగుల ఆరోగ్య విజయాలను, వారి అచంచలమైన స్ఫూర్తిని జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం 2025ను పురస్కరించుకుని, డాక్టర్ మోహన్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ హైదరాబాద్‌లోని హోటల్ కినారా గ్రాండ్లో స్ఫూర్తిదాయకంగా, భావోద్వేగపూరితమైన అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ వేడుకలో, తమ డయాబెటిస్ ప్రయాణాన్ని ధైర్యం, పట్టుదల, విజయగాథగా మలిచిన రోగుల స్ఫూర్తిదాయక మనోబలాన్ని సత్కరించారు. ఆమె మాట్లాడుతూ డయాబెటిస్ ఒకరి ఆత్మస్థైర్యాన్ని పరీక్షించినా, సంకల్పం, ఆశతో జీవించే

వారిని అది ఓడించలేదని ప్రతి అవార్డు గ్రహీత మనకు గుర్తు చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ మోహన్ వద్ద, మా లక్ష్యం కేవలం చికిత్సకు మాత్రమే పరిమితం కాదు, అది జీవితాలను శక్తివంతం చేయడాం కూడా," అని ఆమె అన్నారు. "నిరంతర విద్య, ఆవిష్కరణ మరియు దయతో కూడిన సంరక్షణ ద్వారా, డయాబెటిస్‌తో జీవించే ప్రతి వ్యక్తి తమ ప్రయాణంలో మద్దతుతో, అవగాహనతో మరియు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు మావంతు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

సీపీఐ బస్సు జాతను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - మొయినాబాద్ : భారత కమ్యూనిస్టు పార్టీ బస్సు జాతను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో మండల పార్టీ కార్యదర్శి కె. శ్రీనివాస్ అధ్యక్షతన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె. రామస్వామి హాజరై మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డ పై 1925 డిసెంబర్ 26వ తేదీన ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ పట్టణంలో ఏర్పడిందన్నారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించి ఎంతోమంది బలి అయినారని, ఎంతోమంది జైలు జీవితం గడిపారని, ఎంతోమంది ప్రాణాలు అర్పించారని, ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. కార్మిక, కర్షక, రైతుల, పేద ప్రజల కోసం ఎండిన డొక్కల కోసం సమసమాజ స్థాపన కోసం ఏర్పడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. భారత గడ్డపై 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 26 డిసెంబర్ 2025న కంభం పట్టణంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ జరుగుతుందని వెల్లడించారు. ఈ 100 వసంతాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూడు బస్సు జాతలు ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభం అవుతున్నాయని దీనిలో భాగంగా ఒక బస్ జాత సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి పాశ్య పద్మ ఆధ్వర్యంలో 18 వ తేదీ సాయంత్రం 4 గంటలకు బస్సు జాత మొయినాబాద్ మండల కేంద్రానికి

చేరుకుంటుందని తెలిపారు. కావున పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు రైతులు కార్మికులు కర్షకులు ప్రజలు ఈ బస్సు జాతకు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహము నుండి ఇంద్రారెడ్డి విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని ఇంద్రారెడ్డి విగ్రహం దగ్గర కార్నల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. ప్రభు లింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు జాతా జయప్రదం చేయండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సిపిఐ శతాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని నవంబర్ 15 నుంచి గద్వాల జిల్లాలో ప్రారంభమై కొత్తగూడెం వరకు జరిగే ప్రచార బస్సు జాత ఈ నెల 16న ఆదివారం సాయంత్రం 4:00 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని రెండు రోజులపాటు జిల్లాలో నిర్వహించే ప్రచార జాతలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ పిలుపునిచ్చారు. సిపిఐ బస్సు జాతా వెంబడి.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఎం.బాల నరసింహ, ఎమ్మెల్సీ కామ్రేడ్ నెల్లికంటి సత్యం, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కే. శ్రీనివాస్ కళాకారుల బృందంతో మహబూబ్నగర్ పట్టణంలోని క్లాక్ టవర్ (గడియారం చౌరస్తా)సమీపంలో సాయంత్రం 6 గంటలకు సభ మరియు ఆట, పాటలతో కూడిన ధూమ్ ధామ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. తదనంతరం జడ్చర్ల పట్టణంలోకి 17 నా ఉదయం ప్రవేశిస్తుందని తెలిపారు. ఈ బస్సుజాత కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు నాయకులు, అభిమానులు, ప్రజలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని బస్సు జాతాను విజయవంతం చెయ్యాలని బాలకిషన్ పిలుపునిచ్చారు.

నేడు జాతీయ పత్రికా దినోత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఈ నెల 16న జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ మీడియా అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ పాల్గొంటున్నారు. ప్రముఖ సంపాదకులు దేవులపల్లి అమర్, అదే విధంగా పుర ప్రముఖులు, వర్కింగ్ జర్నలిస్టులు హాజరు అవుతారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పనిచేయడం ప్రారంభించిన రోజునే నేషనల్ ప్రెస్ డేగా జరుపుకుంటాము. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఒక ప్రత్యేకమైన సంస్థ, పత్రికా స్వాతంత్ర్యాన్ని ఏకైక సంస్థ. 1956లో ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటును చేస్తూ, జర్నలిజంలో వృత్తిపరమైన నీతిని కాపాడుకోవడానికి ఉత్తమ మార్గంగా పరిగణించబడింది. దీని ద్వారా చట్టబద్ధమైన అధికారం కలిగిన సంస్థను ఉనికిలోకి తీసుకురావడం జరిగింది. వర్కింగ్ జర్నలిస్టులు నవంబర్, 16 ఉదయం 10-30 గంటలకు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నందున అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు.

నేడు 'విద్యా వ్యవస్థ'పై టీజేటీఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని విద్యా రంగ పరిస్థితిపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించేందుకు తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ (టీజేటీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని టీజేటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోరం వీరభద్రరావు, జాడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని డ్రీమ్ స్కేప్ హోటల్ లోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యా రంగ ప్రముఖులు, విద్యారంగంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్య మనోవిజ్ఞాన శాస్త్ర నిపుణులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ విద్యా వ్యవస్థ పై ప్రగతిశీల ఆశయాలు ఉన్న అందరూ ఈ సదస్సులో పాల్గొనాలని ఆహ్వానించారు. సంస్థ ఉపాధ్యక్షులు బూర్ల రమేష్ గౌడ్, సంస్థ ప్రధాన కార్యదర్శి జాడి శ్రీనివాస్, కోశాధికారి ఘనపురం దేవేందర్ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌తో రాంకీ భారీ ఒప్పందం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇండస్ట్రియల్ ఇన్ ఫ్రా సొల్యూషన్స్, వాటర్ అండ్ వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ అర్బన్ సొల్యూషన్స్‌లో ప్రత్యేక నైపుణ్యం కలిగిన మౌలిక సదుపాయాల రంగంలో రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పని చేస్తోంది. సెప్టెంబర్ 30, 2025తో ముగిసిన రెండవ త్రైమాసికం అర్ధ సంవత్సరం (హెచ్1) కోసం బలమైన ఏకీకృత స్వతంత్ర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఇది స్థిరమైన కార్యాచరణ ఊపందుకోవడం, క్రమశిక్షణ కలిగిన ఆర్థిక నిర్వహణ అమలు, ఆర్డర్ బుక్ వృద్ధిపై పునరుద్ధరించబడిన దృష్టిపై స్పష్టమైన దృష్టిని సూచిస్తుంది. ఈ త్రైమాసికంలో, 'మల్లన సాగర్ రిజర్వాయర్ నుండి గోదావరి నీటితో ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లను నింపడం అనే ప్రాజెక్ట్ కోసం కంపెనీ హెచ్ ఎండబ్ల్యూఎస్ ఎస్ తో రాయితీ ఒప్పందంపై సంతకం చేసింది. రూ. 2,085 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు 2 సంవత్సరాల నిర్మాణ కాలం, ఆ తర్వాత 10 సంవత్సరాల కార్యకలాపాల నిర్వహణ ఉంటుందనిరాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సీఈఓ సునీల్ నాయర్ తెలిపారు. ఈ సంవత్సరం ప్రారంభంలో మేము నిర్దేశించుకున్న వ్యూహాత్మక లక్ష్యాల విజయవంతమైన సాక్షాత్కారాన్ని, పునర్నిర్మాణ నిష్క్రమణ తర్వాత మేము సాధించిన మెరుగైన స్థిరత్వాన్ని మా క్యూ 2 ఫలితాలు ప్రతిబింబిస్తాయన్నారు. ఈ పనితీరు మా కంపెనీ స్థిరమైన వృద్ధి, స్థిరమైన పనితీరు, విలువ సృష్టి మరియు దీర్ఘకాలిక వాటాదారుల విశ్వాసం కోసం మంచి స్థానంలో ఉందని నిర్ధారిస్తుందని పేర్కొన్నారు. పునాది ఇప్పుడు బలంగా ఉందని పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, నీరు, పట్టణ పరిష్కారాల రంగాలలో ఉద్భవిస్తున్న ముఖ్యమైన అవకా శాలను సంగ్రహించడానికి మేము ఆదర్శంగా ఉన్నామని వివరించారు. తద్వారా మా వాటాదారులకు మెరుగైన విలువను అందిస్తామన్నారు.

నగేష్ కుటుంబానికి మైనంపల్లి పరామర్శ

విశాలాంధ్ర, మల్కాజిగిరి : తెలంగాణ ఉద్యమకారుడు మల్కాజిగిరి గౌతమ్ నగర్ డివిజన్ ఇందిరా నెహ్రూనగర్ నివాసి నగేష్ కుమారుడు ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను శనివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పార్టీ నాయకులతో కలసి పరామర్శించారు. ఎదిగిన కుమారుని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను మైనంపల్లి హనుమంతరావు ఓదార్చారు. జరిగిన సంఘటన జరిగిపోయింది. ధైర్యాన్ని కోల్పోకూడదని ధైర్యం చెప్పారు. కుటుంబానికి ఎప్పుడైనా అండగా ఉంటానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు అంత మిడిసిపాటు ఎందుకు : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర – హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఒక్క ఉపఎన్నికల్లో గెలవగానే సీఎం.రేవంత్ రెడ్డికి అంత మిడిసిపాటు ఎందుకో అని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. రేవంత్ రెడ్డి ఎగిరెగిరి పడకుండా మాట్లాడాలని, తాను సుద్దపూసను అన్నట్లుగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. శనివారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఏదో ఘన విజయం సాధించినట్లు సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని కానీ జూబ్లీహిల్స్ గెలుపు రేవంత్ రెడ్డి పరిపాలనకు ప్రజల ఆమోదం కాదన్నారు. ఉప ఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సర్వసాధారణం అని, గతంలో అనేక ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డిపాజిట్లు కోల్పోయిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ డిపాజిట్లు కోల్పోయిందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల విజయం కోసం సీఎం,15 మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్యకర్త నుంచి డీజీపీ వరకు పని చేశారని విమర్శించారు. ఆడబిడ్డపై దాష్టీకానికి పాల్పడ్డారు. 200 కోట్లు ఖర్చు పెట్టి, ఎంఐఎం పార్టీని బ్రతిమిలాడి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచారని మండిపడ్డారు. బీహార్, రాయలసీమ, పాతబస్తీలో జరిగినట్లు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రేవంత్ రెడ్డికి జీవన్మరణ సమస్య కావడంతో అధికారులతో, ఎన్నికల సంఘంతో, ఎంఐఎంతో కుమ్మక్కు అయ్యి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లో గెలిచారని విమర్శించారు. జూబ్లీహిల్స్ లో ఓడిపోతే రేవంత్ రెడ్డి సీఎం పదవి పోతుందని భయపడ్డారని, జూబ్లీహిల్స్ లో ప్రజకు రేవంత్ రెడ్డిని చూసి ప్రజలు ఓట్లు వేయలేదని. నవీన్ యాదవ్ ను చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారన్నారు. కేటీఆర్ ను చూసి రేవంత్ రెడ్డి అసూయ పడుతున్నారని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ను రాహుల్ గాంధీ దగ్గర ఫ్రాంచైజీ కొనుక్కున్నట్లు రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. బీహార్ లో ఇండియా కూటమి ఓటమికి కారణం అయిన అసదుద్దీన్ ఒవైసీని రేవంత్ రెడ్డి ఎట్లా పొగుడుతారని ప్రశ్నించారు..

రాజీతోనే రాజా మార్గం

విశాలాంధ్ర– ఆమనగల్లు: రాజీ తోనే రాజా మార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు వివిధ కేసుల్లో కక్షిదారులు రాజీ పడితేనే ఇరువురికి న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు ఆమనగల్లు జూనియర్ మున్సిఫ్ కోర్ట్ ఆవరణలో శనివారం జడ్జ్ స్వరూప ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు సుమారు 81 కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జ్ కాటం స్వరూప మాట్లాడుతూ వివిధ కేసులలో కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. లోక్ అదాలత్లను కక్షిదారులు వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరెంట్ మురళీధర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండే కార్ యాదిలాల్, ప్రధాన కార్యదర్శి దుద్దు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ కోశాధికారి కొప్పు కృష్ణ,క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వస్పుల మల్లేష్, న్యాయవాదులు గణేష్ గౌడ్, జగన్ గౌడ్, ఆంజనేయులు, శేఖర్ పాల్గొన్నారు.

ఇసుక తయారీ కేంద్రాలు కూల్చివేత

విశాలాంధ్ర – ఆమనగల్లు : ఆమనగల్లు మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామ శివారులోని గ్రామానికి చెందిన పర్వతాలు, శ్రీశైలం లు అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక ఫిల్టర్ (బెడ్ల)ను రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి కూల్చి వేసినట్లు ఆమనగలు ఎస్సై బి. వెంకటేష్ తెలిపారు. వ్యవసాయ పొలాల్లోంచి మట్టిని తరలిస్తూ అక్రమంగా ఇసుక ఫిల్టర్ల ద్వారా కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారని ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీసు అధికారులు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇసుక ఫిల్టర్ ల ద్వారా కృత్రిమ ఇసుకను తయారు చేస్తే వారు పై కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. కృత్రిమ ఇసుక తయారుకు పాల్పడుతున్న పర్వతాలు, శ్రీశైలం లను అరెస్టు చేసి బైండోవర్ చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. ఫిల్టర్ ఇసుక తయారీ, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి :సీపీఐ

విశాలాంధ్ర, మేడిపల్లి: మేడిపల్లి మండలం సీపీఐ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం సీపీఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దండు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి దామోదర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉమా మహేష్ అండ్ జి దామోదర్ రెడ్డిలు మాట్లాడుతూ సిపిఐ పార్టీ 100 సంవత్సరాల వారోత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, నవంబర్ 20న సిపిఐ పార్టీ ప్రచార జాత మేడిపల్లి చౌరస్తాలో సాయంత్రం 4గంటలకు మీటింగ్ కు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మేడిపల్లి మండలంలో ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేస్తున్న కబ్జాదారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జంట కార్పొరేషన్‌లో ఎక్కడ చూసిన పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాల్లో దర్శన మిస్తున్నాయని వీటిని కార్పొరేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి జే లక్ష్మి, మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు సిహెచ్ మాధవి, నాగరాజు, కె ప్రమీల, కె.మహాలక్ష్మి, రమాతార, అనిత, ఎండి అన్వర్, భూతం ఐలయ్య, కొమురయ్య, బాపురాజు, డి.మధార్, రచ్చ శ్యామ్, కనకయ్య, బి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం ఆధార్ పార్టీతోనే సాధ్యం

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణలో సామాజిక న్యాయం ఆధార్ పార్టీతోనే సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఈడ శేషగిరిరావు గౌడ్ అన్నారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఆధార్ పార్టీ రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఉచిత విద్య, వైద్యం, న్యాయం కోసం తమ పార్టీ విస్తృతంగా కృషి చేస్తుందన్నారు. రైతు సంక్షేమం వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు ఆర్థిక సహాయం మహిళా రైతులకు ప్రోత్సాహం రైతు కూలీలు కౌలు రైతులకు ఆర్థిక సహాయం అందేలా పోరాటం చేస్తామన్నారు. అన్ని రంగాల్లో అందరికీ సమాన అవకాశాలు నిరుద్యోగ భృతి 5000 ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల పెంపు స్వయం ఉపాధికై ఆర్థిక సాయం ప్రభుత్వంగ సంస్థల పరిరక్షణ తమ ధ్యేయమన్నారు. మహిళల అభ్యుదయం మహిళా రిజర్వేషన్లు మహిళా రైతులకు సంవత్సరానికి 20వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. యువతకు ఉపాధి పారిశ్రామిక అభివృద్ధి కొత్త పరిశ్రమ స్థాపన ఉద్యోగుల కల్పన యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. ఆదార్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబోజి బుడ్డయ్య, ఆదార్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ అలం వెంకటేశ్వర్లు, జహీరాబాద్ కాంటెస్టెడ్ ఎంపీ చావగాని మణి, మెదక్ జిల్లా అధ్యక్షులు చిక్కడపల్లి నవీన్ కుమార్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎం ఎం గౌడ్, రంగా రెడ్డి జిల్లా గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య ముసుగులో ఎన్నికలు : సీపీఐ

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరగటం ఒక ప్రక్రియ, మన దేశంలో ప్రజాస్వామ్య ముసుగులో నడుస్తున్న ఎన్నికల ప్రకారం బీహార్ రాష్ట్రంలో ఈ నెల 9న ఎన్నికలు జరిగాయని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ తెలుపుతూ, ఈ ఎన్నికలు అధికారుల లెక్కల ప్రకారం, వార్తా పత్రికలలో వచ్చిన సమాచారం ప్రకారం బీహార్ రాష్ట్రంలో పోలింగ్ అయిన ఓట్ల శాతం 66.91., మొత్తం ఓట్లు 7.42 కోట్లు. కానీ పోలైన మొత్తం ఓట్లు అసలు ఓట్లకన్నా అధికంగా 7.45కోట్లు పోలయ్యాయి. అంటే మొత్తం ఓట్ల కన్నా 3 లక్షల ఓట్లు ఎక్కువగా పోలైనట్లు తెలుస్తుంది. పోలింగ్ శాతం ప్రకారం అసలు పోలింగ్ కావాల్సిన ఓట్లు 4.96 కోట్లు. ఎలక్షన్ కమీషన్ లెక్కల ప్రకారం పోలైన ఓట్లు 7.45కోట్లు. దీని ప్రకారం

2.49కోట్ల ఓట్లు అధికంగా పోలైనట్లు తెలుస్తున్నది. 2.49 కోట్లు ఎవరు అనుమతించారు. వారు ఓటు వేసే అర్హత ఎలా సంపాదించారో అనేది బ్రహ్మరహస్యం. ఈ రహస్యాన్ని బద్దలు కొట్టాలంటే విచారణ జరిపించాలని ఆయన అన్నారు. అందుకొరకు సుప్రీం కోర్టు ప్రస్తుత జడ్జీతో నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలు తెలిసే వరకు అవకతవకలతో జరిగిన బీహార్ ఎన్నికలను రద్దు చేయాలని, కుట్రదారులను ప్రజల ముందు నిలబెట్టాలి. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. భారతదేశంలోని ప్రజా స్వామ్యాన్ని కాపాడి, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని ఆయన కోరారు. ప్రజలను మభ్యపెడితే సమాజంలో అఘాయిత్యాలు, అల్లకల్లోలు ప్రబలే అవకాశం ఏర్పడుతుందని హెచ్చరించారు. అందుకే వెంటనే బీహార్ రాష్ట్రంలో 9న జరిగిన పోలింగ్, 11న జరిగిన కౌంటింగ్ మొత్తం అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను పూర్తిగా సస్పెండ్‌చేసి విచారణ జరిపించి, దేశాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర–కుత్బుల్లాపూర్: విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి విజ్ఞాన బో ట్రీ స్కూల్ లో విద్యార్థులు నిర్వహించిన మోడల్ ఐక్యరాజ్య సమితి కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డితో పాటు మాజీ ఐఏఎస్ అధికారిణి పూనం మాల కొండయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తుకు కలలు,క్రమశిక్షణ,సంకల్పం ముఖ్యమని, తల్లిదండ్రులు చెప్పింది నచ్చక పోతే తమ ఆకాంక్షల గురించి వివరంగా చెప్తే తప్పనిసరిగా ప్రోత్సహిస్తారని తెలిపారు. ఈ కాలంలో అభివృద్ధిలో స్త్రీ పురుషభేదం లేదని, క్రీడలు వ్యక్తిత్వ వికాసంలో కీలకపాత్ర పోషిస్తాయని,క్రీడలను కూడా హాబీగా వృత్తిగా స్వీకరించవచ్చని తెలియజేశారు.విజయం ఓటమి ఒకే నాణేనికి రెండు వైపులని,డిజిటల్ యుగంలో సాంకేతికతను సమర్థవంతంగా, జాగ్రత్తగా ఉపయోగించాలని హెచ్చరించారు. విజ్ఞాన్–విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్థానిక జాతీయ అంశాలతో పాటు అంతర్జాతీయ

అంశాలలోకూడ అవగాహన కలిగించటం ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. మాలకొండయ్య మాట్లాడుతూ మోడల్ యునైటెడ్ నేషన్స్ సమావేశంలో ప్రతినిధి తమను తాము ప్రదర్శించుకునే విధానం వారి విశ్వాసం,స్పష్టత,దౌత్య పరిపక్వత గురించి చాలా తెలుస్తాయని ఆమె నొక్కి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు మానవ హక్కులు,ఆర్థిక అభివృద్ధి,వేగంగా పెరుగుతున్న గ్లోబలైజేషన్,ఉగ్రవాదం మొదలైన అంశాల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నయని,వాటిని పరిష్కరించడానికి యువత చొరవ తీసుకోవాలని, వాతావరణ మార్పులు ముప్పు గురించి కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండి,మెరుగైన జీవితం కోసం క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ వైట్ చైర్పర్సన్ రాణి రుద్రమదేవి మాట్లాడుతూ విజ్ఞాన్ విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి కృషి చేస్తుందని,విజ్ఞాన్ విద్యార్థుల కోసం ఈవెంట్లు నిర్వహిస్తుందని,నిత్యం ఏదో ఒక ఈవెంట్ పాఠశాలలో జరుగుతుందని,ప్రతి విద్యార్థి ఏదో ఒక ఈవెంట్ లో పాల్గొనేలా చూస్తామని,అలాగే వార్షికోత్సవం లాంటి కార్యక్రమాలు ప్రోగ్రామ్స్,బడ్జెట్, రిపోర్టులు తయారుచేసి చదవడం మొదలైనవన్నీ పూర్తిగా విద్యార్థులే చూసుకుంటారని,ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకోవడం,వారికి పుస్తకాలు అందజేయడం, వృద్ధాశ్రమాలకు సేవలను అందించడం,దానధర్మాలు చేయడం లాంటి కమ్యూనిటీ సర్వీసెస్ విజ్ఞాన్ ప్రోత్సహిస్తుందన్నారు.చదువుతోపాటు క్రీడలకు,ఇతర అంశాలకు కూడా కర్కులంలో ప్రాధాన్యమిస్తామని, స్ఫూర్తిదాయకమైనటువంటి వ్యక్తులను తీసుకువచ్చి విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్శ్రీమతి ఆర్ పద్మావతి,వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి ఏవిఎన్ పద్మజ,విద్యార్థులు, తల్లిదండ్రులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

20 నుంచి ఇండియన్ ఫొటో ఫెస్టివల్

విశాలాంధ్ర – హైదరాబాద్ : భారత దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఫొటో ఫెస్టివల్ 11వ ఎడిషన్ నవంబర్ 20 నుండి జనవరి 4 వరకు మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ లో జరుగనుంది. ఫొటో జర్నలిజం నుండి లలిత కళ వరకు, డాక్యుమెంటరీ నుండి ల్యాండ్‌స్కేప్ వరకు కేవలం ఒక్క భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అద్భుత ఫొటో,డాక్యుమెంటరీ, దృశ్యాలను ఈ ఇండియన్ ఫొటో ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారు. ఈ సంవత్సరం హైదరాబాద్‌లో నిర్వహించే ఐపీఎఫ్ ఎడిషన్‌లో సోలో ఎగ్జిబిషన్‌లు, గ్రూప్ షోకేస్‌లు, ఆర్టిస్ట్ టాక్స్, వర్క్‌షాప్‌లు, డాక్యుమెంటరీ ఫిల్మ్ స్క్రీనింగ్‌లు ఉంటాయి. ఈ ఫొటో ఫెస్టివల్ ఎడిషన్ కోసం ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల నుండి 820 ఎంట్రీలు వచ్చాయి. వీటిని నిష్ణాతులైన జ్యూరీ సభ్యులు – నికోల్ తుంగ్ (ఫొటో జర్నలిస్ట్, VII ఫొటో), గురిందర్ ఒసాన్ (ఫొటో ఎడిటర్, ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా), సుకృతి అనా స్టానేలీ (క్రియేటివ్ డైరెక్టర్, ది కారవాన్), మాధవన్ పిళ్లై (ఫొటోగ్రాఫర్ & క్యూరేటర్) ఫైనలిస్టులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగే ప్రధాన ఫొటో ఎగ్జిబిషన్లలో శాశ్వత ముసుగులు – అలెశాంద్రో సెలాంటే (బ్రెజిల్), రెయిన్ డాగ్స్ – రోహిత్ చావ్లా (భారతదేశం), బెటర్ డేస్ – సెంగు కిమ్ (దక్షిణ కొరియా): "స్లో ఫొటోగ్రఫీ, ముర్కీ వాటర్స్ – ది కారవాన్ x ఎం. పళని కుమార్ (భారతదేశం), సూడాన్: యుద్ధ సమయంలో – గైల్స్ క్లార్క్ (UK): సూడాన్, లింగరింగ్ షాడోస్ – నజానిన్ అలిపూర్ జెడ్డీ (ఇరాన్), స్లాష్ అండ్ బర్న్ – గ్లోరియానా జిమెండాజ్ (కోస్టా రికా), ఫ్రంట్‌లైన్స్ ఆఫ్ డిగ్నిటీ, షేడెడ్ స్పైస్ మరియు ఇతర ప్రేమ కథలు – మేరీలిస్ విగ్నేయు (ఫ్రాన్స్), నో మ్యాన్స్ ల్యాండ్ – ఎల్కే స్కోలియర్స్ (బెల్జియం), టాబూతో వంట – హృదయ సదానంద్ (భారతదేశం) లచే ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. జెన్నిఫర్ ఆల్ఫోన్స్ దర్శకత్వం వహించిన నాగోబా జాతర తో పాటు అనేక అంశాలపై డాక్యుమెంటరీలు ప్రదర్శన ఉంటుంది. నవంబర్ 20 వతేదీ సాయంత్రం 5:30 గంటలకు స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఐపీఎఫ్ 2025 – ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమమే ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలియ చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఫొటో ఫెస్టివల్ లో పాల్గొనేందుకు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు www.indianphotofest.comఅనే వెబ్ సైట్ ను సందర్శించాలని జయేష్ రంజన్ ఒక ప్రకటనలో తెలిపారు.

నవభారత నిర్మాణానికి పటేల్ కృషి మహత్తరం : కలెక్టర్

విశాలాంధ్ర – కొత్తగూడెం అర్బన్ : నవభారత నిర్మాణం కోసం కలలు కని నిరంతరం కృషి చేసిన మహా వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు పయనించాలని పిలుపునిచ్చారు. శనివారం జన్జాతీయ గౌరవ దివస్, బిర్సా ముండ జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున సభ, పాదయాత్ర నిర్వహించారు. సర్దార్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని రైల్వే స్టేషన్ ఆవరణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ ఖమ్మం సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేసారు. పటేల్, భరతమాత చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఐక్యత పాదయాత్ర ను జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో స్వేచ్ఛ కోసం తపించేవారన్నారు. ఎన్ని భాషలు మాట్లాడిన ఎన్ని ప్రాంతాలు ఉన్న మనమందరం ఒకటేనని పటేల్ చాటి చెప్పేవారని గుర్తు చేసారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటి చేయడంలో సర్దార్ పటేల్ పాత్రను కొనియాడారు. ఈ సందర్భంగా మేరా యువభారత్ ఖమ్మం అకౌంట్స్ అధికారి కె. భాను చందర్ మాట్లాడుతూ యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ పేర యూనిటీ మార్చ్ – 2025 నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డి ఎస్పి. షేక్ అబ్దుల్ రెహ్మాన్, డి.వై.ఎస్.ఓ పరంధామ రెడ్డి, ఎన్.సి.సి నయీబ్ సుబేదార్ లక్ష్మణ్, జిల్లా ఎన్ఎస్ ఎస్ కన్వీనర్ డా.వేముల కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి. పద్మ, ప్రోగ్రాం ఆఫీసర్ కె. భాను చందర్, జాగృతి యూత్ అసోసియేషన్ సయ్యద్ షారుక్ ఇమ్రాన్, మహిళా సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సుమారు 1000 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసిల సంక్షేమాభివృద్దే పోలీసుల ప్రధాన లక్ష్యం

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల ఆదివాసి ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా జిల్లా పోలీసులు పని చేస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ కార్పొరేషన్ నరేందర్ అన్నారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చర్ల మండలంలోని ఛత్తీస్ఘడ్ రాష్ట్ర సరిహద్దు గ్రామాలైన బక్కచింతలపాడు, కిష్టారంపాడు, వీరాపురం, రాళ్ళపురం, తిమ్మిరిగూడెం, కమలాపురం గ్రామాల ప్రజలకు తిమ్మిరిగూడెంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 250 కుటుంబాలకు నెస్లేల్ కంపెనీ అందించిన నిత్యవసర సరుకులను పోలీసులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాన్ని ఓఎస్డి నరేందర్ తోపాటు భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ సందర్శించారు. సిఆర్పిఎఫ్ బేటాలియాన్ అసిస్టెంట్ కమాండెంట్ వివేక్ రంజన్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓఎస్డి మాట్లాడుతూ ఎస్పీ సారథ్యంలో ఏజెన్సీ ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ఆదివాసీలకు విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతుకు భరోసా

విశాలాంధ్ర కారేపల్లి : తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమని కారేపల్లి సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు.శనివారం కారేపల్లి మండల పరిధిలోని మాధారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు.మొక్కజొన్న పంట అధికంగా పండిస్తున్న మాధారం ప్రాంతంలో కొనుగోలు కేంద్రం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సహకారంతో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సింగరేణి మండలంలో విశ్వనాధపల్లి, మాధారం,ఎర్రబోడు,సింగరేణి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సైతం ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు దారావత్ మంగీలాల్,డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య,కొత్తూరి రామారావు,కార్యదర్శి బొల్లు హనుమంతరావు,ఏఈవో చంద్రకళ,మాజీ ఎంపీటీసీ భాగం రూపా నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్, రైతు ప్రతినిధులు బానోత్ రాంమూర్తి కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కిలారి అప్పారావు,రైతు నాయకులు బానోత్ రాంమ్మూర్తి,ఇమ్మడి

తిరుపతిరావు,రైతులు భాగం వెంకటప్పారావు,భాగం నాగేశ్వరరావు,కాసాని లక్ష్మీనారాయణ,పాపినేని నాగేశ్వరరావు,అంగోత్ మిత్రు, రఘు,పిల్లలమర్రి వీరన్న,కుర్ర శ్రీను,తొగరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ప్రగతికి నమూనా

విశాలాంధ్ర, మేడిపల్లి: తెలంగాణ రాష్ట్రంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతికి నమూనా అని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం భౌగోళిక శాస్త్ర విభాగం, ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన సుమారు 30 మంది (దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన) పరిశోధన విద్యార్థులు, వివిధ యూనివర్సిటీల అధ్యాపకులు, ఉద్యోగులు శనివారం ఉదయం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పరిశోధన విద్యార్థులతో జరిగిన స్టూడెంట్స్ విత్ మేయర్ ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా పార్కులు, తడి, పొడి చెత్త సేకరణ,

ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కు, వైకుంటధామం, కోవిడ్ సెంటర్ నిర్వహణ, వార్డు ఆఫీసర్స్ వ్యవస్థ, సెట్విన్ బ్రాంచ్ ఏర్పాటు, విద్యావాలంటీర్ల నియామకంతో పాటు ప్రజల భాగస్వామ్యం తో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు, వాటి వలన ప్రజలకు కలుగుతున్న మేలును మాజీ మేయర్ దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధన విద్యార్థులకు వివరించడంతో పాటు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మాజీ మేయర్ సమాధానాలు చెప్పారు. ప్రజలకు సేవ చేయాలనే తమ సంకల్పం ఉంటే ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేయొచ్చన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ప్రత్యేక నిధులు ఇచ్చి అభివృద్ధి పనులను ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వైకుంఠదామంను వీక్షించి, అందులో ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన విద్యార్థుల ఫీల్డ్ విజిట్, ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ ఉషా, డా. సుదర్శన్, వివిధ రాష్ట్రాలకు/విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

విశాలాంధ్ర–కుత్బుల్లాపూర్: పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మహావీర్ ఇంటర్నేషనల్ చారిటబుల్ ఆర్గనైజేషన్ ద్వారా సీడీకే గ్లోబల్ ఇన్వెస్టర్స్ వారి సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ మరాఠీ బస్తీలోని ఎంపీపీ స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు మాజీ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి పిల్లలకు స్కూల్ బ్యాగ్ తో పాటు నోట్ బుక్ పెన్సిల్లు కంపస్ బాక్సులు అందజేశారు.ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని దాతల సహకారంతో ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో గ్లాండ్ ఫార్మా కంపెనీ సహకారంతో సూరారం కాలనీలో ఉన్నతపాఠశాలలో తరగతి గదుల నిర్మాణం చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. అన్ని దానాలలో విద్యధానం గొప్పదని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విషయంలో సహకరిగా పనిచేస్తానని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, చారిటబుల్ చైర్మన్ వీణ జెన్,స్కూల్స్ వింగ్ ఇన్చార్జ్ రేష్మ సంచిట్టి,పాఠశాల హెడ్ మినిస్ట్రీస్ సంగీత,టీచర్లు గాయత్రీ దేవి, శిరీష, నాగమణి,డివిజన్ మహిళా ప్రెసిడెంట్ మంగ , వరలక్ష్మి, ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహాపడిపూజ

విశాలాంధ్ర –మొయినాబాద్ : కనకమామిడి గ్రామంలో అయ్యప్ప మహాపడిపూజ గురుస్వామి రామచందర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కనక మామిడి గ్రామానికి చెందిన కుంటి సంపూర్ణ వెంకట్ రెడ్డి నిర్వహించిన పడిపూజకు అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామిని స్మరిస్తూ భజన కీర్తనలతో పాటలు పాడారు.స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

44వ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్

విశాలాంధ్ర – హైదరాబాద్ : ప్రతిష్మాత్మక ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్.. (ఐఐటీఎఫ్) న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో శుక్రవారం నాడు మొదలైంది. ఈ ఫెయిర్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన పవిలియన్ ఏర్పాటు చేశారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.శశాంక్ గోయెల్ నేడు తెలంగాణ పవిలియన్ ను ప్రారంభించారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ 2025లో.. రాష్ట్ర పరిశ్రమలు,ఎగుమతుల ప్రోత్సాహక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని.. నల్గొండ, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, జనగామ, వరంగల్ అర్బన్, నారాయణపేట్ జిల్లాలకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చేతి వృత్తులకు సంబంధించిన వస్తువులు, చేనేత వస్త్రాలు, గిరిజన ఆభరణాలు, చేతితో తయారు చేసిన గాజులు, హెర్బల్, మెడికల్ ఉత్పత్తులు, పోచంపల్లి వస్త్రాలు, ఫ్యూజన్ బ్యాగ్స్‌ను ఈ స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఈసారి నిర్వహించిన ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో.. తెలంగాణ స్టాల్స్ ప్రత్యేక గుర్తింపు పొందాయి. తాజా ట్రేడ్ ఫెయిర్‌లో పోచంపల్లికి చెందిన స్పెషల్ ఇక్కత్ చేనేత వస్త్రాలను ప్రదర్శనకు ఉంచారు. ముఖ్యంగా ఇక్కత్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, వాస్‌కోట్స్, దుప్పట్టా, కాటన్ బెడ్‌షీట్స్, షర్టింగ్ ఫ్యాబ్రిక్స్ తదితర వైరైటీలను అందుబాటులో ఉంచారు. ఈ ట్రేడ్ ఫెయిర్ రెండు వారాలు కొనసాగనుంది. మన దేశ ఐక్యత, వైవిధ్యం, జాతీయ పురోగతిని సూచిస్తూ జరుపుకునే "ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్" అనే ఇతివృత్తాన్ని ఈ 44వ ఎడిషన్ హైలైట్ చేస్తుంది.

పార్లమెంట్ ప్రాంగణంలో లక్కీ షా బంజారా విగ్రహం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: అఖండ భారత దేశంలోని ప్రముఖ వ్యాపారుల్లో ఒకరు అయిన లక్కీ షా బంజారా విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసి భారత రత్న ఇవ్వాలని తెలంగాణ గోర్ సేన అధ్యక్షుడు ధరావత్ రాం దాస్ నాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశల వారిగా ఉద్యమం చేపట్టుతామని ఆయన హెచ్చరించారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్కీ షా జీవిత చరిత్ర ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాల్లో చేర్చాలని, ముఖ్యంగా గోరు బోలి భాషాను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పెట్టాలని కోరారు. దిల్లీ ప్రజలు బంజారా సమాజం కోసం తన ప్రాణాలను అర్పించిన గొప్ప మహనీయుడు లక్కీ షా అని ఆయన కొనియాడారు. ఆయన 1675లో నవంబర్ 24–25 తేదీల్లో దిల్లీ నగరాన్ని వీడారని, ఆ రోజు ను పురస్కరించుకుని అన్ని తండాల్లో, నగరాల్లో లక్కీ షా బంజారా భోగ్ భండారో పూజ కార్యక్రమం, జీవిత చరిత్రపై తండాల్లో చదువుకునే యువకులు ఉద్యోగస్తులు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోర్ సేన నాయకులు రాజు నాయక్, తిరుపతి నాయిక్, హరిలాల్ నాయక్, రమేష్ రాథోడ్, శ్రీనివాస్ నాయక్, సునీల్ నాయక్, రాజు చౌహాన్, సూర్య ప్రకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE:

The General public are hereby informed that **M/s. FUTURE FINCORP** a partnership Firm bearing PAN: **AAKFF2432R** and Firm Registration No. **196 of 2025** registered at **R.O Rangareddy**, having its registered office at **Flat No 210, Aparna Green, Nanakramguda, Serilingampally, Rangareddy, Telangana, India - 500032** represented by its partners **SRIKANTH GOGINENI** AND **M SARATH BABU** has decided to close its bussiness operations and and proceed with the dissolution of the said firm

Any person having any claim or objection in respect of the firm is hereby requested to submit the same in writing to the undersigned or contact 6305891714 within one week from the date of publication of this notice. Failing which, the firm will proceed further with the dissolution process.

శ్రీసిటీకి ఆరువేల ఎకరాలిస్తాం

- అభివృద్ధికి నమూనాగా మారుస్తాం: సీఎం చంద్రబాబు
- శ్రీసిటీలో ఐదు కంపెనీలు ప్రారంభం
- రేమాండ్స్ ప్రాజెక్టులకు శంకుస్థాపన



విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: శ్రీసిటీని అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దుతామని, ఆరు వేల ఎకరాల భూములు కేటాయిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. శ్రీసిటీలో ఐదు కంపెనీలను ప్రారంభించారు. రేమాండ్స్ సంస్థ రూ.1201 కోట్లతో చేపట్టే ప్రాజెక్టులు సిల్వర్ స్పార్క్ అపారెల్ పార్క్, జేకే మైనీ గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్, జేకే మైనీ గ్లోబల్ ప్రెసిషన్ లిమిటెడ్ యూనిట్లకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఈ కంపెనీలు ఏర్పాటు కాబోతున్నాయి. రాప్తాడులో రూ.497 కోట్లతో సిల్వర్ స్పార్క్ అప్పారెల్ మాన్యుఫాక్చరింగ్ పార్క్, గుడిపల్లిలో రూ.441 కోట్లతో ఆటో కాంపోనెంట్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్, టెకులోదు వద్ద రూ.262 కోట్లతో ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్‌ను రేమాండ్ గ్రూప్ ఏర్పాటు చేయనుంది. సీఐఐ సదస్సులో భాగంగా వర్చువల్‌గా శంకుస్థాపన జరిగింది. శ్రీసిటీలో కంపెనీల ఏర్పాటుకు వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ దేశంలో అత్యుత్తమ పారిశ్రామిక టౌన్ షిప్ శ్రీసిటీ అని అన్నారు. డైకెన్, ఇసుజూ, క్యాడ్బరీ వంటి ప్రముఖ సంస్థలు తమ ఉత్పత్తులను శ్రీసిటీ నుంచి ప్రపంచానికి అందిస్తున్నాయని చెప్పారు. బెల్జియం, జపాన్, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాలకు చెందిన ఆరోగ్య సంరక్షణ, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, వైద్య పరికరాల కంపెనీలకు రూ.8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులిచ్చామన్నారు. గత రెండు రోజులుగా రూ.13 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయని, 18 నెలల్లోనే రూ.22 లక్షల కోట్లు వచ్చాయని చెప్పారు. 50కుపైగా దేశాల కంపెనీలు శ్రీసిటీ నుంచి పనిచేస్తాయని సీఎం అన్నారు. 1.50 లక్షల మంది ఉద్యోగాలతో శ్రీసిటీ అభివృద్ధి మోడల్‌గా మారుతుందని చెప్పారు. శ్రీసిటీ సమీపంలోనే ఎయిర్ స్ట్రిప్ నిర్మించే ఆలోచన ఉందన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం దేశంలోనే తొలిసారిగా ఏపీ ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు భారీ ప్రణాళికలు వేస్తున్నామన్నారు. 2028 నాటికి శ్రీసిటీని ఉత్తమ పారిశ్రామిక ప్రాజెక్టుగా మారుస్తామన్నారు.

శ్రీసిటీలో 12 ప్రాజెక్టులకు ఎంఓయూలు

ఇక శ్రీసిటీలో మొత్తంగా 12 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2320 కోట్ల విలువైన పెట్టుబడులపై ఎంఓయూలు కుదిరాయి. శ్రీసిటీలో ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా ఉత్పత్తుల ప్రాజెక్టుల ఏర్పాటుకు ఈ ఎంఓయూలను రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంది. ఈ పెట్టుబడుల ద్వారా 12,365 మందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశముందన్నారు.

వచ్చే మూడేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న లక్ష్యాన్ని వచ్చే 3-4 ఏళ్లలోనే చేరుకుంటామని, అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని చంద్రబాబు తెలిపారు. 'రాయలసీమలో ఇప్పటికే చాలా పరిశ్రమలు వచ్చాయి. 2014-19లో కియా కార్ల ఫ్యాక్టరీ వచ్చింది. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ వంటివి ఏర్పాటు కాబోతున్నాయి. ఏరోస్పేస్, రక్షణ కారిడార్లు కూడా రానున్నాయి. అనంతపురం జిల్లాకు రేమాండ్స్ సంస్థ వచ్చింది. పెట్టుబడులు పెడుతోంది. కియా దగ్గర్లోనే రేమాండ్స్ సంస్థ ఆటో కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంటును ఏర్పాటు చేయబోతోంది. 2027 నాటికి ప్రాజెక్టులు ప్రారంభిస్తామని రేమాండ్ హామీ ఇచ్చింది. రూ.1201 కోట్ల పెట్టుబడులతో మూడు వేర్వేరు పరిశ్రమల ద్వారా 6,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయి. విమానాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా వాటి ఉత్పత్తి పెరగాలి. రేమాండ్ గ్రూప్ ఏరోస్పేస్, రక్షణ అవసరాలను తీర్చేలా ఉత్పత్తులు తయారు చేయటం అభినందనీయం' అని ముఖ్యమంత్రి అన్నారు.

పరిశ్రమల స్థాపనకు ఏపీ అనుకూలం

పరిశ్రమలు స్థాపించడం కోసం ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలుగా అనుకూలంగా ఉందని రేమాండ్స్ గ్రూప్ గౌతమ్ మైనీ అన్నారు. పరిశ్రమలకు వేగంగా అనుమతులు వస్తున్నాయన్నారు. పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. 25 ఏళ్ల నుంచి ఏరో స్పేస్ రంగంలో ఉన్నామని, రక్షణ రంగంలో కూడా పట్టు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామన్నారు.

ఇంధన రంగానికి మెరుగైన రక్షణ: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఇంధన భద్రత కోసం మెరుగైన రక్షణ విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజలకు లబ్ధి కలిగేలా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలలో టెక్నాలజీ వినియోగించాలన్నారు. సీఐఐ సదస్సులో భాగంగా ఇంధన భద్రత, విద్యుత్ రంగంలో అధునాతన టెక్నాలజీ వినియోగం కోసం ప్రపంచ ఆర్థిక ఫోరంతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఏర్పాటుపై డబ్ల్యూఈఎఫ్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇంధన రంగంలో అవసరమైన సైబర్ రక్షణ వ్యవస్థలు తయారు చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వినియోగించే ఆలోచన చేస్తోంది. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఏపీలో ఉత్పత్తి చేయాలన్నదే లక్ష్యమని చెప్పారు. అతితక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసి సరఫరా చేయాలన్నదే తమ ఆలోచనగా తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు చేసి వినియోగాన్ని పెంచగలిగినట్లు వెల్లడించారు. ఏఐ లాంటి టెక్నాలజీ ద్వారా విద్యుత్ పంపిణీ నష్టాలు, సరఫరా వ్యయం తగ్గించాలి. అప్పుడే ఇంధన రంగంలో సుస్థిరత సాధ్యమని అన్నారు. వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలు, గృహాలు ఇలా అన్నింటికీ విద్యుత్ అవసరమని, విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు... మరింత విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా ప్రజలకు లాభాలు కలిగించేలా...మరింత

మేలు జరిగేలా...ఎక్కడికక్కడే విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా విధానాలను కూడా తయారు చేసుకుంటున్నామని చంద్రబాబు చెప్పారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలనుగణనీయంగా తగ్గించుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో ప్రజలకు ప్రయోజనాలు కలిగే వ్యవస్థలు ఉండాలని,. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద ఏపీలో సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టును వేగంగా చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు.

తక్కువ ఖర్చులో విద్యుత్ తయారీ: నారా లోకేశ్

ఆరు గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ విశాఖకు తీసుకురాగలిగామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. తక్కువ వ్యయంతో నాణ్యమైన విద్యుత్ తయారీ సవాల్‌గా మారిందన్నారు. సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెజిలియన్స్ సెంటర్ అనేది విద్యుత్ వ్యవస్థల రక్షణకు పనిచేస్తుందని తెలిపారు. ఆ దిశగా సీఎం ఆదేశిస్తే మంత్రులు, అధికారులు సహకారం ఉంటుందని చెప్పారు. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలను కోరుతున్నట్లు లోకేశ్ తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఇంధన వ్యవస్థల రక్షణ కోసం సీఈసీఆర్సీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏపీ 160 గిగావాట్ల గ్రీన్ విద్యుత్ ఉత్పత్తి దిశగా భారీ పెట్టుబడులు వస్తున్నాయని, ఈ సమయంలో విద్యుత్ వ్యవస్థల సెక్యూరిటీ చాలా ముఖ్యమన్నారు. ప్రపంచ ఆర్థిక ఫోరం ఎండీ జేరేమీ జర్గన్స్ మాట్లాడుతూ ఏఐ ట్రాన్సిషన్ సమయంలో ఇంధన వ్యవస్థల భద్రత కీలకమన్నారు. ఏపీలో ఇంధన భద్రత, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవటం అభినందనీయమని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి, ఇంధన భద్రత విషయంలో భారత్‌లో వేగంగా నిర్ణయాలు జరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో వ్యవస్థల రక్షణ అత్యంత కీలకమైన అంశమని అన్నారు. సామాజిక, ఆర్థిక స్వావలంబన సాధించాలంటే ఈ తరహా కేంద్రాలు అవసరమని జేరేమీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీ మార్గదర్శిగా ఏపీ

23 సంస్థలతో లోకేశ్ ఎంవోయూలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: క్వాంటం టెక్నాలజీ రంగంలో దేశానికి మార్గదర్శిగా వ్యవహరించే సామర్థ్యం ఏపీకి ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. భారతదేశ విజన్‌ను సాకారం చేసేలా క్వాంటం మిషన్, యాక్షన్ ప్లాన్, రోడ్ మ్యాప్ రూపొందించిన తొలి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీకి నాలుగు మూలస్తంభాలుగా క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు సంబంధించిన వినియోగ సందర్భాలు, పరిశోధనలను అభివృద్ధి చేయడం.. సాఫ్ట్ వేర్ అభివృద్ధి, ప్రతిభావంతమైన ఎకోసిస్టమ్ నిర్మించడం, ప్రతిష్టాత్మకమైన హార్డ్‌వేర్ మాన్యుఫ్యాక్చ రింగ్ ఉన్నట్లు లోకేశ్ తెలిపారు. ఆయన శనివారం సీఐఐ ప్రాంగణంలో జరిగిన క్వాంటం కంప్యూటింగ్‌పై సదస్సులో పాల్గొన్నారు. ఈ రంగంపై తనకు పరిమిత అవగాహన ఉన్నట్లు తెలిపారు. దీని గురించి ఇంకా నేర్చుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ క్వాంటం కంప్యూటింగ్ పాలసీ(2025-30)ని లోకేశ్ విడుదల చేశారు. ఇదే క్రమంలో క్వాంటం టెక్నాలజీ రంగంలో 23 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకు న్నారు. కార్యక్రమంలో సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ సెక్రటరీ కాటంనేని భాస్కర్, ఇండియా స్ట్రాటజిక్ ఇనీషియేటివ్స్ అండ్ అకాడ్ కాయిన్ హెడ్ సీవీ శ్రీధర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, ప్రైమస్ పార్టనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో-ఫౌండర్, సీఈవో దేవరూప్ ధర్, డైరెక్టర్ అండ్ సీటీవో అమిత్ సింగీ, క్యూఎన్ యూ ల్యాబ్స్ ఛైర్మన్, కో-ఫౌండర్ శ్రీనివాసరావు ఆలూరి, క్వాంట్రల్ ఓఎక్స్ కో-ఫౌండర్, సీఈవో విశాల్ ఛత్ర, మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్ మెంట్ సెంటర్ పార్టనర్ ఎస్ డీఈ-మేనేజర్ గణేష్ శ్రీనివాసన్, పాస్కల్ సీఈవో రాబర్ట్ మారో తదితరులు పాల్గొన్నారు.

పరకామణి కుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ: సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీటీడీ పరకామణిలో నెలకొన్న లోపాలు, వైఫల్యాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరకామణిలో జరిగిన దొంగతనంపై ఫిర్యాదు చేసిన నాటి ఏవీఎస్ఓ సతీశ్ కుమార్... రైలు పట్టాలపై శవమై తేలటం, దీనిని ప్రాథమికంగా వైద్యులు హత్యగా నిర్ధారణ చేయటం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలు పాత్రదారులు, సూత్రధారులు తప్పించుకోవటానికి అతడిని బలి తీసుకున్నట్టుగా భావించాల్సి వస్తుందన్నారు. ఈ కేసు వెలుగులోకి రావటానికి కారణమైన జర్నలిస్టు శ్రీనివాసులు తనకు రక్షణ కల్పించమని తిరుపతి ఎస్పి సుబ్బరాయుడికి శనివారం మొరపెట్టుకున్నారంటే పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుందన్నారు.

రవికుమార్ అనే నిందితుడిని చట్టప్రకారం జైలుకి పంపి చర్యలు తీసుకోకుండా రూ.140 కోట్ల ఆస్తులను టీటీడీ పేరిట రాయించుకుని ఫిర్యాదుదారు సతీశ్‌కుమార్‌తో లోక్ అదాలత్‌లో రాజీ చేయించటం పట్ల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

భూ చట్ట సవరణ తక్షణమే వెనక్కి

- ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల డిమాండ్
- 27న సీసీఎల్ఏ కార్యాలయం ఎదుట ఆందోళనకు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: భూ బదలాయింపు నిషేధిత చట్ట సవరణను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడాన్ని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు ఖండించాయి. పేదలకు ఓ వరం లాంటి చట్టాన్ని సవరణతో శాపంగా మార్చారని విమర్శించాయి. అసైన్డ్ భూములను 99 సంవత్సరాల లీజుకు ఇస్తామనడం ఎవరి కోసమని ప్రశ్నించాయి. పేదల భూములను పదో,పరకో ఇచ్చి లాక్కోవడానికి యత్నిస్తున్నారని దుయ్యబట్టాయి. తక్షణమే ఈ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వ మోసాలను ఎండగట్టేందుకుగాను ఈనెల 27వ తేదీ ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో సీసీఎల్ఏ ఆఫీస్ ముందు గ్రామీణ కష్టజీవులను కూడగట్టి ఆందోళనకు పూనుకుంటున్నామని నాయకులు ప్రకటించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం చర్చావేదిక ఉభయ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, దడాల సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ బలపరిచారు. ఆయన మాట్లాడుతూ చట్ట సవరణను విరమించుకోనిపక్షంలో ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పునరుత్పాదక ఇంధన కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చడంలో పేద రైతులు భాగస్వాములవుతారని, తద్వారా వచ్చే పరిశ్రమలలో వారి పిల్లలకు ఉద్యోగాలు లభిస్తాయని, పేదరికంలేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దవచ్చని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పడం విడ్డూరంగా ఉందని ఆవుల శేఖర్ వ్యాఖ్యానించారు. తాజా చట్ట సవరణతో ఎవరికి లాభం, ఎవరికి నష్టమో చెప్పాలన్నారు. అసైన్డ్ భూములను కారు చౌకగా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్లకు 99 ఏళ్ల లీజుకు ఇస్తామని చెప్పడం పేదలను మోసంచేయడమేనని దుయ్యబట్టారు. అసైన్డ్ భూములను 26 లక్షల ఎకరాలు భూ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. భూ బదలాయింపు నిషేధిత చట్టంలో అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేయరాదని... లీజుకు, కౌలుకు ఇవ్వకూడదని... అమ్మడం, కొనడం జరగరాదని స్పష్టంగా ఉందని గుర్తుచేశారు. ఈ చట్ట సవరణ కార్పొరేట్లకు లబ్ధికేనని విమర్శించారు. 34 లక్షల ఎకరాల అసైన్మెంట్ భూముల పట్టాలు పేదలకు ఇచ్చినప్పటికీ, అందులో 13 లక్షల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని తిరిగి తీసుకొని పేదలకు ఇవ్వాలని ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం దగ్గర మిగులు భూములు, ఇతర భూములు లక్షల ఎకరాలు పేదలకు పంచకుండా, 2013 నుంచి మోసం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నూటికి 60 మంది పేదల దగ్గర భూములు లేవని కేంద్ర గణాంకాల ద్వారా అర్థమవుతుందని అన్నారు. ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల అమలు చేయాలి: విల్సన్, కొటేశ్వరరావు

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల అమలుతోనే ప్రతి పేదోడి సొంత ఇంటికి స్థలము, సాగు భూమికి ఇబ్బంది ఉండదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరావు అన్నారు. ఆ సిఫారసులను బుట్టదాఖలు చేశారన్నారు. 1977లో పేదల ఆశాజ్యోతి ఎస్ఆర్ శంకరన్ 9/77 అసైన్డ్ భూముల భూ బదలాయింపు నిషేధిత చట్టాన్ని తెచ్చారని గుర్తుచేశారు. ఈ చట్టాన్ని 20 ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ వస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం సెక్షన్ 6 క్లాసు సవరించిందని, దీంతో పెత్తందారులకు, కార్పొరేట్లకు 99 సంవత్సరాలు లీజు పేరుతో భూములు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నారన్నారు. అసైన్మెంట్ భూములు పెత్తందారుల చేతుల్లో కాకుండా పేదల వద్దే ఉండాలని జల్లి విల్సన్, సీహెచ్ కొటేశ్వరరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు శివ నాగరాణి వందన సమర్పణతో చర్చావేదికను ముగించారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకుడు వెంకటరెడ్డి, గణేష్, ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశవరావు, సూర్యారావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు హరిబాబు, డీవైఎఫ్ఐ నేత రామన్న, ప్రజానాట్యమండలి నాయకుడు అనిల్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు సుబ్బారావమ్మ, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లా జిల్లాల నాయకులు కాబోతు ఈశ్వరరావు,ఉప్పె నరసింహారావుతో పాటు ఏలూరు, కృష్ణా జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

అల్‌ఫలాహ్ వర్సిటీలో తనిఖీలు

ఫరీదాబాద్: ఢిల్లీ పేలుడు కేసును పలు విభాగాలు దర్యాప్తు ముమ్మరం చేశాయి. ఉగ్ర కుట్రలో హర్యానాలోని ఫరీదాబాద్‌లో గల అల్-ఫలాహ్ యూనివర్సిటీ సిబ్బంది పాత్ర ఉండటం, తాజాగా మరో ఇద్దరు వైద్యులను అరెస్టు చేయడంతో విశ్వవిద్యాలయంపై మరింత నిఘా పెరిగింది. ప్రధాన నిందితుడు ఉమర్ నబీకి ఈ ఇద్దరిని స్నేహితులుగా గుర్తించారు. దీంతో క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం చేయడంతోపాటు ముమ్మర తనిఖీలు చేపట్టారు. తాజా పరిణామాలతో ఇక్కడ చదువుతున్న వందలాది మంది విద్యార్థులు ఇళ్ల బాట పట్టారు.

మహేశ్-రాజమౌళి సినిమా 'వారణాసి'

హైదరాబాద్: మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచరస్ మూవీకి 'వారణాసి' టైటిల్‌ను ఖరారు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా జరిగిన గ్లోబ్ ట్రోటర్‌వెంట్‌లో టైటిల్‌తో పాటు 'వారణాసి' ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో మహేశ్‌బాబు కనిపించారు. ఇందులో ఆయన రుద్ర పాత్రలో ప్రేక్షకులకు థ్రిల్ పంచనున్నారు. కథానాయిక మందాకినిగా ప్రియాంక చోప్రా, ప్రతినాయకుడు 'కుంభ'గా పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో అలరించనున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ మూవీని దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. 2027 వేసవిలో ఈ మూవీని విడుదల చేయనున్నారు.

గన్నవరం విమానాశ్రయంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా దంపతులకు స్వాగతం పలుకుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, నాయకులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, ఆవుల శేఖర్, మనోహర్ నాయుడు, జమలయ్య తదితరులు

పరుచూరి లోహిత్

మన్నవ రిషిత్

తన్నీరు ర్యాన్

ఆంధ్రప్రదేశ్ బాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి లోహిత్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ బాలల సంఘం (అఖిల భారత యువజన సమాఖ్య-ఏఐవైఎఫ్ అనుబంధ సంఘం) రాష్ట్ర అధ్యక్షులుగా పరుచూరి లోహిత్ (ఎన్టీఆర్ జిల్లా), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మన్నవ రిషిత్ (ఏలూరు జిల్లా), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తన్నీరు ర్యాన్ (బాపట్ల జిల్లా), గౌరవాధ్యక్షులుగా మందగల సాయికుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్‌గా లంకా గోవిందరాజులు ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర బాలల సమ్మేళనం కార్యక్రమంలో ఈ ఎన్నికలు జరిగినట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు శనివారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా బాణాల జాహ్నవి (విజయవాడ), జల్లిక భగత్ (గుంటూరు), లాస్య (శ్రీకాకుళం), మనోహర్ (నెల్లూరు), సహాయ కార్యదర్శులుగా పి.చైత్ర ప్రియ (రాజమండ్రి), అప్పరాజు శ్రీరామ్ (పల్నాడు), కోశాధికారిగా షణ్ముఖ ప్రియ (విజయవాడ), కార్యవర్గ సభ్యులుగా పంచదారల దీక్షిత (విజయవాడ), గుంజ మని (విజయవాడ), వసంత (నెల్లూరు), కడపకు చెందిన పి.సిరి, పి.వర్షిణి, పి.జెషికా, పి.వరుణ్, ఉప్పులూరి పుణ్య లక్ష్మి (ఏలూరు), జి.త్రినాథ సీన్ (విశాఖపట్నం), కె.కోటేష్ (అనంతపురం), పరుచూరి ధృతిశ్రీ (విజయవాడ) 21 మందితో నూతన కార్యవర్గం ఎన్నికయినట్లు తెలిపారు. బాలలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యల పరిష్కారం కోసం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ కోసం, బాలలు ఫోన్లు, ఇతర వ్యసనాలకు బానిసవ్వకుండా తీసుకోవలసిన చైతన్య కార్యక్రమాలపై బాలల సంఘం ముందుండి పని చేస్తుందని పరుచూరి రాజేంద్ర బాబు తెలిపారు.

20న విజయవాడలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీ ఉదయం విజయవాడ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్ర నాథ్ అధ్యక్షతన సెమినార్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.వెంకటసుబ్బయ్య తెలిపారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి పరిచయ కార్యక్రమం నిర్వహిస్తారని, అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సందేశం ఇస్తారని చెప్పారు. "ఫాసిజం-పాలక, పీడిత వర్గాలలో వైరుధ్యాలు" అనే అంశంపై మార్క్సిస్ట్ విశ్లేషకులు, కో కన్వీనర్, 'మేలుకో ఆంధ్రప్రదేశ్' కో కన్వీనర్ డి.రమేష్ పట్నాయక్ ఉపన్యసిస్తారన్నారు. అనంతరం కమ్యూనిజం మాసపత్రిక ఎడిటర్ చలసాని వెంకటరామారావు అధ్యక్షతన "హిందుత్వ-లౌకికవాదం-భారత రాజ్యాంగం" అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. మాజీ శాసనమండలి సభ్యుడు కె.ఎస్.లక్ష్మణరావు ప్రసంగిస్తారన్నారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలే సాంబశివరావు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందని వివరించారు.

అంధకారంలో విద్యార్థుల భవిత

ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 10.2 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఏర్పడిందని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆందోళన వ్యక్తంచేసింది. 2023-24, 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు సంబంధించిన రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటా రెడ్డి, అధ్యక్ష-కార్యదర్శులు నరహరి శిఖరం, జి.ఈశ్వరయ్య తెలిపారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు సత్వరమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. బకాయిల కారణంగా విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలను కోల్పోతూ మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. వడ్డీలకు డబ్బు తెచ్చి ఫీజులు చెల్లిస్తూ విద్యార్థుల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.